ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

మహిళ మరింత దర్జాగా..!



- సూపర్ సిక్స్‌లో మరో హామీ అమలు దిశగా అడుగులు
- సీఎం ప్రకటనతో సర్వత్రా హర్షం
- జిల్లాలో 13 లక్షల మందికి లబ్ధి

ఒంగోలు, కార్పొరేషన్, మే 30 (ఆంధ్రజ్యోతి): నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోంది. ఇప్పటికే పింఛన్‌ల పెంపుపై తొలి సంతకం చేయగా, ఇటీవల ఉచిత సిలిండర్ల పంపిణీ పథకాన్ని అమలు చేసింది. తాజాగా కడపలో జరిగిన టీడీపీ మహానాడు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళలకు మరో శుభవార్త చెప్పారు. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలోని మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ప్రకటించారు. ఒకవైపు లోటు బడ్జెట్, ప్రభుత్వ ఖజానాపై భారం పడుతున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. జిల్లాలో సుమారు 26లక్షల మంది వరకు జనాభా ఉన్నారు. అందులో సగానికిపైగా మహిళలే ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఆ ప్రకారం 13లక్షల మంది మహిళలకు రాష్ట్రంలో ఎక్కడికైనా బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం లభించనుంది.

ఆర్టీసీపై ఆర్థిక భారం.. అయినా అమలు

ప్రకాశం రీజియన్‌లో ఒంగోలు, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, పొదిలి డిపోలు ఉన్నాయి. వాటి పరిధిలోని 866 గ్రామాలకు అనుసంధానంగా 20 బస్ స్టేషన్లు ఉన్నాయి. అలాగే 484 ఆర్టీసీ బస్సులు ఉండగా వాటిలో 95 అద్దె ప్రాతిపదికన (హయ్యర్) నడుస్తున్నాయి. ఈ బస్సులన్నీ రోజుకు 2లక్షల కిలోమీటర్లు ప్రయాణికుల కోసం రాకపోకలు సాగిస్తున్నాయి. అందులో 1.5లక్షల మంది ప్రయాణిస్తున్నారు. దీంతో రోజుకు రీజియన్‌కు రూ.77.51లక్షల ఆదాయం వస్తోంది. అందులో సగం మంది మహిళలు ఉన్నారు. వారికి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందించనుండటంతో రోజుకు రూ.38.50 లక్షల భారం ప్రభుత్వంపై పడనుంది.

పీడీసీసీబీ చైర్మన్‌గా సీతారామయ్య

నేడు బాధ్యతలు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (పీడీసీసీబీ) పర్సన్ ఇన్‌చార్జి (చైర్మన్)గా డాక్టర్ కామేపల్లి సీతారామయ్య శనివారం అధికారికంగా బాధ్యతలు తీసుకోనున్నారు. ఇటీవల పర్సన్ ఇన్‌చార్జిగా ఆయన



పేరును టీడీపీ అధిష్ఠానం ఖరారు చేసిన విషయం విదితమే. ఆమేరకు ప్రభుత్వం అధికారికంగా గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం సహకార శాఖ అధికారుల నుంచి ప్రత్యేక ఉత్తర్వులు జిల్లాకు వచ్చాయి. దీంతో శనివారం బ్యాంకుకు వెళ్లి సీతారామయ్య బాధ్యతలు స్వీకరించనున్నారు. సింగిల్ విండోల్లో ముగ్గురు సభ్యులతో కమిటీలను నియమిస్తున్న ప్రభుత్వం సెంట్రల్ బ్యాంకుకు చైర్మన్‌తోపాటు ఆరుగురిని బోర్డు సభ్యులుగా నియమించాల్సి ఉంది. మిగిలిన సభ్యుల నియామకంపై తదుపరి ఉత్తర్వులు రానున్నాయి. ఆతర్వాత సీతారామయ్య... మంత్రులు, ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులను ఆహ్వానించి మరోసారి అట్టహాసంగా బాధ్యతలు స్వీకరించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

పీవీపురంలో దొంగల హల్‌చల్

- వరుసగా మూడిళ్లలో చోరీ
- 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.65వేల నగదు అపహరణ

వివరాలు 4లో..

ట్రంక్‌రోడ్డుకు నూతన శోభ

100 అడుగులకు విస్తరణ

- మార్కింగ్‌ను ప్రారంభించిన కార్పొరేషన్ సిబ్బంది
- నేడు వ్యాపారులతో కమిషనర్ సమావేశం
- త్వరలోనే పనులు ప్రారంభం.. గతంలో పలుమార్లు వాయిదా



ట్రంకురోడ్డు విస్తరణకు మార్కింగ్ చేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

ఒంగోలు, కార్పొరేషన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘ కాలంగా ముందడుగు పడని ట్రంక్‌రోడ్డు విస్తరణ మరోసారి తెరపైకి వచ్చింది. ట్రాఫిక్ సమస్య నివారణ, నగర అభివృద్ధి దృష్ట్యా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆదేశాలతో కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే నగరంలోని పలు ముఖ్యమైన రహదారుల విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. త్వరలోనే కొత్తపట్నం బస్టాండ్ సెంటర్ నుంచి మస్తాన్ దర్గా వరకు ఉన్న రోడ్డును 80 అడుగులకు విస్తరణ చేయనున్నారు. అందుకోసం సోమవారం ఆ రోడ్డు మార్గంలో టౌన్ ప్లానింగ్ అధికారులు మార్కింగ్ చేయనున్నారు. అలాగే మిరియాలపాలెం నుంచి మస్తాన్ దర్గా వరకు ట్రంక్‌రోడ్డును విస్తరణ చేసే దిశగా చర్యలు వేగవంతం చేశారు. ఈ మేరకు శుక్రవారం టౌన్ ప్లానింగ్ అధికారులు, రోడ్డు విస్తరణ కోసం మార్కింగ్ చేశారు. దీంతో త్వరలోనే ట్రంక్‌రోడ్డు నూతన శోభను సంతరించుకోనుంది.

అనేకసార్లు ప్రతిపాదన.. అంతలోనే వాయిదా

నగర హోదాకు అనుగుణంగా రహదారుల విస్తరణ ఉండాలన్న దిశగా మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా చర్యలు చేపట్టారు. అయితే 2006లో యక్కల తులసీరావు మునిసిపల్ చైర్మన్‌గా ఉన్న

మిగతా 4వ పేజీలో



విద్యాశాఖ డైరెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఈవో కిరణ్‌కుమార్, ఎంఈవోలు, హెచ్‌ఎంలు

అయ్యోర్యు!

దివ్యాంగులు, వ్యాధిగ్రస్థులైన ఉపాధ్యాయులపై విద్యాశాఖకు కనికరం కరువైంది. ప్రాధాన్యత కేటగిరీలో చేర్చి బదిలీల్లో ప్రథమ స్థానం ఇస్తామని చెప్పినా ఫలితం లేకుండాపోయింది. అన్నిస్థానాలు కోరుకునేందుకు అవకాశం లభించలేదు. అందుకు ప్రభుత్వం విధించిన నిబంధనలు అడ్డంకిగా మారాయి. తక్కువ వైకల్యంతో ప్రత్యేక పాయింట్లు పొందిన టీచర్లకు అన్ని స్థానాలు కోరుకునేందుకు అధికారులు అవకాశం ఇచ్చారు. అయితే 80 నుంచి 100శాతం వైకల్యం ఉన్నవారికి, తాము ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతూ చికిత్స చేయించుకుంటున్న వారికి మాత్రం షరతులు విధించారు. మొత్తం ఖాళీల్లో కేవలం నాల్గో వంతు మాత్రమే కోరుకునేందుకు అవకాశం ఇచ్చారు. గతంలో జరిగిన బదిలీల్లో అన్ని స్థానాలకు అవకాశం ఇవ్వగా ఈసారి మాత్రం వీరిపై ఆంక్షల పిడుగుపడింది. దీంతో వీరు బదిలీల్లో సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

దివ్యాంగ టీచర్లపై దయలేదు

- వ్యాధిగ్రస్థులపై కనికరం కరువు
- పేరుకే ప్రాధాన్య కేటగిరి
- బదిలీల్లో వీరికి చుక్కలే

ఒంగోలు, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల బదిలీల్లో దివ్యాంగ టీచర్లపై ప్రభుత్వానికి దయలేకుండా పోయింది. ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతూ చికిత్సపొందుతున్న టీచర్లపై కనికరం కరువైంది. గతంలో జరిగిన బదిలీల్లో 40శాతం వైకల్యం ఉన్న వారు, ప్రాణాంతక వ్యాధులకు చికిత్సపొందుతున్న వారిని ప్రాధాన్యత కేటగిరీలో చేర్చి బదిలీల్లో మొదటిగా స్థానాలు కోరుకునేందుకు అవకాశం ఇచ్చారు. అప్పట్లో కొందరు బోగస్ వైద్య ధ్రువీకరణ పత్రాలతో లబ్ధిపొందారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో నిబంధనలను కఠినతరం చేశారు. 80శాతానికిపైన శారీరక వైలక్యం ఉన్నవారు, 100శాతం దృష్టి లోపం ఉన్న టీచర్లకు బదిలీల్లో మొదటి ప్రాధాన్యం ఇచ్చారు. అంటే బదిలీల్లో పాయింట్లతో సంబంధం లేకుండా వారు కోరుకున్న స్థానాలను కేటాయిస్తారు. 75శాతం దృష్టి లోపం, 70 నుంచి 79శాతం శారీరక వైకల్యం, 70శాతం

మిగతా 4వ పేజీలో

88మందికి హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి : 6లో

- గిట్టుబాటు ధరల్లేక అల్లాడుతున్న రైతులు
- తాగునీటి కోసం తల్లడిల్లుతున్న పశ్చిమ ప్రజానీకం
- నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం
- ఏడు అంశాలతో అజెండా

ప్రజా సమస్యలపై చర్చ జరిగేనా?



ఒంగోలు కలెక్టరేట్, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించక రైతులు గగ్గోలు పెడుతున్నారు. పశ్చిమప్రాంత ప్రజానీకం తాగునీటి సమస్యతో అల్లాడుతోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ అధ్యక్షతన జరగనుంది. ఈ సమావేశంలో జిల్లాకు సంబంధించిన ఆయా సమస్యలపై చర్చించి అవసరమైతే తీర్మానం చేసి ప్రభుత్వం ద్వారా పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఆదిశగా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ప్రజానీకం కోరుతోంది.

పొగాకు రైతుల్లో ఆందోళన

జిల్లాలో ప్రస్తుతం పొగాకుతోపాటు పలు రకాల పంటలకు గిట్టుబాటు ధరలు లభించక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత నాలుగేళ్ల నుంచి పొగాకుకు మంచి డిమాండ్ ఉండటంతో జిల్లావ్యాప్తంగా వర్జీనియాతోపాటు బర్లీ పొగాకును విస్తారంగా సాగు చేశారు. అయితే కొనుగోళ్లు మందగించడం, లోగ్రేడ్ పొగాకు అసలు కొనుగోలు చేయకపోవడం, ఎక్కువ శాతం నోబిడ్ చేయడంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. ఇప్పటికే పెట్టుబడి భారీగా పెట్టి ఆందోళన చెందుతున్నారు. ఇంకోవైపు ఉమ్మడి జిల్లాలో బర్లీ పొగాకును విస్తారంగా సాగు చేశారు. నెలల తరబడి కొనుగోలు చేయకపోవడంతో రైతుల నివాసాల్లో నిల్వలు పేరుకుపోయాయి. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని రైతులు పండించిన పొగాకును కొనుగోలు చేయించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా శనగ, మిర్చి తదితర రకాల పంటలకు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

తాగునీటికి ఇక్కట్లు

పశ్చిమప్రాంతంలో తాగునీటి సమస్య తీవ్రంగా నెలకొంది. ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే

మిగతా 4వ పేజీలో



పెద్దారవీడులో దుక్కులు దున్నుతున్న రైతు

రోహిణి రివర్స్

- కనిపించని ఎండల తీవ్రత
- గణనీయంగా తగ్గిన ఉష్ణోగ్రతలు
- కార్తెకు ముందే విస్తారంగా వర్షాలు
- చల్లబడిన వాతావరణం
- పలు మండలాల్లో సాధారణం కన్నా రెండు నుంచి నాలుగురెట్లు అధికంగా వాన
- సాగుకు ఉపక్రమించిన రైతులు
- పలుచోట్ల దుక్కుల దున్నకం, విత్తనాలు చల్లకం

ఒంగోలు, మే 30 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జిల్లాలో విచిత్ర వాతావరణం నెలకొంది. రోహిణి కార్తె వచ్చినా ఎండల తీవ్రత అంతగా లేకపోవడమే కాక వాతావరణం చల్లబడింది. సాధారణంగా రోహిణి కార్తెలో రోళ్లు పగిలే ఎండలు కాస్తాయన్న నానుడికి అనుగుణంగా ఏటా అదేస్థాయిలో ఎండలు ఉంటాయి. అయితే ఈసారి అందుకు పూర్తి భిన్నమైన పరిస్థితి నెలకొంది. వేసవి ముగింపు సమయంలో వచ్చే ఈ కార్తెలో ఏడాది మొత్తం మీద అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఈ కార్తెలో 42 నుంచి 45 డిగ్రీల

మిగతా 4వ పేజీలో



పొగబారుతున్న జీవితాలు

- పొగాకు ఉత్పత్తులకు అలవాటుపడుతున్న యువత
- పాఠశాల స్థాయి నుంచే ప్రారంభం
- ఆరోగ్య సమస్యలు కొనితెచ్చుకుంటున్న వైనం
- నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

5లో



సేద్యపు నీటి కుంటను పరిశీలిస్తున్న కేంద్ర బృందం, అధికారులు

గురిజేపల్లిలో కేంద్ర బృందం పర్యటన

- ఇంటింటికీ వెళ్లి తాగునీటి కొళాయిల పరిశీలన
- పారిశుధ్యం అధ్వానంతో పంచాయతీ అధికారులపై అసహనం

5లో

'అయ్యో'రు

(3వ పేజీ తరువాయి)

వినికిడి లోపం ఉన్నవారికి రెండో ప్రాధాన్యత ఇచ్చారు. పునర్వివాహం చేసుకోని వితంతువులు, క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, అవయవ మార్పిడి, మేజర్ న్యూరోసర్జరీ, బోన్‌టిబి, కిడ్నీ మార్పిడి, డయాలసిస్, స్పైనర్ సర్జరీ చేయించుకొని చికిత్స పొందుతున్న వారికి కూడా ప్రాధాన్యత కేటగిరీలో స్థానం కల్పించారు. టీచర్ల స్పౌజ్ పిల్లలు మానసిక సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతుంటే వారికి కూడా ప్రాధాన్యత కేటగిరీ బదిలీకి అవకాశం ఇచ్చారు. అయితే బదిలీల్లో అంతా గందరగోళం నెల కొంది. విపరీతమైన ఆంక్షలతో వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులైన టీచర్లు ఇబ్బంది పడుతున్నారు.

ఆంక్షలు ఇవీ..

'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందంగా ప్రాధాన్యత కేటగిరీలో ఆంక్షలు టీచర్లను కుంగదీస్తున్నాయి. సెకండరీ గ్రేడ్ టీచర్లకు అయితే ఒక పాఠశాలలో 40శాతం, స్కూలు అసిస్టెంట్లు అయితే 50శాతం ఖాళీలు ప్రతి సబ్జెక్టులో కేటాయించమన్నారు. అంటే ముగ్గురు సెకండరీ గ్రేడ్ టీచర్లు పనిచేస్తున్న పాఠశాలల్లో ఒక పోస్టు, ఐదుగురు పనిచేసే పాఠశాలల్లో రెండు పోస్టులు, ఎనిమిది మంది పనిచేసే స్కూళ్లలో మూడు, పదిమంది ఉంటే నలుగురు, 13 మందికి ఐదుగురు, 15 మందికి ఆరుగురు, 18 మందికి ఏడుగురు, 20మంది పనిచేస్తున్న పాఠశాలల్లో ఎనిమిది స్థానాలు మాత్రమే ప్రాధాన్యత కేటగిరీ టీచర్లకు కేటాయించారు. హైస్కూళ్లలో ఒక సబ్జెక్టులో రెండు పోస్టులు ఉంటే ఒకటి, నాలుగు పోస్టులు ఉంటే రెండు, ఆరు పోస్టులకు మూడు, ఎనిమిది పోస్టులకు నలుగురు, పది పోస్టులకు ఐదు, 12 పోస్టులు ఉంటే ఆరుగురు, 14 పోస్టులు ఉంటే ఏడుగురు, 16 పోస్టులు ఉంటే ఎనిమిది ప్రాధాన్యత కేటగిరి వారు కోరుకునేందుకు అవకాశం ఇచ్చారు. జిల్లాలో కేవలం సింగిల్ సెక్షన్‌తో నడుస్తున్న సుమారు 200 హైస్కూళ్లలో ప్రాధాన్యత కేటగిరీ టీచర్లు కోరుకునేందుకు స్థానాలే లేవు. అంటే బదిలీల్లో వీరికి ఎంత అన్యాయం జరిగిందో అర్థమవుతుంది.

1,255 ఖాళీలకే వీరు అర్హులు

జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలకు సుమారు 6వేల ఖాళీలు ఉండగా వీటిలో కేవలం 1,255 స్థానాలు కోరుకునేందుకు మాత్రమే ప్రాధాన్యత కేటగిరీలో అర్హులు. కొన్ని సబ్జెక్టుల్లో అసలు వీరికి కోరుకునే అవకాశం లేదు. గ్రేడ్-2 హెచ్‌ఎం, పీఎస్‌హెచ్‌ఎం, పీఎస్‌హెచ్‌ఎం, ఎస్‌ఏ పోస్టుల్లో వీరికి ఒక్క స్థానం కూడా కేటాయించ లేదు. స్కూలు అసిస్టెంట్ తెలుగులో 173 ఖాళీలకు 546, హిందీలో 219 ఖాళీలకు 74, ఇంగ్లీషులో 253కు 77, గణితంలో 335కు 106, ఫిజికల్ సైన్స్‌లో 356కు 91, బయోలాజికల్ సైన్స్‌లో 216కు 65, సెండరీ గ్రేడ్ తెలుగులో 2,956కు 710, ఉర్దూలో 57కు 8 స్థానాలు ప్రాధాన్యత కేటగిరీలో కేటాయించారు. ఇతర సబ్జెక్టుల్లో ఒక్క స్థానం కూడా వీరికి కేటాయించలేదు.

88మందికి హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి

ఒంగోలు విద్య, మే 30 (ఆంధ్రజ్యోతి) : గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌లో 88 మంది స్కూలు అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. వీరిలో జడ్పీ యాజమాన్యంలో 83 మంది, మునిసిపాలిటీల్లో నలుగురుకి, ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్‌లో ఒకరికి హెచ్‌ఎంగా ప్రమోషన్ ఇచ్చారు. జడ్పీ యాజమాన్యంలో హెచ్‌ఎంలుగా స్థానాలు కోరుకున్న ఇరువురు శనివారం హెచ్‌ఎంలుగా బాధ్యతలు స్వీకరించి అదే రోజు ఉద్యోగ విరమణ చేయాలి. ఈ రెండు స్థానాలు కోరుకున్న ఇద్దరు మిగతా హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి పొందిన వారు జూన్ 1న కొత్త పాఠశాలల్లో బాధ్యతలు స్వీకరించాలి, జడ్పీ యాజమాన్యంలోని రెండు స్థానాలను కౌన్సెలింగ్‌కు గైర్హాజరైన వారి కోసం ఉంచారు. గైర్హాజరైన వారికి ఆ రెండు స్థానాలు కేటాయించి నియామకపు ఉత్తర్వులు ఇస్తారు.

ప్రజా సమస్యలపై చర్చ జరిగేనా?

(3వ పేజీ తరువాయి)

నీరు సరిపోవడం లేదు. దీంతోపాటు ఇతరత్రా అనేక సమస్యలతో జిల్లావ్యాప్తంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఉపాధి హామీ పథకం పనులు చేసిన కూలీలకు సకాలంలో వేతనం అందడం లేదు. ఈ నేపథ్యంలో శనివారం జరగనున్న జడ్పీ సమావేశంలో ఆయా అంశాలపై చర్చించి జిల్లా అధికార యంత్రాంగానికి ప్రజాప్రతినిధులు దిశానిర్దేశం చేయాల్సిన అవసరం ఉంది. కాగా జడ్పీ సమావేశంలో మొత్తం ఏడు అంశాలతో పరిమితంగానే అజెండాను రూపొందించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా), జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, విద్య, వ్యవసాయ, ఉద్యానవనశాఖలతోపాటు జడ్పీ స్థాయీ సంఘాల తీర్మానాలను ఆమోదించనున్నారు. పరిమితంగానే అజెండా అంశాలు ఉన్నందున ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి తక్షణం ఉపశమనం పొందే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పొగాకు కొనుగోళ్లకు

ఎస్‌టీసీని రంగంలోకి దించాలి

- రూ.300 కోట్లు నిధులు కేటాయించాలి
- లోగ్రేడ్‌లను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్

ఒంగోలు(రూరల్), మే30(ఆంధ్రజ్యోతి): పొగాకు కొనుగోలు చేసేందుకు ఎస్‌టీసీని రంగంలోకి దించాలని, అందుకోసం ఆ సంస్థలకు రూ.300కోట్లు కేటాయించి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2లో జరుగుతున్న పొగాకు వేలం ప్రక్రియను శుక్రవారం ఆయన రైతు సంఘం నాయకులతో పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పొగాకు బోర్డు, ఐటీసీ వ్యవహరిస్తున్న తీరుపై దారుణంగా ఉందన్నారు. సరైన ధరలకు పొగాకు ను కొనుగోలు చేయడం లేదని మండిపడ్డారు. పొగాకు ధరలు మాత్ర తగ్గుతున్నాయని, కానీ ఐటీసీ షేర్లు మాత్రం ఎగబాకి పోతున్నాయని విమర్శించారు. గతేడాదిని దృష్టిలో ఉంచుకుని రైతులు ఈ ఏడాది రైతులు పొగాకును భారీగా సాగు చేశారని, అయితే వ్యాపారులు వేలంలో పొగాకు బేళ్లను 30 శాతం మేరకు నిరాకరిస్తున్నారని చెప్పారు. ఐటీసీ గుత్తాధిపత్యం వల్లే పొగాకు ధరలు రోజురోజుకు పతనం అవుతున్నాయని ఆరోపించారు. ఒకపక్క సీఎం చంద్రబాబునాయుడు పొగాకును మంచి ధరలకు కొనుగోలు చేయాలని సమావేశాలు నిర్వహిస్తున్నా.. వ్యాపారుల్లో ఎలాంటి మార్పులేదన్నారు. తక్షణమే ఎస్‌టీసీని రంగంలోకి దించాలని, అలాగే ఐటీసీతో 25శాతం పైగా కొనుగోలు చేయించాలన్నారు. పొగాకు రైతులు గిట్టు బాటు ధరల కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన కోరారు. శ్రీనివాసరావు వెంట సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు, రైతు సంఘం నాయకులు ఎం.హరిబాబు, జుజ్జూరి జయంత్‌బాబు, పమిడి వెంకటరావు, పెంట్యాల హనుమంత రావు, కిలారి పెద్దబ్బాయి, బెజవాడ శ్రీనివాసరావు, అబ్బూరి వెంకటేశ్వర్లు, వి.బాల కోటయ్య, టి.శ్రీకాంత్ పాల్గొన్నారు.



వేలం ప్రక్రియను పరిశీలిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

బాలల సదుపాయాలపై నిరంతరం పర్యవేక్షణ

డీఆర్వో చినఓబులేషు

ఒంగోలు కలెక్టరేట్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌జీవో సంస్థల్లో ఆశ్రయం కల్పించిన బాలలకు అందిస్తున్న సదుపాయాలపై నిరంతరం పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఆర్వో చినఓబులేషు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో శుక్రవారం చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్స్ డిస్ట్రిక్ లెవల్ రికమెండింగ్ కమిటీ సమావేశం జిల్లా పర్యవేక్షణ అధికారి, నోడల్ ఆఫీసర్ పి.బాలప్రభాకర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అమలు చేయాల్సిన రక్షణ, సంరక్షణ అంశాలు, అందుతున్న విద్యవైద్య సదుపాయాలు ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే వాటిని త్వరగా పరిష్కరించాలని చెప్పారు. జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ వేము రామాంజనేయులు బాలల న్యాయ చట్టం, రక్షణ సంరక్షణ విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం మూడు ప్రభుత్వ, ఎనిమిది స్వచ్ఛంద సంస్థల దరఖాస్తులను జిల్లా కమిటీ పరిశీలన చేసింది. సమావేశంలో రిజిస్టర్ అండ్ సొసైటీస్ ప్రతినిధి శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ హేనసృజన, దివ్యాంగుల సంక్షేమశాఖ అధికారి అర్చన, సీఐ సుధాకరరావు, డీసీపీవో దినేష్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్వో చినఓబులేషు

హెచ్‌ఐవీ నియంత్రణలో స్వచ్ఛంద సంస్థల పాత్ర అభినందనీయం

- రాష్ట్ర పీడీ నీలకంఠారెడ్డి

ఒంగోలు కార్పొరేషన్, మే 30 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నిర్మూలనలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు అభినందనీయం అని ఏపీ హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నిర్మూలన సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ నీలకంఠారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని ఓ హోటల్‌లో గుంటూరు, ప్రకాశం ఉమ్మడి జిల్లాల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుమారుగా 3.10లక్షల మంది హెచ్‌ఐవీ బాధితులు ఉన్నారని, అందులో 2.7లక్షల మందిని మాత్రమే గుర్తించగా మిగిలిన 40 వేల మందిని గుర్తించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అలాగే గుర్తించిన వారికి ప్రభుత్వం పరంగా వైద్యసేవలు అందేలా చూడాలని తెలిపారు. నిరంతర వైద్య పరీక్షలు, పౌష్టికాహారం అందించడం ద్వారా వైరస్ వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చని చెప్పారు. అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.కామేశ్వరప్రసాద్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్షత విడనాడి వారి పట్ల ప్రేమ కలిగి ఉండాలని తెలిపారు. బాధితులు మానసికంగా ధైర్యం కోల్పోకుండా చూడాలని, కండోమ్ వినియోగంపట్ల ప్రతి ఒక్కరిలో చైతన్యం కలిగించాలని కోరారు. విచ్చలవిడి శృంగారంలో పాల్గొనేవారికి తప్పనిసరిగా హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగించాలని తెలిపారు. సమావేశంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ టెక్నికల్ ఆఫీసర్ సుకుమార్, ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అకౌంట్స్ జేడీ భాగ్యలక్ష్మి, హెల్ప్ స్వచ్ఛంధ సంస్థ పీడీ బీవీ.సాగర్, ప్రోగాం మేనేజర్ కోటేశ్వరరావు, ఎంఈఈ టి.అనిల్, హెల్ప్, గ్రో, హెచ్‌వోసీ, గ్రాండ్, చీరాల మహిళా మండల సంస్థల డైరెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ నీలకంఠారెడ్డి

ఎక్సైజ్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- జిల్లా అధికారి ఖాజామోహిద్దీన్

ఒంగోలు క్రైం, మే 30(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్‌శాఖ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి ఖాజామోహిద్దీన్ శుక్రవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో 188 మద్యం దుకాణాలు, 23 బార్ అండ్ రెస్టారెంట్లు సమయపాలనలో విక్రయాలు చేస్తున్నాయని పేర్కొన్నారు. విచ్చలవిడి మద్యం విక్రయాలు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుటామన్నారు. నెల రోజులుగా నిరంతర నిఘా ఏర్పాటు చేశామని, అదేసమయంలో నాటుసారా, గంజాయి రవాణా అరికట్టేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఎక్కడైనా ఎమ్మార్పీ ఉల్లంఘన జరిగితే కేసుల నమోదు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

యోగాంధ్ర రిజిస్ట్రేషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 30 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు, ట్రైనర్ల శిక్షణ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. యోగాంధ్ర కార్యక్రమాలతో పాటు పీఎం సూర్యఘర్ అమలు, వివిధ ప్రభుత్వ పథకాల పట్ల ప్రజా స్పందనలు వంటి వాటిపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. వచ్చే నెల 21న యోగాంధ్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రముఖ పర్యాటక కేంద్రాలు, ఆధ్యాత్మిక కేంద్రాలలో యోగా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా కలెక్టర్ బంగ్లాలో పాల్గొనగా, కలెక్టరేట్‌లో జేసీ గోపాలకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు సర్టిఫికెట్ల పరిశీలన

ఒంగోలు విద్య, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్, ప్రభుత్వ, మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌లో ఖాళీగా ఉన్న పీఎస్ హెచ్‌ఎం పోస్టులు ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేస్తున్నట్లు డీఈవో కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీలో 48, ప్రభుత్వంలో మూడు, మునిసిపాలిటీల్లో 12, మునిసిపల్ కార్పొరేషన్‌లో ఏడు కలిపి 68 పోస్టులను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక్కొక్క పోస్టుకు ముగ్గురు చొప్పున 204 మందితో సీనియారిటీ జాబితా తయారు చేసి వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. వీరందరికి శనివారం సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని, సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూలు అసిస్టెంట్లు తమ సర్వీసు రిజిస్టరు, విద్యార్హతల సర్టిఫికెట్లతో ఒంగోలులోని డీఆర్‌ఆర్‌ఎం మునిసిపల్ హైస్కూలులో శనివారం ఉదయం 9గంటలకు హాజరుకావాలని ఆయన కోరారు.

వసతిగృహాల మరమ్మతులు పూర్తి చేయాలి

- మంత్రి స్వామి
- పనుల నాణ్యతలో రాజీ పడొద్దని ఆదేశం

ఒంగోలు నగరం, మే 30(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు పూర్తయి పాఠశాలలు ప్రారంభించే నాటికి జిల్లాలోని వసతిగృహాల మరమ్మతులు కూడా పూర్తి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖా మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఆదేశించారు. శుక్రవారం టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సంక్షేమశాఖ, ఇంజనీరింగ్ అధికారులతో వసతిగృహాల మరమ్మతులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ మరమ్మతుల పనులను వేగంగా నిర్వహిస్తూ ఎక్కడా నాణ్యతలో లోపాలు లేకుండా చూడాలని చెప్పారు. చరిత్రలో ఎక్కడా లేని విధంగా రూ.143 కోట్లతో వసతిగృహాలకు మరమ్మతులు చేస్తున్నామన్నారు. ఒంగోలు, ఎర్రగొండపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న వసతిగృహాల భవననిర్మాణాలను కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు ఇబ్బందిలేకుండా పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే నాటికి వసతిగృహాలు కూడా సిద్ధం కావాలని ఆయన సూచించారు. సమావేశంలో ఏపీఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్ విభాగం ఈఈ భాస్కరబాబు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి

మార్కాపురం వన్‌టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): బాలికలు అన్ని రంగాలలో రాణించాలని ఐసీడీఎస్ సీడీపీవో సుశీలాదేవి అన్నారు. పట్టణంలోని శ్రీనివాస థియేటర్ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోర వికాసం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాలికలు కరాటే తదితర విద్యలు నేర్చుకుని ఆత్మరక్షణ చేసుకోవాలన్నారు. చదువుతో పాటు అల్లికలు, కుట్లు, వివిధ విజ్ఞాన విషయాలు కూడా నేర్చుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు మంచి పోషకాహారాలు తీసుకోవాలన్నారు. బాలికల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన బాలికలకు బహుమతులు అందించారు.

త్వరలో ఆటిజం కేంద్రం ఏర్పాటు

మార్కాపురం వన్‌టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో త్వరలో నూతనంగా ఆటిజం కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఐఈ కోర్డినేటర్ నాగేంద్ర నాయక్ అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేయబోతున్న ఆటిజం కేంద్ర తరగతి గదులను, ప్రత్యేక విద్యార్థుల గుర్తింపు పాఠశాలలో విద్యార్థుల నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐఈ ఆర్పీ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రదీప్‌కు స్వదేశీ భూషణ్ సమ్మాన్ అవార్డు

ఎర్రగొండపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ఎర్రగొండపాలెంలో ఆంగ్ల అధ్యాపకుడిగా వైస్ ప్రిన్సిపాల్‌గా సేవలు అందిస్తున్న డాక్టరు పి. ప్రదీప్ శుక్రవారం స్వదేశి భూషణ్ సమ్మాన్ అవార్డును పొందారు. వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారిని గుర్తించి ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్యలో స్వదేశీ సంస్థాన్, సాగర్ కళాభవన్ డైరెక్టర్ పోస్టు ద్వారా అవార్డును పంపించారు. శుక్రవారం పోస్టు దారా వచ్చిన అవార్డును డాక్టరు ప్రదీప్ స్వీకరించారు.ఈ అవార్డుకు డాక్టరు ప్రదీప్ ఫిబ్రవరిలో ఎంపిక అయ్యారు. అక్కడకు వెళ్లలేక పోవడంతోఆయనకు పోస్టులో పంపించారు.

హైడాటిడ్ బాధితుడికి శస్త్రచికిత్స విజయవంతం

గుంటూరు మెడికల్, మే 30 (ఆంధ్రజ్యోతి): కుక్కల ద్వారా సంక్రమించే ప్రమాదకరమైన జూనోటిక్ వ్యాధి.. హైడాటిడ్. ఈ వ్యాధిబారిన పడి గుంటూరు ప్రభుత్వాస్పత్రికి వచ్చిన రోగికి శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. శుక్రవారం సాధారణ శస్త్రచికిత్స వార్డులో జరిగిన విలేకర్ల సమావేశంలో జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ యేకుల కిరణ్‌కుమార్ ఈ కేసు వివరాలను తెలియజేశారు. ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం మదారంకు చెందిన పాలిపోగు ప్రసాద్ (62) మూడు నెలల కిందట ప్రమాదకరమైన హైడాటిడ్ వ్యాధికి గురయ్యాడు. తీవ్రమైన జ్వరం, కామెర్లు, కడుపు నొప్పి, చలి వంటి లక్షణాలతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం గత నెల నాల్గవ తేదీన గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చేరగా, జనరల్ సర్జరీ ప్రొఫెసర్ యేకుల కిరణ్‌కుమార్ పరీక్షించారు. బాధితుడు కాలేయంపై ఏర్పడ్డ నీటి బుడగ (హైడాటిడ్ సిస్ట్)తో బాధపడుతున్నట్లు గుర్తించారు. రోగికి రక్తహీనత, ఊపిరితిత్తుల సమస్య ఉండటంతో మొదట వాటికి చికిత్స చేశారు. అనంతరం ఏప్రిల్ 17న నాలుగు గంటల పాటు శ్రమించి ఓపెన్ సర్జరీ చేసి 20 సెంటీ మీటర్ల మేర ఏర్పడిన కాలేయం నీటిబుడగలను తొలగించారు. సర్జరీ తర్వాత నెల వైద్యుల పర్యవేక్షణలో ఉంచి సంరక్షించారు. రోగి కోలుకోవడంతో మే 18న డిశ్చార్జీ చేశారు. అరుదైన శస్త్రచికిత్సతో రోగి ప్రాణాలు కాపాడిన డాక్టర్ కిరణ్‌కుమార్, వైద్య బృందాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి అభినందించారు. బయట రూ.10 లక్షల విలువైన సర్జరీని ఎన్టీఆర్ వైద్య సేవకింద ఉచితంగా చేసినట్లు ఆయన తెలిపారు.



బీరువాను పరిశీలిస్తున్న డీఎస్పీ నాగరాజు

పీవీపురంలో దొంగల హల్‌చల్

- వరుసగా మూడిళ్లలో చోరీ
- 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.65వేల నగదు అపహరణ

బేస్తవారపేట, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పచ్చర్ల వెంకటాపురంలో దొంగలు హల్‌చల్ చేశారు. వరుసగా మూడు గృహాల్లో చోరీ చేసి సుమారు 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.65 వేలు నగదు అపహరించారు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి జరిగింది. గ్రామానికి చెందిన తమటం నారాయణరెడ్డి, వెంకటరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి గృహాలు వరుసగా ఉన్నాయి. అయితే అందరూ రాత్రి వేళ ఆరుబయట వరండాల్లో నిద్రలో ఉండగా వెనుక నుంచి దొడ్డి దారిన ప్రవేశించిన దొంగలు బీరువాలో ఉన్న ఆభరణాలు, నగదు దోచుకెళ్లారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు, కంభం సీఐ మల్లికార్జునరావు, ఎస్సై రవీంద్రారెడ్డి సంఘటన స్థలం చేరుకొని పరిశీలించారు, ఈ సందర్భంగా డీఎస్పీ నాగరాజు మాట్లాడుతూ గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఇంటి వెనుక ఉన్న వాకిలి ద్వారా ప్రవేశించి మూడు గృహాల్లో చోరీ చేశారని తెలిపారు. రాత్రిళ్ల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, బీరువాకు తాళాలు వేస్తే ఎవరికీ కనిపించని ప్రదేశంలో దాచాలని అన్నారు. సాంకేతికంగా దొంగతనానికి పాల్పడిన వ్యక్తులను త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు.

రోహిణి రివర్స్

(3వ పేజీ తరువాయి)

గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆలాంటిది ఈ ఏడాది ఎండల తీవ్రత లేకపోవడమే కాక గరిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా గణనీయంగా తగ్గిపోయాయి. ఈనెల 25 నుంచి రోహిణి కార్తె రాగా ఒంగోలు నగరంలో 35 డిగ్రీల లోపునే గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఉంటున్నాయి. అంటే సాధారణం కన్నా ఐదారు డిగ్రీలు తక్కువ. అలాగే అత్యధిక ఉష్ణోగ్రతలు (42 నుంచి 45 డిగ్రీలు) నమోదయ్యే పలు మండలాల్లో సైతం ప్రస్తుతం 38 డిగ్రీల లోపుగానే ఉంటున్నాయి.

విస్తారంగా వానలు

ఈ ఏడాది రోహిణికార్తె వచ్చే నాటికే జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిశాయి. పలు మండలాల్లో సాధారణం కన్నా రెండు నుంచి నాలుగు రెట్లు అధికంగా వానలు పడ్డాయి. జిల్లాలో మే నెల సాధారణ వర్షపాతం 53.0 మి.మీ. కాగా ఈనెల 27 నాటికే 103.10 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. రోహిణి కార్తె వచ్చే నాటికే దాదాపు 100 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. కార్తె వచ్చిన రోజు రాత్రి కూడా జిల్లాలో భారీవర్షం కురిసింది. పశ్చిమ ప్రాంతంలోని గిద్దలూరు, రాచర్ల, పెద్దారవీడు, తర్లుపాడు, మార్కాపురం, వైపాలెం, దోర్నాల త్రిపురాంతకం, పుల్లలచెరువు, పామూరు, దొనకొండ, కనిగిరి, కంభంలతో పాటు తూర్పు ప్రాంతంలోని కొండపి, పొన్నలూరు, చీమకుర్తి, సింగరాయకొండ, ఆలాగే దర్శి, తాళ్లూరు, కురిచేడు తదితర మండలాల్లో రెట్టింపు నుంచి నాలుగు రెట్లు అధిక వర్షం కురిసింది.

పదునెక్కిన భూములు

జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో కూడా సాధారణం, అలాగే అధికంగా వాన కురిసింది. దీంతో చాలా ప్రాంతాల్లో భూములు పదునెక్కాయి. దీంతో రైతాంగం తొలకరి సాగుకు ఉపక్రమించింది. జూన్ ఆరంభం నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం లెక్క. కాగా అంతకు ముందే వర్షాలు పడితే తొలకరి పంటలైన నువ్వు, సజ్జ, పెసర, జనుము, జీలుగ, పిల్లిపెసర, జొన్న వంటి పచ్చిరొట్టతోపాటు పశుగ్రాస పంటలను రైతులు వేస్తారు. అయితే విస్తారంగా వానలు పడటంతో పలుచోట్ల తొలకరి పైర్లతోపాటు ఖరీఫ్ పంటలను కూడా కాస్తంత ముందుగానే వేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. అధిక ప్రాంతాల్లో అందుకు వీలుగా ప్రస్తుతం దుక్కులను సిద్ధం చేస్తున్నారు. కొన్నిచోట్ల నువ్వు చల్లుతుండగా పెసర, సజ్జ వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బోర్ల ద్వారా నీరు సౌకర్యం ఉన్నచోట్ల పత్తి, బొప్పాయి సాగుకు ఉపక్రమించారు. మొత్తంగా జిల్లాలో వేసవి తీవ్రత పోయి సాగు వాతావరణం రోహిణి కార్తెలో కనిపిస్తోంది. పశ్చిమ ప్రాంతంలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది.

ట్రంకురోడ్డుకు నూతన శోభ

(3వ పేజీ తరువాయి)

సమయంలో ఒకసారి ట్రంక్‌రోడ్డు విస్తరణ చేయాలని అప్పటి పాలకవర్గం ప్రతిపాదించింది. పలు రాజకీయాల కారణాలు, వ్యాపారుల నుంచి వచ్చిన ఒత్తిళ్లతో ముందడుగు పడలేదు. 2012లో అప్పటి పురపాలక శాఖ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి హయాంలోనూ ట్రంక్‌రోడ్, కర్నూలు రోడ్ విస్తరణ చేయాలని భావించారు. అయితే అప్పట్లో కర్నూలు రోడ్డు విస్తరణ మాత్రమే జరిగింది. ట్రంక్‌రోడ్డుకు సంబంధించి వంద అడుగులకు విస్తరిస్తే కొన్ని షాపులు సగానికిపైగా పోయే ప్రమాదం ఉందని, కొన్నేళ్లుగా వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నామని వ్యాపారులు తెలిపారు. దీంతో అప్పట్లో ట్రంక్‌రోడ్ విస్తరణ పనులు ముందుకు సాగలేదు. కొన్నేళ్లుగా ఆ అంశంపై పెద్దగా పట్టించుకున్నవారు లేరు. తాజాగా మరోసారి నగరంలోని ముఖ్య రోడ్ల విస్తరణకు అటు పాలకులు, ఇటు అధికారులు శ్రీకారం పలికారు. అందులోభాగంగా ట్రంక్‌రోడ్డు కూడా విస్తరించాలని నిర్ణయించారు.

ఒంగోలుకు కేంద్రం బిందువుగా ట్రంక్‌రోడ్డు

ఒంగోలు నగరానికి పూర్వం నుంచి ట్రంక్‌రోడ్డు కేంద్రబిందువుగా ఉండేది. అయితే మొదట్లో అత్యధికంగా షాపులు ఈ ప్రాంతంలోనే ఉండగా, గడిచిన పదేళ్లలో నగర పరిధి విస్తరించింది. బంగారం, వస్త్ర, ఇతర షాపింగ్ మాల్స్ ఒంగోలులో అడుగుపెట్టాయి. దీంతో కర్నూలు రోడ్డు, మంగమూరు రోడ్డు, గుంటూరు రోడ్లలో వ్యాపార సంస్థలు విస్తరించగా, ట్రంకు రోడ్డు ఇప్పటికే ఇరుగ్గానే ఉంది. దీంతో మెగా షాపింగ్ మాల్స్‌కు అవసరమైన భవనాలు లేకపోవడం, తదిర కారణాలతో పూర్వం ఉన్నటువంటి షాపులే నేటికీ కొనసాగుతున్నాయి. అయితే ప్రస్తుతం ఈ రోడ్డు 40 అడుగులు మాత్రమే ఉంది. దీన్ని 100 అడుగులకు విస్తరించనున్న నేపథ్యంలో భవిష్యత్‌లో ట్రంక్‌రోడ్డులో వ్యాపారాలు మరింత పెరిగే అవకాశంతోపాటు, నగర ప్రజలకు సులువైన మార్గంగా మారనుంది.

238 షాపులకు మార్కింగ్

ట్రంక్‌రోడ్డు వంద అడుగుల విస్తరణలో భాగంగా సుమారు 238 షాపులను కొంతమేర తొలగించే అవకాశం ఉంది. తూర్పువైపున 116 షాపులు, పడమర వైపున 122 షాపులకు మార్కింగ్ చేశారు. అయితే వాటిలో కొన్ని పూర్తిస్థాయిలో కోల్పోతుండగా, మరికొన్ని కొంతమేర మాత్రమే తొలిగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వ్యాపారులు నష్టపోకుండా ఉండేందుకు వారికి టీడీఆర్ బాండ్లు పరిహారంగా అందించనున్నట్లు సమాచారం. కాగా ట్రంక్‌రోడ్డు వ్యాపారులతో మునిసిపల్ కమిషనరు కె.వెంకటేశ్వరరావు శనివారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నారు.

నగరవాసుల హర్షం

ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆదేశాలతో అభివృద్ధిలో నగరం నవ్యపథంగా దూసుకెళుతుండగా, అందుకు అనుగుణంగా విస్తరణ పనులు సైతం వేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే కర్నూలు రోడ్డు పనులు పూర్తయ్యాయి. సీవీఎన్ రీడింగ్ రూంసెంటర్ నుంచి కొణిజేడు బస్టాండ్ వరకు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. తాజాగా బీవీఎస్ హాల్ రోడ్డు, ట్రంక్‌రోడ్డు విస్తరణ పనులు త్వరలోనే ప్రారంభం కానుండటంతో నగర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల విస్తరణతో ఒంగోలు నూతన శోభను సంతరించుకోనుందని అభిప్రాయపడుతున్నారు.



కొండంత సోయగం..

పచ్చని తివాచీ పరిచినట్లు కనువిందు చేసే అందాలు ఒకవైపు.. వెండిపూత పూసినట్టు ధగధగలాడే తటాక సోయగం మరోవైపు.. ఆ రెండింటినీ వేరు చేస్తూ పాపటి బిళ్లలాంటి నామ్ రోడ్డుతో చూడముచ్చటగా ఉన్న ఈ సుందర దృశ్యం అద్దంకి సమీపంలోని శింగరకొండ వద్ద కనిపించింది. లక్ష్మీ నరసింహాస్వామిని దర్శించుకొని బయటకు వచ్చేటప్పుడు కొండపై నుంచి చూసే భక్తులను ఈ దృశ్యం మైమరపిస్తోంది. పదిరోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు జలకళ ఉట్టిపడుతున్న భవనాసి చెరువు, దాని ఆయకట్టు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

- అద్దంకి, ఆంధ్రజ్యోతి

పొగబారుతున్న జీవితాలు

- పొగాకు ఉత్పత్తులకు అలవాటుపడుతున్న యువత
- పాఠశాల స్థాయి నుంచే ప్రారంభం
- ఆరోగ్య సమస్యలు కొనితెచ్చుకుంటున్న వైనం
- నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం



'పొగ తాగనివాడు దున్నపోతై పుట్టున్' అని కన్యాశుల్కం నాటకంలో గిరీశం పాత్రధారి అన్న మాటలు నాటికీ నేటికీ యువతకు బాగా నచ్చాయో ఏమో తెలియదు కానీ, యువతలో దాదాపు 36 శాతం మంది పొగాకు ఉత్పత్తుల వాడకానికి అలవాటుపడి అనంతరం వాటికి బానిసలవుతున్నారని సర్వేలు చెబుతున్నాయి. ముఖ్యంగా విద్యాభ్యాసం సమయంలో తోటి స్నేహితులతో కలిసి సరదాగా మొదలైన పొగాకు ఉత్పత్తుల వాడకం ఒక అలవాటుగా మారిపోతోంది. వీటికి బానిసైనవారిలో అత్యధికులు దూరం కాలేక వయసు పెరిగే కొద్దీ అనేక అరోగ్య సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు. సిగరెట్, బీడీ, చుట్ట వంటివి వాడేవారివల్ల వారికే కాకుండా పరిసరాల్లో ఉండి ఆ పొగను పీల్చేవారికి కూడా హాని చేస్తుంది. ఇటువంటి అనర్థాలను నివారించి తగ్గించాలనే ప్రయత్నంలో భాగంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌వో) 1988 నుంచి ప్రతి సంవత్సరం మే 31ని పొగాకు వ్యతిరేక దినోత్సవంగా ప్రకటించింది. పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలను సమాజానికి ముఖ్యంగా యువతకు తెలియజేసి వాటినుంచి వారిని దూరంగా ఉంచటం దీని వెనుక ఉద్దేశం.

- ఒంగోలు కల్చరల్, మే 30 (ఆంధ్రజ్యోతి)

కౌమార దశలోనే అలవాటు

గతంలో గ్రామాలలో పెద్దవాళ్లు పగలంతా పనిచేసి అలసిపోయి వచ్చి పొగాకుతో చుట్టను చుట్టుకుని నులక మంచం మీద, వీధి అరుగుల మీద కూర్చుని పీలుస్తూ ఆనందించేవారు. ఆనందించేవారు అనేకంటే వారి మైండ్‌కు అది కొంత ఉత్సాహాన్ని ఇచ్చేది. అప్పట్లో యువత సిగరెట్, బీడీ వంటి పొగాకు ఉత్పత్తుల జోలికి పోవాలంటే భయపడేవారు. తాము వాటిని ఉపయోగిస్తే ఎక్కడ పెద్దవాళ్లకు తెలిసి మందలిస్తారో అనే భయం వాళ్లలో ఉండేది. కానీ కాలక్రమేణా 1970 దశకం నుంచి యువత పొగాకు వాడకం పెరిగింది. కౌమారదశ అంటే పాఠశాల స్థాయిలోనే పొగాకు ఉత్పత్తులకు అలవాటు పడటం మొదలైంది. కొన్ని సర్వేల ప్రకారం ప్రస్తుతం ధూమపానం చేసే పెద్దవారిలో 90 శాతం మంది 18 సంవత్సరాలలోపే సిగరెట్లకు అలవాటుపడినట్లు తెలుస్తుంది. ఇక స్వంత ఊరిలో చదువులు కాకుండా దూరంగా ఉన్న పట్టణాలు, నగరాలకు వెళ్లి హాస్టళ్లలో ఉండి చదివే వారు చాలా త్వరగా ఈ ధూమపానానికి అలవాటుపడుతున్నారు. అటు తల్లిదండ్రులు ఇటు ఉపాధ్యాయుల పర్యవేక్షణ వీరిపై లేకపోవటమే కారణం. కేవలం సిగరెట్లు మాత్రమే కాకుండా గుట్కా, పాన్‌పరాగ్ వంటి అనేక పొగాకు ఉత్పత్తులను సైతం యువత ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. సమాజంలో ప్రస్తుతం గుండె, ఊపిరితిత్తులు, స్వరపేటిక, నోరు, గొంతు, మూత్రపిండాలు, కాలేయం వంటి అనేక భాగాలలో రోగాలు వస్తున్న వారిలో చాలామందికి ఈ పొగాకు వాడకమే కారణంగా వైద్యులు చెబుతున్నారు.



అవగాహన కల్పించటం ముఖ్యం

పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రతి ఒక్కరికీ ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించటం ఎంతో ముఖ్యం. దీనికోసం ఇప్పటికే అనేక స్వచ్ఛంద సంస్థలు 'ఈ నగరానికి ఏమైంది' వంటి ప్రచారాన్ని విస్తృతంగా చేస్తున్నాయి. అయితే ఈ అవగాహన కార్యక్రమాలు పాఠశాలలోను, కళాశాలలోను ప్రతినెలా నిర్వహించాలి. వీలైతే పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల కలిగే అనర్థాలను ఒక పాఠ్యాంశంగా చేర్చటం కూడా చేయాలని అనేకమంది కోరుతున్నారు. జిల్లాలోను పొగాకు ఉత్పత్తుల వాడకం అధికస్థాయిలోనే ఉంది. ఇటు పెద్ద వయసు వారే కాకుండా కళాశాలలో చదివే విద్యార్థులు సైతం అధికంగా సిగరెట్, గుట్కాలను ఉపయోగిస్తున్నారు. అయితే వీటిని కొనటానికి కొంతమంది యువత దగ్గర డబ్బులు లేక పెడతోవ పట్టటం, చిన్నచిన్న నేరాలకు పాల్పడం ఎంతో ఆందోళన కలిగిస్తున్న విషయం. ఇకనైనా అటు స్వచ్ఛంద సంస్థలు, ఇటు ప్రభుత్వ యంత్రాంగం పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల కలిగే అనర్థాలను తెలియజేప్పేందుకు పటిష్టమైన కార్యాచరణ చేపట్టాలని అనేకమంది కోరుతున్నారు.

గురిజేపల్లిలో కేంద్ర బృందం పర్యటన

- ఇంటింటా తాగునీటి కొళాయిల పరిశీలన
- పారిశుధ్యం అధ్వానంతో పంచాయతీ అధికారులపై అసహనం



గ్రామస్థులతో మాట్లాడుతున్న కేంద్ర బృంద సభ్యులు

ఎర్రగొండపాలెం రూరల్ మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురిజేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన జల్‌జీవన్ మిషన్ పథకాన్ని కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్ సెక్రటరీ డాక్టర్ వాగేష్ తీవారి, నోడల్ అధికారి డాక్టర్ దినేష్ కుమార్ పెరివాల్ జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రతి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన నీటి కోళాయిలను పరిశీలించారు. ఫ్లోరిన్ శాతం ఎంత ఉంది? పథకం ఏలా ఉంది? అనే విషయాలను గ్రామ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని, గ్రామ వార్డు సచివాలయాన్ని సందర్శించి సచివాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 'గతంలో నీటి ట్యాంకర్ కోసం ఎదురుచూడాల్సి వచ్చేది. చాలీచాలని నీటితో ఇబ్బందులు పడ్డాం' అని ప్రజలు వారికి వివరించారు. ప్రస్తుతం నివాసాల ముందే పైపుల ద్వారా నీరు రావడం బాగుందని తెలిపారు. అయితే గ్రామానికి దూర ప్రాంతంలో ఉండే ప్రజలకు సరిపడా నీరు రావడం లేదని బృందం దృష్టికి తీసుకొచ్చారు. నీరు ప్రజలందరికి చేరేలా వెంటనే చర్యలు తీసుకోవాలని అదేశించారు. కేంద్ర బృందం వస్తున్న గ్రామంలో ఎక్కడి చెత్త అక్కడే, ఎక్కడ బురుద అక్కడే ఉండటంతో దాన్ని గమనించిన బృంద సభ్యులు పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

● నీటి కుంటల పరిశీలన..

జాతీయ ఉపాధి హామీ పథకం ద్వార చేపట్టిన నీటి కుంటలను కేంద్ర బృందం పరిశీలించింది. గురిజేపల్లి గ్రామంలో ఉపాధి కూలీల చేసిన కందకాలు, నీటి కుంటలను బృంద సభ్యులు పరిశీలించారు. అనంతరం డ్వామా అధికారులతో మాట్లాడి ఉపాధి పనులు ఎలా జరుగుతున్నాయో అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. వానలకు కందకాలు, నీటి కుంటలలో నీరు నిండా ఉండటంతో కేంద్ర బృందం హర్షం వ్యక్తం చేసింది. ఆయా కార్యక్రమాల్లో ఆర్‌డబ్ల్యూయస్ ఎస్ఈ బాల కిషోర్, డ్వామ పీడీ జోసఫ్ కుమార్, ఆర్‌డబ్ల్యూయస్ ఈఈ ఎం సురేష్ కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

క్షయవ్యాధి ఎక్కువ ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- వైద్యశాఖ అధికారులకు జేసీ గోపాలకృష్ణ ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, మే 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్షయ వ్యాధి ఎక్కువగా ఉన్న గ్రామాలపై వైద్యశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో శుక్రవారం టీబీ ముక్తిభారత్ అభియాన్ సమావేశంలో జేసీ మాటాడారు. క్షయ వ్యాధి సంభవం, మరణాలపై గణనీయమైన ప్రభావాన్ని చూపే అంశాలపై దృష్టి సారించాలన్నారు. క్షయ వ్యాధి ఎక్కువ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో అవగాహన కల్పించాలన్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు, పోషకాహారలోపం ఉన్నవారు, ధూమపానం చేసేవారు, మద్యపానం చేసేవారు, గతంలో టీబీ ఉన్నవారు, వారి దగ్గరి బంధువులపై స్క్రీనింగ్ పరీక్షలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టీబీ (క్షయ) వ్యాధిపై అనుమానం ఉన్న వారందరూ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. తద్వారా క్షయ రహిత సమాజాన్ని నిర్మించేందుకు సాధ్యమవుతుందన్నారు.

జూన్‌లో టీచర్లకు శిక్షణ

ఒంగోలు విద్య, మే 30 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల పునఃప్రాకరంభానికి ముందే జూన్‌లో హైస్కూలు హెడ్మాస్టర్లకు, స్కూలు అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 3,4,5 తేదీల్లో జిల్లాలోని హైస్కూలు హెచ్‌ఎంలందరికీ మూడు రోజుల పాటు ఒంగోలులో జిల్లాస్థాయి శిక్షణ జరుగుతుందన్నారు. 8,9,10 తేదీల్లో డివిజన్‌స్థాయిలో స్కూలు అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తారు. ప్రధానంగా అకడమిక్ అంశాలపైనే ఈశిక్షణ ఉంటుంది. జూన్ 3,4,5 తేదీల్లో 150 మందికి జిల్లాస్థాయి డీఆర్‌పీలకు కూడా ఒంగోలులో శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ కార్యక్రమాలన్ని నాన్ రెసిడెన్షియల్ విధానంలో జరుగుతుందని డీఈవో తెలిపారు.

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ మూల్యాంకనం

ఒంగోలు విద్య, మే 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం శనివారం నుంచి స్థానిక డీఆర్‌ఆర్‌ఎం మునిసిపల్ హైస్కూలులో ప్రారంభమవుతుంది. మూల్యాంకనానికి 300 మంది స్కూలు అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లను నియమించారు. వివిధ జిల్లాల నుంచి 12వేల జవాబు పత్రాలు మూల్యాంకనానికి వచ్చాయి. మూల్యాంకనానికి క్యాంప్ ఆఫీసర్‌గా డీఈవో కిరణ్‌కుమార్, డిప్యూటీ క్యాంపు ఆఫీసర్‌గా ఏసీకే శివకుమార్, ఎంఈవో టి.కిషోర్‌బాబు వ్యవహరిస్తారు. డీఆర్‌ఆర్‌ఎం మునిసిపల్ పాఠశాలలోని పైభాగంలో మూల్యాంకన ఏర్పాట్లు చేశారు. మూల్యాంకన విధులకు నియమితులైన వారందరూ ఉదయం 9 గంటలకు మూల్యాంకన కేంద్రానికి హాజరుకావాలని డీఇవో కిరణ్‌కుమార్ ఆదేశించారు.

వ్యాపార కేంద్రాలపై విస్తృత తనిఖీలు



మద్దిపాడులో వాటర్ ప్లాంట్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, మే 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా అధికార యంత్రాంగం సినిమా థియేటర్లు, పెట్రోలు బంకులు, రేషన్‌దుకాణాలు, ఎంఎల్ఎస్ పాయింట్లు, ఆర్వో ప్లాంట్లను విస్తృతంగా తనిఖీ చేశారు. జిల్లా మొత్తం మీద 238 చోట్ల తనిఖీలు జరిగాయి. జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశాలతో నెలవారీ తనిఖీలను శనివారం నిర్వహించారు. డివిజనల్ రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఈ తనిఖీలను నిర్వహించారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఆర్డీవో లక్ష్మీప్రసన్న గోరంట్ల కాంప్లెక్స్‌లోని సినిమా థియేటర్‌ను పరిశీలించారు. అక్కడి క్యాంటీన్‌లో వాటర్‌బాటిల్స్‌తో పాటు పలు రకాల తిండుబండారాలను పరిశీలించారు. అనంతరం అద్దంకి బస్టాండు వద్ద ఉన్న పెట్రోలు బంకును పరిశీలించారు. సంతపేటలోని రేషన్‌డీలర్‌షాపును పరిశీలించడంతో పాటు ఆర్వో ప్లాంట్లను కూడా తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా పలు అంశాలపై పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో రైసు మిల్లలను కూడా తనిఖీ చేశారు. ఒంగోలులో జరిగిన తనిఖీల్లో ఒంగోలు అర్బన్ తహసీల్దార్ పిన్నిక మధుసూదన్‌తో పాటు ఆయా శాఖల అధికారులు ఉన్నారు. అందిన సమాచారం జిల్లా వ్యాప్తంగా 190కిపైగా ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా రేషన్‌షాపులను సుమారు 60 వరకు తనిఖీ చేయగా 22 గ్యాస్ ఏజెన్సీలు, 43 పెట్రోలు బంకులు, 23 ఆర్వోప్లాంట్లు, 9 సినిమా థియేటర్లు, ఏడు ఆర్టీసీ బస్టాండుల్లోని షాపులను తనిఖీ చేశారు.

మళ్లీ పంజా విసిరిన పెద్దపులి

- మేతకు వెళ్లిన ఆవుపై దాడి
- చంపి బొప్పాయి తోటలోకి లాక్కెళ్లిన మృగం



పెద్దపులి దాడిలో మృతిచెందిన ఆవు

అర్ధవీడు (కంభం), మే 30 (ఆంధ్రజ్యోతి): అర్ధవీడు మండలం పాపినేనిపల్లి పంచాయతీ పరిధిలోని నారాయణపల్లి గ్రామ సమీప అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన పాడి ఆవుపై పెద్దపులి దాడి చేసి చంపిన సంఘటన గురువారం సాయంత్రం వెలుగు చూసింది. వివరాల్లోకి వెలితే నారాయణపల్లి గ్రామానికి చెందిన ఫణికుమార్ అనే రైతు పశువులను బుధవారం అటవీ ప్రాంతంలో మేతకు వదిలాడు. అయితే ఒక ఆవు తిరిగి రాకపోవడంతో గురువారం అడవిలో ఆవు కోసం గాలించగా అటవీ సమీపంలోని బొప్పాయి తోటలో ఆవు మృతిచెందినట్లు గుర్తించారు. ఆవు మెడ కింద, పైన పెద్దపులి పంజా గుర్తులు గుర్తించి పెద్దపులి దాడి చేసి చంపినట్లు భావించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటనా స్థలానికి వెళ్లి పెద్దపులి దాడిలో మరణించినట్లు ధ్రువీకరించి పంచనామా నిర్వహించారు.

ఆందోళనలో పశుపోషకులు

గత రెండు నెలల వ్యవధిలో అర్ధవీడు మండలంలోని అర్ధవీడు, పాపినేనిపల్లి, అచ్చంపేట, వెలగలపాయ, బొమ్మిలింగం గ్రామాల పరిధిలో మేతకు వెళ్లిన సుమారు 10కి పైగా పశువులపై పెద్దపులి దాడి చేసి చంపింది. దీంతో మండలంలోని పశుపోషకులు, రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు కూడా ఆయా గ్రామాలలో పర్యటించి చీకటి పడగానే రాత్రి 7గంటల తరువాత ఎవరూ బయట తిరగవద్దని, పగలు మేతకు వెళ్లిన పశువులను చీకటి పడకముందే ఇళ్లకు తోలుకుని వెళ్లాలని సూచించారు.



ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఉపాధి పనులపై సాంకేతిక సహాయకులతో సమీక్షిస్తున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

నీటి కుంటలను త్వరితగతిన పూర్తి చేయాలి

- డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

ఎర్రగొండపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి): ఫారం పాండ్స్ (నీటి కుంటలు) పనులు త్వరితగతిన పూర్తి చేయాలని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ కోరారు. ఎర్రగొండపాలెం ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏపీవో, సాంకేతిక సహాయకులతో మండలంలో జరుగుతున్న ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. మండలంలో 85 ఫారం పాండ్స్ మంజూరు చేస్తే 40 పనులు మాత్రమే పూర్తి చేశారని అన్నారు. మరో 45 పనులు ఎప్పుడు పూర్తి చేస్తారని ప్రశ్నించారు. చెరువుల్లో ఫిష్ పాండ్స్ పనులు చేపట్టి కూలీలకు పనులు కల్పించాలని అన్నారు. చెరువుల్లో పూడిక తీత పనులు చేపట్టి ఉపాధి కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని అన్నారు. సెంట్రల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు. ఏపీవో శైలజ, ఐటీడీఏ ఏపీవో నాగేశ్వరరావు, టీఏలు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చర్యలు : సీఐ



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ శ్రీకాంత్‌బాబు

నాగులుప్పలపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి): అమ్మనబ్రోలులో ప్రస్తుతం నెలకొన్న పరిసితుల దృష్ట్యా ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, వ్యవహరించినా చట్టపరమైన చర్యలు తప్పవని ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు హెచ్చరించారు. అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన ముప్పవరపు వీరయ్యచౌదరి హత్యకేసులో నిందితుల్లో ఒకరైన వీరగంధం దేవేంద్రనాథ్‌చౌదరి వర్గీయులు రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారని వీరయ్యచౌదరి వర్గీయుల ఫిర్యాదు మేరకు శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయం వద్ద ఇరువర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఒకరిపై ఒకరు దూషణలు, వ్యక్తిగత విమర్శలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసుకొంటూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. శాంతియుతంగా, సంయమనంగా వ్యవహరించాలని హితవు పలికారు. ఇరువర్గాలకు చెందిన పలువురిని బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రజియాసుల్తానా పాల్గొన్నారు.

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

నాగులుప్పలపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో యువకుడు గాయపడిన సంఘటన ఉప్పుగుండూరులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉప్పుగుండూరుకు చెందిన కొలకలూరి సుమంత్ శుక్రవారం ఉదయం తన మోటార్‌సైకిల్‌పై గ్రామంలోని దిన్నెమీద నున్న పెట్రోలు బంక్ వద్దకు వెళుతున్నాడు. ఈక్రమంలో జడ్పీ హైస్కూల్ వద్దకు రాగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఆటోను తప్పించబోయి మోటార్‌సైకిల్ ఢీకొంది. దాంతో కిందపడిన సుమంత్ కాలు విరిగింది. దీంతో చికిత్స నిమిత్తం 108వాహనంలో ఒంగోలులోని ఓ వైద్యశాలకు తరలించారు. పోలీసులు ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల పరిశీలన


ఫీజ్‌బాక్స్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

ఒంగోలు క్రైం, మే 30(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని పలు చోట్ల ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక కమ్మపాలెంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల భద్రతను స్వయంగా పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అదేవిధంగా అక్కడ ఏర్పాటు చేసిన మీటర్లను తనిఖీలు చేపట్టారు. అదేసమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకం లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో డీఈ పాండురంగారావు, ఏఈ సంతోష్ పాల్గొన్నారు.

రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలి : జేసీ

కొత్తపట్నం(ఒంగోలు నగరం) మే 30(ఆంధ్రజ్యోతి): రేషన్‌దుకాణాల ద్వారా కార్డుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సరుకులను పంపిణీ చేయాలని జేసీ గోపాలకృష్ణ ఆదేశించారు. శుక్రవారం అల్లూరులోని రేషన్ దుకాణాన్ని ఆయన తనిఖీ చేశారు. డీలర్ మాధవదాసుతో మాట్లాడారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సరుకుల పంపిణీకి వాహనాలను తొలగిస్తున్నందున కార్డుదారులకు ఇబ్బందిలేకుండా డీలర్లు నిత్యావసరాలు అందించాలని చెప్పారు. ఉదయం 8 గంటల నుంచే సరుకుల పంపిణీ ప్రారంభించాలన్నారు. తాగునీటిని అందుబాటులో ఉంచాలని కోరారు. అనంతరం గ్రామంలోని రైస్‌మిల్లును తనిఖీ చేశారు. తర్వాత కొత్తపట్నంలోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీటీ కృష్ణమోహన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ మంజూరుపత్రం అందజేత

కొండపి, మే 30 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతూ శస్త్ర చికిత్స చేయించుకున్న మండలంలోని గోగినేనివారిపాలెం గ్రామానికి చెందిన బొడ్డపాటి శేషమ్మకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.80లక్షలు మంజూరైంది. అందుకు సంబంధించిన పత్రాన్ని ఒంగోలులోని తన కార్యాలయంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, శేషమ్మ కుమారుడు సురేష్‌కు శుక్రవారం అందజేశారు. టీడీపీ నాయకుడు బీఎల్.నరిసింహం పాల్గొన్నారు.

ఆలయాల్లో ముందస్తు జాగ్రత్తలు


కె.ఉప్పలపాడులోని మల్లికార్జునస్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కొండపి, మే 30 (ఆంధ్రజ్యోతి) : సర్కిల్ పరిధి కొండపి, పొన్నలూరు, జరుగుమల్లి మండలాల్లోని పలు ఆలయాల్లో ఇటీవల వరుస చోరీల నేపథ్యంలో పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు ప్రారంభించారు. అందులో భాగంగా మండలంలోని పలు ఆలయాలను శుక్రవారం సందర్శించారు. కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, ఆలయ అర్చకులకు పలు సూచనలు చేశారు. కె.ఉప్పలపాడులోని శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయాన్ని కొండపి ఏఎస్సై అంకారావు, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు సందర్శించారు. ఆలయంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. విలువైన స్వామివార్ల ఆభరణాలు, హుండీలకు తగిన రక్షణ ఏర్పాటు చేసుకోవాలని అర్చకుడు సోమరాజుపల్లి రాఘవేంద్రశర్మకు సూచించారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

మద్దిపాడు, మే 30(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్సై శివరామయ్య పేర్కొన్నారు. శుక్రవారం మద్దిపాడు ప్రధాన సెంటర్‌లో ఆయన వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ లేని వాహనదారులకు వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తామన్నారు. అదేవిధంగా వాహనం రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి అని, ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న వారికి సైతం హెల్మెట్ ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

జనన ధ్రువీకరణ పత్రాలను వెంటనే ఇవ్వాలి

- మంత్రి డాక్టర్ స్వామి ఆదేశం

సింగరాయకొండ, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లోని చిన్నారులకు వెంటనే జనన ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలని ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ రవిని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఆదేశించారు. ఐదేళ్లు నిండినా పుట్టినరోజు సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులు లేకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను హెచ్ఎంలు అర్రిబోయిన రాంబాబు, అంబటి బ్రహ్మయ్య శుక్రవారం టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి వివరించారు. ఆయనకు వినతిపత్రం సమర్పించారు. చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ప్రవేశాలు పొందలేకపోతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి స్పందించారు. వెంటనే ఆర్డీవో, తహసీల్దార్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. త్వరితగతిన ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు వేల్పుల వెంకట్రావు, నర్రా రాంబాబు ఉన్నారు.


వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి స్వామి

హైదరీ క్లబ్ అభివృద్ధికి సహకారం : ఎంపీ


క్లబ్‌ను పరిశీలిస్తున్న ఎంపీ మాగుంట, సీతారామయ్య, సభ్యులు

ఒంగోలు కలెక్టరేట్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని హైదరీ క్లబ్ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం రాత్రి స్థానిక హైదరీ క్లబ్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ హైదరీ క్లబ్‌లో షటిల్ కోర్టు ఏర్పాటు చేయాలని, అందుకోసం సుమారు రూ.35లక్షల వ్యయం అవుతుందని తెలిపారు. ఎంపీ ల్యాడ్స్‌తో పాటు తమ సంస్థ ద్వారా క్లబ్‌ను అభివృద్ధి చేసేందుకు సహకరిస్తానని మాగుంట హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, క్లబ్ సెక్రటరి డాక్టర్ రాఘవ, ఉపాధ్యక్షుడు డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి, వ్యాపారవేత్త మండవ మురళీకృష్ణ, సీవీఎన్ రీడింగ్ రూము క్లబ్ అధ్యక్షుడు ఈదుపల్లి గురునాథం పాల్గొన్నారు.

మాగుంటను కలిసిన పలు శాఖల అధికారులు

స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో శుక్రవారం ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని గృహ నిర్మాణశాఖ, విద్యుత్‌శాఖ, బీఎస్ఎన్ఎల్, నేషనల్ హైవే అధికారులు కలిసి చర్చించారు. మరోవైపు నేషనల్ హైవే పీడీ ఒంగోలులో రెండోబైపాస్ ఏర్పాటు కోసం ఇప్పటి వరకు తీసుకున్న చర్యలను మాగుంటకు వివరించారు. అదేవిధంగా నగర కమిషనర్ వెంకటేశ్వరరావు కూడా ఎంపీని కలిసి పలు అంశాలపై చర్చించారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తన కార్యాలయంలో 20మంది లబ్ధిదారులకు అందజేశారు. సుమారు రూ.27.77 లక్షల చెక్కులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు.

నగరంలోని పలు దుకాణాల్లో తనిఖీలు

నాణ్యతలేని ఆహార పదార్థాల అమ్మకాలపై నోటీసులు జారీ ● జేసీ కోర్టుకు హాజరుకావాలని అధికారుల ఆదేశం


ఆర్టీసీ డిపోలో స్టాల్స్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు


చీమకుర్తిలో సినిమాహాల్‌ను తనిఖీ

ఒంగోలు కార్పొరేషన్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో పలు దుకాణాల్లో నాణ్యత లేకుండా అమ్మకాలు చేపడుతున్న పలు దుకాణాలపై ఆహార తనిఖీ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి జి.ప్రభాకర్ నేతృత్వంలో స్థానిక ఆర్టీసీ డిపోలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ లైసెన్సు లేకుండా పలు తినుబండారాలు, కూల్‌డ్రింక్స్, ఇతర ఆహార పదార్థాలు అమ్మడాన్ని అధికారులు గుర్తించారు. ఎన్నిసార్లు హెచ్చరించినా దుకాణాదారుల తీరు మార్చుకోకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని షాపుల్లో గడువు తీరిన బిస్కెట్‌లు, ఉండగా, కూల్‌డ్రింక్, వాటర్‌బాటిల్, బిస్కెట్ ప్యాకెట్‌లపై ఎమ్మార్పీ ధర కంటే అదనంగా అమ్మకం చేయడాన్ని గుర్తించి దుకాణ యజమానులకు నోటీసులు జారీ చేశారు. జేసీ కోర్టుకు హాజరుకావాలని ఆదేశించారు. అలాగే మంగమూరురోడ్, అంజయ్యరోడ్‌లో అనుమతులు లేకుండా నిబంధనకు విరుద్ధంగా మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసి వ్యాపారం చేయడాన్ని గుర్తించి నీటి నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. అలాగే మినరల్‌వాటర్ పేరుతో తాగునీటి వ్యాపారం చేయడంపై వారికీ నోటీసులు జారీ చేశారు. ఇదిలా ఉండగా 60 అడుగుల రోడ్‌లోని ఓ హోటల్‌ను తనిఖీ చేసి, గడువు తీరిన నెయ్యి, నూనె, డాల్డా వాడటాన్ని గుర్తించి నోటీసులు జారీ చేసి జేసీ కోర్టుకు హాజరుకావాలని ఆదేశించారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి: చీమకుర్తి పట్టణంతో పాటు మండల పరిధిలోని పలుప్రాంతాల్లో శుక్రవారం తహసీల్దార్ బ్రహ్మయ్య ఇతర శాఖల అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని సినిమాహాల్‌ను, గ్యాస్, పౌరసరఫరాల గోడౌన్లను పరిశీలించారు. బస్టాండ్ సెంటర్ వద్ద దుకాణాలను, టాయిలెట్ల నిర్వహణా తీరును, కూనంనేనివారిపాలెం, గోనుగుంట వద్ద ఉన్న వాటర్‌ప్లాంట్లు, పెట్రోల్ బంక్‌లను పరిశీలించి నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. డీటీ రాజ్యలక్ష్మి, కమిషనర్ రామకృష్ణయ్య, ఏఈ శాంతి తదితరులు పాల్గొన్నారు.

ఓటుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

- ఆర్డీవో లక్ష్మీప్రసన్న

ఒంగోలు కలెక్టరేట్, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క ఓటుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా చేయించుకునే విధంగా సహకరించాలని ఆర్డీవో లక్ష్మీప్రసన్న కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతినెలా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఓటుకు ఆధార్ అనుసంధానం చేసుకోని వారి ఓట్లను తొలగిస్తామని స్పష్టం చేశారు. ఒంగోలు నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా సరి చేస్తామని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. చనిపోయిన వారి ఓట్లను తొలగించడంతో పాటు పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాల కల్పన, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆయా అంశాలపై రాజకీయ పార్టీల నాయకులు ప్రస్తావించిన పలు అంశాలను పరిశీలించి పరిష్కరిస్తామని ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో నగర అసిస్టెంట్ కమిషనర్ కొండయ్య, శివప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ అశోక్, రాజకీయ పార్టీల నాయకులు స్వరూప్, క్రాంతికుమార్, రసూల్, రాయపాటి అరుణ, జి.సత్యం పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో అవకతవకలు జరిగితే చర్యలు

- తహసీల్దార్ నారాయణరెడ్డి

మద్దిపాడు, మే 30(ఆంధ్రజ్యోతి):పెట్రోల్ బంకుల్లో ఎలాంటి అవకతవకలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎస్.నారాయణరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం సీతారాంపురంలోని పెట్రోల్ బంకును ఆయన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్ బంకులలో కొలతల్లో తేడాలు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రంలో తహసీల్దార్ మురళీకృష్ణ బాయిల్డ్ రైస్ మిల్లును ఆయన తనిఖీ చేశారు. రేషన్ బియ్యం పట్టుబడితే మిల్లును సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే పెద్దకొత్తపల్లిలోని రేషన్‌షాపును తహసీల్దార్ నారాయణరెడ్డి తనిఖీ చేశారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ లోపు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు కార్డుదారులకు రేషన్ అందించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్యలక్ష్మి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వంశీ, ఆర్ఐ రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి దుకాణాల వద్దే రేషన్ సరుకులు

- తూకం, ఈపోస్ మిషన్‌లకు మరమ్మతులు

కొండపి, మే 30 (ఆంధ్రజ్యోతి) : కార్డుదారులకు వచ్చేనెల 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల వద్దే నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో మండలంలోని 30 రేషన్ దుకాణాలకు సంబంధించిన తూకం వేసే యంత్రాలు, ఈపోస్‌లను డీలర్లు శుక్రవారం కొండపికి తీసుకువచ్చారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వాటికి మర మ్మతులు చేయించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

సింగరాయకొండ, మే 30 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో వచ్చేనెల 5వ తేదీన నిర్వహించనున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ మూడో కౌన్సిల్ సమావేశాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం స్థానిక తహసీల్దార్, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా సహాధ్యక్షుడు సయ్యద్ మసూద్ అలీ మాట్లాడుతూ ఉద్యోగుల 14 ప్రధాన డిమాండ్ల సాధన కోసం కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగి హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సబ్‌రిజిస్ట్రార్ జాఫర్, డీటీ ముస్తాక్, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, ఎస్‌వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి సబ్సిడీ రుణం

ఒంగోలు(రూరల్), మే30(ఆంధ్రజ్యోతి): పండ్లతోటల పెంపకానికి వంద శాతం సబ్సిడీతో రుణం అందిస్తున్న ఉద్యానశాఖ అధికారి డి.ప్రత్యూష అన్నారు. శుక్రవారం ఒంగోలులో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్లతోటల పెంపకం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏవో కిషోర్‌బాబు పాల్గొన్నారు.

యోగాతోనే ఆరోగ్యం

మద్దిపాడు, మే 30(ఆంధ్రజ్యోతి): యోగా సాధనతోనే శారీరక, మానసిక ఆరోగ్యం పొందవచ్చని ఎంపీడీవో శ్రీనివాసప్రసాద్ అన్నారు. శుక్రవారం మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో యోగా శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ ఆనంద్‌మోహన్, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

ఒంగోలు కలెక్టరేట్, మే 30 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం ఒంగోలులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మునిసిపల్ కార్మికుల పని ప్రదేశాలల్లో ఏర్పాటు చేసిన జెండాను జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు టి.మహేష్, తంబి శ్రీనివాసులు, కె.శ్రీనివాసరావు, సీహెచ్.అక్కేశ్వరరావు, ఎం.సింహాద్రి, వై.రవికుమార్, ఎం.బాబు, కె.శ్రీదేవి, కె.పద్మ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం చీమకుర్తిలోని పంగులూరి కృష్ణయ్యభవన్‌లో ఘనంగా జరిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, అప్పలనాయుడు, పల్లాపల్లి అంజనేయులు, పూసపాటి వెంకట్రావు, పద్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ



ఎమ్మార్సీని పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష అడిషనల్ పీడీ ప్రసన్న కుమార్

విద్యా మిత్ర స్టాక్ పాయింట్‌ల పరిశీలన

మార్కాపురం వన్‌టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర స్టాక్ పాయింట్‌లను సమగ్ర శిక్ష అడిషనల్ పీడీ ప్రసన్న కుమార్ పరిశీలించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా సరఫరా చేస్తున్న పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్టులు, డిక్షనరీల నాణ్యతను పరిశీలించారు. మిగిలిన సామగ్రి త్వరలో సరఫరా అవుతుందన్నారు. పాఠశాలలు పునఃప్రారంభించేలోపు విద్యార్థులకు విద్యామిత్ర సామగ్రి అందజేయాలన్నారు. మండల స్థాయి రిసీవింగ్ టీమ్, డిస్ట్రిబ్యూటింగ్ సభ్యులు కిట్లు పంపిణీ చేసేటప్పుడు పరిశీలించి నాణ్యమైన వాటిని పంపిణీ చేయాలని, డ్యామేజీలు ఉంటే జిల్లా అధికారులకు తెలియపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఒద్దుల వీరారెడ్డి, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ సుధాకర్‌రావు, సతీష్ బాబు, శివశంకర్ రెడ్డి, రామిరెడ్డి, గ్లోరీ రాణి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



నీలంపాటి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎస్ఐ బ్రహ్మనాయుడు

ఘనంగా నీలంపాటి అమ్మవారి వార్షికోత్సవం

తర్లుపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడులో వెలసిన శ్రీనీలంపాటి లక్ష్మీఅమ్మవారి దశమ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, మండపారాధన, కలశ స్థాపన, పంచశుద్ధ హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎస్ఐ బ్రహ్మనాయుడు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి తర్లుపాడు పురవీధుల్లో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు వార్లుపోసి కాయ కర్పూరాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అడిగొప్పుల భక్త బృందం వారిచే భజనా కార్యక్రమాలు నిర్వహించారు.



రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ శైలేంద్రకుమార్

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

పెద్దారవీడు, మే 30(ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శైలేంద్రకుమార్ అన్నారు. మండలంలోని పెద్దారవీడు, దేవరాజుగట్టులలో ఉన్న రేషన్‌దుకాణాలు, వాటర్ ప్లాంట్లను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన విధంగా రేషన్ సరుకులను ప్రతి ఒక్కరికీ అందించాలన్నారు. వాటర్ ప్లాంట్లలో ఖచ్చితమైన నియమాలు పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ గోపీ, డీలర్లు, వాటర్ ప్లాంట్ల యజమానులు పాల్గొన్నారు.

కాటాలు, ఈపోస్ యంత్రాల తనిఖీ

త్రిపురాంతకం, మే 30 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల ద్వారా సరుకులు పంపిణీ చేయాలనే ప్రభుత్వ నిర్ణయం మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఇప్పటివరకు ఎండీయూ వాహనదారుల వద్ద ఉన్న కాటాలు, ఈపోస్ యంత్రాలను తనిఖీ చేసి డీలర్లకు అప్పగించే కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. పుల్లలచెరువు, త్రిపురాంతకం, ఎర్రగొండపాలెం మండలాలకు సంబంధించిన మొత్తం యంత్రాలను త్రిపురాంతకంలోనే తనిఖీ చేశారు. లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్, విజన్‌టెక్ ప్రతినిధుల సమక్షంలో వాటిని తనిఖీ చేసి డీలర్లకు అప్పగించారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ శ్రీనివాస్ పర్యవేక్షించారు.



మండలంలోని తిప్పాయపాలెం గ్రామం వద్ద రైతులకు డ్రోన్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేయూత

మార్కాపురం రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి). రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేయూత ఉంటుందని సేద్య విభాగం శాస్త్రవేత్త వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా మండలంలోని తిప్పాయపాలెం గ్రామ రైతులతో ప్రీ ఖరీఫ్ కార్యక్రమం శుక్రవారం ఏడీఏ బాలాజి నాయక్, ఏవో దేవిరెడ్డి శ్రీనివాసులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు చేయించుకుని ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు సిద్ధం కావాలని కోరారు. పంటల సాగులో డ్రోన్ వాడే తీరును, దాని ఉపయోగాన్ని రైతులకు వివరించారు. ఖరీఫ్ సాగుకు ముందు దుక్కులు దున్నుకోవడం ద్వారా భూమి నుంచి ఆశించే వేరు కుళ్లు తెగుళ్ల, కలుపు సమస్యల నుంచి పంటలను కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంభం, అర్ధవీడు, పెద్దారవీడు, మండలాల వ్యవసాయాధికారులు, వీఏఏలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

సాగుకు సమాయత్తం

ఈ ఏడాది ముందస్తుగా కురిసిన వర్షాలు



మండలంలోని బోడపాడు గ్రామంలో దుక్కిదున్ని సిద్ధం చేసుకున్న భూమి

మార్కాపురం రూరల్, కంభం, ఎర్రగొండపాలెం రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి). ఈ ఏడాది ముందస్తుగా కురిసిన వర్షాలకు రైతన్నలు భూములను దుక్కులు దున్నుకుని ఖరీఫ్‌సాగుకు సమాయత్తమవుతున్నారు. భూములను ట్రాక్టర్‌లతో దున్నుకుని సిద్ధం చేస్తున్నారు. మార్కాపురం ప్రాంతంలో ముఖ్యంగా పత్తి, కంది, సజ్జ, జొన్న పంటలతో పాటు కూరగాయల పంటలను ప్రధానంగా సాగుచేస్తారు. ఈ ఏడాది మే నెలలో వర్షపాతం కూడా గత ఏడాది కంటే ఎక్కువగానే నమోదైంది. సాధారణంగా మే నెలలో 40 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సిఉండగా ఈ ఏడాది 194 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. దీంతో భూములు బాగా పదునై దుక్కులు దున్నుకునేందుకు అనుకూలంగా ఉన్నాయి.

మండలంలోని కోలభీమునిపాడు, కొత్తపల్లి, తిప్పాయపాలెం గ్రామాలతో పాటు మరి కొన్ని గ్రామాల చెరువులు జలకళను సంతరించుకున్నాయి. దీంతో భూగర్భ జలాలు కొంత మేర పెరుగుతాయని బోర్లకు నీటి సమస్యలేకుండా వస్తాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల నల్లమల ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు మార్కాపురం ప్రాంతంలో ఉన్న గుండ్లకమ్మ నదికి కూడా నీరు వస్తోంది.

కంభం సబ్‌డివిజన్‌లో..

ఈ ఏడాది 10 రోజుల ముందుగానే వచ్చిన రుతుపవనాల ప్రభావాలతో కురిసిన వర్షాలకు కంభం సబ్ డివిజన్‌లోని కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల్లో భూములు పదునయ్యాయి. దీంతో ఈ ప్రాంత రైతులు ఖరీఫ్ పంట సాగుకు సిద్ధమవుతున్నారు. రైతులు తమ పొలాలను దుక్కి దున్నుకుంటున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు సజ్జ, కొర్ర, కంది, మొక్కజొన్న, పత్తి పంటలు వేసేందుకు సమాయత్తమవుతున్నారు. వ్యవసాయ బోర్లు ఉన్న రైతులు ముందుగానే పత్తిని సాగు చేసుకుంటున్నారు. ఈ విషయమై గిద్దలూరు వ్యవసాయశాఖ ఏడీఈ బాలాజీనాయక్‌ను ప్రశ్నించగా గతంలో ఎన్నడూ లేని విధంగా మే నెలలోనే భారీ వర్షాలు కురవడంతో ఈప్రాంతాలలోని పొలాలన్నీ పదునెక్కాయని, రైతులు ఉత్సాహంగా పొలాలను దున్ని ఖరీఫ్ పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

ఎర్రగొండపాలెంలో..

ఇటీవల కురిసిన వానలకు ఎర్రగొండపాలెం మండలం వ్యాప్తంగా రైతులు సాగుకు సన్నద్ధం అవుతున్నారు మండలంలో అరటి, బొప్పాయి, పత్తి పంటలు సాగు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నేపథ్యంలో బోర్లు ఉన్న ప్రాంతంలో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ఇప్పటికే మండలంలోని బోయలపల్లి, గురిజేపల్లి, అమానిగుడిపాడు, మురారిపల్లి, మిల్లంపల్లి, వాదంపల్లి, తమ్మడపల్లి, గొళ్ళవిడిపి, ఆయ్యంబొట్లపల్లి, గంగాపాలెం తదితర గ్రామలలో పొలాలు వర్షాలకు పదునయ్యాయని రైతులు చెబుతున్నారు.



ఎలకచెట్టు వద్ద బొప్పాయి మొక్కలు నాటుతున్న కూలీలు

పత్తి రైతుకు ప్రతికూలం



దోర్నాలలో పత్తి విత్తనాలు నాటుతున్న రైతులు

పెద్ద దోర్నాల, మే 30(ఆంధ్రజ్యోతి):ఈ ఏడాది పత్తి సాగుకు వింత పరిస్థితులు ఏర్పడ్డాయి. నాలుగైదు రోజులుగా కురిసిన వర్షపు జల్లులు మండలంలో సాగు చేసిన వేసవి పత్తి ఎదుగుదలకు ప్రతిబంధకాలుగా మారాయి. నాటిన పత్తి విత్తనాలు సరిగ్గా మొలవడం లేదు. మొలిచినా అవి ఆరోగ్యంగా ఎదగలేకపోతున్నాయి. ఒకసారి నాటిన విత్తనాలు ఒకే సారి మొలవడం లేదు. మొలిచినా మొక్కల ఆకులు పచ్చగా మారి ముడుచుకు పోతున్నాయి. మరి కొన్ని విత్తనాలు వాన నీటికి కొట్టుకుని పోవడం, ఇంకొన్ని విత్తనాలపై మట్టి చేరుకోవడంతో అవి భూమిలోపలే ఉండి పోతున్నాయి. దీంతో పైరు సక్రమంగా కనిపించడం లేదు. ఫలితంగా మళ్లీ మళ్లీ నాటాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఈ లోపు వాతావరణం చల్లగా ఉండడంతో పాటు అప్పుడప్పుడు కురుస్తున్న జల్లులకు తేమ శాతం ఎక్కువై కలుపు మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. ఇవి పైరు ఎదుగుదలకు అవాంతరంగా మారుతున్నాయి. మండలంలో సుమారు 500 ఎకరాల్లో పత్తిని విత్తారు. అయితే వరుసగా 4,5 రోజులు కురిసిన నాన్పుడు వానకు పైరుకు నష్టం ఏర్పడుతుండడంతో నెల రోజుల కష్టం, సొమ్ము వృథాఅవుతుందని రైతుల ఆవేదన చెందుతున్నారు. కాగా కొత్తగా మరి కొందరు రైతులు వాతావరణం అనుకూలంగా ఉండడంతో పత్తిని విత్తుతున్నారు. జూన్ చివరి నాటికి మరో వెయ్యిఎకరాల్లో పత్తి సాగయ్యే అవకాశం ఉంది.

ఆర్టీసీ బస్టాండ్‌లో తహసీల్దార్ తనిఖీలు

మార్కాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ కె.చిరంజీవి శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు చేపట్టారు. ముందుగా పరిసరాలు క్షుణ్ణంగా పరిశీలించారు. బస్టాండ్‌కు తూర్పువైపున అసంపూర్తిగా ఉన్న టాయిలెట్లను గమనించి డీఎం నరసింహులుతో మాట్లాడారు. అదే విధంగా దుకాణాల్లో ఉన్న ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రయాణికులకు అందుతున్న సేవలు, బస్టాండ్ స్థితిగతులను పరిశీలించి నివేదికను అందజేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట డీటీ శ్రీనివాసులు, ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

ఎర్రగొండపాలెం, మే 30(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికి ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని జూన్ 2 వతేదీన తలపెట్టిన సీపీఐ ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి డి. శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం సీపీఐ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణలో ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

గ్రంథపాలకుడికి ఘన సన్మానం

పెద్ద దోర్నాల, మే30(ఆంధ్రజ్యోతి):స్థానిక వీఎం ఫంక్షన్ హాలులో గ్రంథపాలకుడు వెంకట సుబ్బారెడ్డిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. దోర్నాలలోని గ్రంథాలయంలో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన వెంకట సుబ్బారెడ్డి దంపతులను గ్రంథాలయ విశ్రాంత డిప్యూటీ డైరక్టర్ వెన్నా పోలిరెడ్డి, సాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన శాస్త్రి, వయోజనవిద్య ఉప సంచాలకులు వీరారెడ్డి, ఎస్‌వీకేపీ మాజీ ప్రిన్సిపాల్ ధర్మానాయక్‌లు శాలువా కప్పి సత్కరించారు.

భవిత కేంద్రం తనిఖీ

తర్లుపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడులోని భవిత కేంద్రాన్ని జిల్లా కోఆర్డినేటర్ నాగేంద్ర నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. టీచర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు అనంతలక్ష్మి, వనితా జ్యోతి పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు

గిద్దలూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం యడవల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం కలశ స్థాపన, శాంతిహోమం నిర్వహించారు. విష్ణు సహస్రనామ పారాయణాన్ని సామూహికంగా చేశారు. శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ ప్రతినిధులు తెలిపారు.

వైభవంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయుని మూలవిరాట్

మార్కాపురం వన్‌టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక డ్రైవర్స్ కాలనీలోని అభయాంజనేయ స్వామి, వీరాంజనేయస్వామి ఆలయంలో 18వ వార్షిక మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి మూలవిరాట్‌కు అర్చకులు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారాముల కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

జగదాంబకు ప్రత్యేక పూజలు

స్థానిక జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం జగదాంబకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వరుణ్‌తేజ శర్మ అమ్మవారికి విశేష అలంకరణ, కుంకుమార్చన నిర్వహించారు.మహిళలు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు.

సీపీఐ గిద్దలూరు నియోజకవర్గ కార్యవర్గం

బేస్తవారపేట,మే30(ఆంధ్రజ్యోతి): సీపీఐ గిద్దలూరు నియోజకవర్గ కార్యదర్శిగా కేవీ రమణ,సహాయ కార్యదర్శిగా ఊరుమార్పు జోసఫ్‌లను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గంలోని రాచర్లలో జరిగిన మహాసభలో 23 మంది సమితి సభ్యులను ఎంపిక చేశారు. సీనియర్ నాయకులు దాకాల పుల్లయ్య, బత్తిని శ్రీనివాసులు సభకు అధ్యక్షత వహించారు.

యోగాతో ఆరోగ్యం

బేస్తవారపేట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం యోగాంధ్ర శిక్షణ జరిగింది. మహిళలకు ప్రత్యేక సమావేశం హాల్‌లో ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏవీ రంగనాయకులు, తహసీల్దార్ జితేంద్ర కుమార్,ఏపీవో పాల్గొన్నారు.

సీఐటీయూ జెండా ఆవిష్కరణ

మార్కాపురం వన్‌టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): : స్థానిక పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో సీఐటీయూ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జెండాను మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కె.సుబ్బరాయుడు ఆవిష్కరించారు.

పొదిలి : స్థానిక మస్టర్ పాయింట్ వద్ద కార్మికులు శుక్రవారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడగా నాయకులు సుబ్బయ్యనరసింహం, జి.నాగేశ్వరరావు, హనుమంతు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి

మార్కాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి గురై వైద్యశాలలో చికిత్సపొందుతూ ఓ మహిళ శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందింది. టౌన్ ఎస్సై సైదుబాబు కథనం మేరకు తర్లుపాడు మండలం మంగళకుంట గ్రామానికి చెందిన జవ్వాజి నాగేశ్వరరావు, షకీల దంపతులు మోటార్‌బైక్‌పై మార్కాపురం వస్తుండగా గురువారం స్థానిక ఎస్టేట్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ప్రమాదానికి గురయ్యారు. వీరిలో షకీల పరిస్థితి విషమంగా ఉండటంతో మార్కాపురం జీజీహెచ్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు దుకాణంలో మహిళ చేతివాటం

- సీసీ పుటేజీతో చోరీ వెలుగులోకి

మార్కాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): ఆభరణాలు కొనుగోలు చేయడానికి బంగారు దుకాణానికి వెళ్లిన ఓ మహిళ చేతివాటం చూపింది. సీసీ పుటేజీలో చోరీ జరిగిన విషయం తెలుసుకున్న యజమాని వెంటనే అప్రమత్తమై చోరీకి గురైన వెండి ఆభరణాలను వారివద్ద నుంచి తీసుకున్నారు. తర్లుపాడు మండలం బుడ్డపల్లెకు చెందిన ముగ్గురు మహిళలు స్థానిక చెన్నకేశవస్వామి దేవస్థానం పక్కవీధిలోని ఓ బంగారు దుకాణానికి వెళ్లారు. ఆభరణాలు కొనుగోలు చేస్తున్నట్లుగా నటించి వారిలోని ఓ మహిళ వెండి పట్టీలను సంచిలో వేసుకుంది. తమకు ఏవీ నచ్చనట్లు ముగ్గురు మహిళలు వెళ్లిపోయారు. వారి వ్యవహారశైలిపై అనుమానం వచ్చిన యజమాని వెంటనే సీసీ పుటేజీని గమనించారు. ఓ మహిళ వెండి పట్టీలు అపహరించినట్లు గుర్తించి వెంటనే వారిని వెంబడించాడు. గట్టిగా ప్రశ్నించడంతో తెలిసీ తెలియక తాను తప్పుచేశానని పట్టీలు దుకాణ యజమానికి తిరిగి ఇచ్చేసింది.



బంగారు దుకాణంలో ఆభరణాలు కొనేందుకు వచ్చిన మహిళలు



సమావేశంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి

ప్రతి పథకానికి కౌలు రైతు అర్హుడు

గిద్దలూరు టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): భూ యజమానులతోపాటు కౌలు రైతులు కూడా ప్రభుత్వం ద్వారా అందే ప్రతి ఒక్క పథకంలో అర్హులు కావాలనే ఉద్దేశంతో పంట సాగుదారు హక్కు చట్టం తీసుకువచ్చిందని మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గిద్దలూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రం జారీపై మండలంలోని గ్రామ రెవెన్యూ అధికారులు ఆర్ఎస్‌కె సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి మండలానికి 1,534 కౌలు కార్డులు జారీ చేశామని, వాటి కాల పరిమితి 11 నెలలు అని, దీని వలన భూయజమానులకు ఎటువంటి ఇబ్బంది ఉండదని అన్నారు. కౌలు రైతులకు పంట మీద మాత్రమే హక్కు ఉంటుందని, భూమి మీద ఉండదన్నారు. దేవదాయ భూములకు కౌలు కార్డులు ఇవ్వవచ్చని, అసైన్‌మెంట్ పొలాలకు కౌలు కార్డులు ఇవ్వకూడదని తహసీల్దార్ ఆంజనేయరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ భాస్కర్‌రావు, వ్యవసాయ విస్తరణాధికారులు శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారులు, రైతు సేవా సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం సమాచారం

రెండు మోటార్‌బైకుల ఢీ

● ఆపై తొక్కేసిన లారీ ● ఒకరి మృతి



శ్రీకాంత్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలిస్తున్న పోలీస్ సిబ్బంది

కొమరోలు, మే30(ఆంధ్రజ్యోతి): రెండు మోటార్‌బైక్‌లు ఢీకొని కిందపడిన చోదకులను వెనుక నుంచి వచ్చిన లారీతొక్కేసిన ఘటన మండలంలోని యర్రపల్లి గ్రామసమీపంలోని అమరావతి-కడప రాష్ట్రీయ రహదారిలో శుక్రవారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు మండలంలోని మదవపల్లి గ్రామానికి చెందిన బైరగాని శ్రీకాంత్(22) నెల్లూరులో పనిచేస్తూ అల్లుని వివాహం నిమిత్తం గ్రామానికి రెండు రోజుల కిందట వచ్చారు. వివాహ పనుల నిమిత్తం మండల క్రేంద్రమైన కొమరోలుకు వచ్చి తిరిగి ఇంటికి బైక్‌పై మదవపల్లికు వెళ్తున్నారు. యర్రపల్లి గ్రామసమీపంలోని అమరావతి-కడప రాష్ట్రీయ రహదారిలో శ్రీకాంత్ మోటార్‌బైక్‌ను ఎదురుగా వస్తున్న మరో మోటార్‌బైక్ ఢీకొంది. ఆవెంటనే వెనుక నుంచి వేగంగా వస్తున్న లారీ శ్రీకాంత్ మోటార్‌బైక్‌ను తొక్కేసింది.దీంతో శ్రీకాంత్ లారీటైర్ల కిందపడిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తికి కాలు, చేతులకు బలమైన గాయాలు కావటంతో అతనిని గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న కొమరోలు ఎస్సై నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. మృతునికి మరి కొద్దిరోజుల్లో వివాహం చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లను చేసుకున్నారు. ఈ తరుణంలో మృతితో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది.



చెల్లా చెదురైన కర్రీస్ పాయింట్, డెయిరీపార్లర్‌లో వస్తువులు పేలి ముక్కలైన సిలిండర్

పేలిన గ్యాస్ సిలిండర్

● తప్పిన పెను ప్రమాదం

పొదిలి, మే 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విశ్వనాథపురం గీతాంజలి రోడ్డులో ఓ కర్రీస్ తయారుచేసే షాపులో ప్రమదావశాత్తు గ్యాస్ సిలిండర్ పేలిన ఘటన శుక్రవారం ఉదయం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బీజేఎం కర్రీస్ పాయింట్, డెయిరీపార్లర్‌లో రోజులాగా కర్రీస్ తయారు చేసే పనిలో యజమానులు ఉన్నారు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు గ్యాస్‌లీకై మంటలు చెలరేగాయి. యజమానులు ప్రత్యామ్నాయంగా మంటలను ఆర్పకుండా భయంతో బయటకు పరుగులు తీశారు. పదినిమిషాలు మంటలు చెలరేగి ఆరిపోయాయి. 15నిమిషాల గ్యాప్ తరువాత గ్యాస్‌సిలిండర్ ఒక్కసారిగా పెద్దశబ్దంతో పేలిపోయింది. ఈపేలుడు ధాటికి కర్రీస్ పాయింట్ పక్కనే ఉన్న ఫొటోస్టూడియోలో ఏర్పాటు చేసిన సీలింగ్ మొత్తం చెల్లాచెదురుగా ఊడిపోయింది. అదే విధంగా పైఅంతస్తులో చిన్నారులకు డ్యాన్స్ స్కూల్ ఉంది. అందులో కూడా అద్దాలు పగిలి, షెట్టర్ వంగిపోయిందని నిర్వాహకులు తెలిపారు. అయితే సిలిండర్‌లో పూర్తిస్థాయిలో గ్యాస్ లేకపోవడంతో స్వల్ప నష్టం జరిగిందని యజమాని తెలిపారు. ఈప్రమాదంలో గ్యాస్ సిలిండర్ పేలి మూడు ముక్కలైంది. సమాచారం తెలుసుకున్న దర్శి అగ్నిమాపక సిబ్బంది వచ్చి ప్రమాదస్థలాన్ని పరిశీలించారు. కారణాలను తెలుసుకున్నారు.

కానిస్టేబుల్ ఇంట్లో చోరీ

● 1.50 తులాల బంగారం, రూ.54వేల నగదు చోరీ

గిద్దలూరు టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ ఇంట్లో చోరీ జరిగింది. సుమారు 1.50 తులాల బంగారం, రూ. 54వేల నగదును దొంగిలించారు. అందిన సమాచారం మేరకు గిద్దలూరు మండలం కెఎస్‌పల్లె గ్రామంలో నివాసం ఉంటున్న ప్రసాద్ అర్ధవీడు పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం ప్రసాద్ తిరుమలకు వెళ్ళాడు. తిరుమల నుంచి గురువారం తిరిగి వచ్చి ఇంట్లో చూడగా ఇంటి వెనుక వైపు నుంచి తలుపులు బద్దలుకొట్టి ఉన్నాయి. బీరువాలో వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉండడంతో గుర్తించిన ప్రసాద్ గిద్దలూరు అర్బన్ పోలీసులను ఆశ్రయించాడు. తన ఇంట్లో 1.50 తులాల బంగారు, 54వేల రూపాయల నగదు దొంగలు చోరీ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అర్బన్ సీఐ సురేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పందిని ఢీకొన్న బైక్

● ఇరువురికి గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న నబీరసూల్

పెద్దదోర్నాల,మే30(ఆంధ్రజ్యోతి): అకస్మాత్తుగా రోడ్డుకు అడ్డంగా వచ్చిన పందిని ఢీ కొట్టి మోటార్ వాహనచోదకులు ఇరువురికి గాయాలయ్యాయి.ఈ సంఘటన స్థానిక కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది.ఈ ప్రమాదంలో దోర్నాలకు చెందిన నబీరసూల్, పోలయ్యకు గాయాలయ్యాయి. గమనించిన కొందరు 108 అంబులెన్స్‌కు సమాచారమివ్వడంతో క్షతగాత్రులను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యాధికారులు ప్రథమ చికిత్సలు నిర్వహించారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై చర్యలేవీ..!

- మార్కింగ్‌లు ఇచ్చి వదిలేసిన అధికారులు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అక్రమార్కులు


దర్శి-అద్దంకి రోడ్డులో ప్రభుత్వభూమిని ఆక్రమించి నిర్మాణాలు

దర్శి, మే 30(ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయల విలువచేసే ప్రభుత్వ స్థలాలు ఏళ్ల తరబడి ఆక్రమణల్లో ఉన్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. గతంలో దర్శి పట్టణంలో అనేకచోట్ల ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. అక్రమార్కులు యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాల్లో కట్టడాలు నిర్మించుకున్నప్పటికీ పట్టించుకున్న నాథుడు లేడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆక్రమణదారుల భరతం పడతారని భావించినప్పటికీ ఫలితం లేదు. దీంతో అక్రమార్కులు యథేచ్ఛగా కోట్లాది రూపాయల స్థలాలను స్వాహాచేసి అనుభవిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవటంతో తాజాగా మరికొన్ని స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. అధికారుల తీరుపట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

దర్శి-కురిచేడు రోడ్డులో ఏళ్ల తరబడి బండిదారి స్థలం ఆక్రమణకు గురైంది. దర్శి రెవెన్యూలోని 244, 247, 248, 266 సర్వే నెంబర్లల్లో సుమారు పది ఎకరాల బండిదారి భూమి ఉంది. ఆ భూమిలో సగానికి పైగా చుట్టుపక్కల వారు ఆక్రమించారు. ఒక కళాశాల యాజమాన్యం ఎకరానికి పైగా ఆక్రమించి ప్రహరీగోడ కూడా నిర్మించారు. కొంతమంది యథేచ్ఛగా భవనాలు నిర్మించారు. బండిదారి ఆక్రమణలు తొలగించాలని ఆప్రాంత రైతులు జిల్లా అధికారులను అనేకసార్లు కలిసి ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు. రెవెన్యూ అధికారులు ఉన్నతాధికారులు ఆదేశించిన సమయంలో హడావుడి చేసి వదిలేస్తున్నారు. బండదారి ఆక్రమణల తొలగింపు కోసం గత నాలుగు సంవత్సరాల క్రితమే సర్వేచేసి మార్కింగ్ కూడా ఇచ్చారు. ఆనాటి వైసీపీ పెద్దలకు తలొగ్గి ఆక్రమణల తొలగింపు గురించి పట్టించుకో లేదు. ఇదే అదునుగా ఎన్నికల సమయంలో అనేకమంది బండిదారి భూమిలో గృహాలు నిర్మించుకున్నారు. తాజాగా మరికొంత మంది బండిదారిలో మరికొంత భూమి ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. ఇదే అదునుగా అక్రమార్కులు మిగిలిన ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను కూడా స్వాహా చేసేందుకు మళ్లీ ప్రయత్నాలు ప్రారంభించారు.


ఆక్రమణకు గురైన బండిదారి

దర్శి-అద్దంకి రోడ్డులోని 340/5 సర్వే నెంబర్‌లో 80 సెంట్లు ప్రభుత్వభూమి ఉంది. అందులో కొంత స్థలాన్ని రహదారి, సొసైటీ భవన నిర్మాణానికి అధికారులు కేటాయించారు. ఇంకా 50 సెంట్లకు పైగా భూమి ఉంది. అక్కడ సెంటు భూమి రూ.10 లక్షలకు పైగా ధర పలుకుతుంది ఇటీవల అక్రమార్కులు ఆ స్థలంలో కొంతభాగాన్ని ఆక్రమించి టైల్స్ వేసి టాయిలెట్స్ నిర్మించారు. ఎంతోకాలంగా ఖాళీగా ఉన్న ఈ భూమిలో తాజాగా నిర్మాణాలు చేపట్టి స్వంత భూమిలో కలుపుకోవటంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇదేమిటని ప్రజలు మున్సిపల్ అధికారులను ప్రశ్నిస్తే వాడుకున్న ప్రభుత్వ స్థలానికి ట్యాక్స్ వేస్తామని చెబుతున్నారు. అధికారుల తీరుచూస్తే అక్రమార్కులకు అనధికారికంగా హక్కు కల్పించే ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అదేవిధంగా దర్శి-పొదిలి రోడ్డులోని వాగు పోరంబోకు భూమిని ఆక్రమించి విక్రయించేందుకు గతంలో చదును చేశారు. ఆభూమి ఆక్రమణకు గురికాకుండా అధికారులు అడ్డుపడతారనే ఉద్దేశంతో ముందుజాగ్రత్తగా ఆస్థలంలో ఒక చిన్న ఆలయం కూడా నిర్మించారు. అధికారులు ఇంత జరుగుతున్నా నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఆక్రమణలను తొలగించి చర్యలు తీసుకుంటారని ప్రజలు భావించినప్పటికీ నేటివరకు ఆదిశగా అడుగులు పడలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోట్లాది రూపాయల విలువచేసే ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వైభవంగా స్వామివార్ల విగ్రహాల ప్రతిష్ఠ

- భక్తులతో పోటెత్తిన వేంపాడు

ముండ్లమూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు అంబేడ్కర్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామ లక్ష్మణ స్వామి ఆలయ ప్రతిష్ఠ శుక్రవారం వైభవంగా జరిగింది. ముందుగా ఉదయం 7.06 గంటలకు ధ్వజ స్తంభ ప్రతిష్ఠ చేశారు. అనంతరం ఆలయంలో సీతారామ లక్ష్మణస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఓం రామ శ్రీరామ జయ జయ రామ అంటూ గ్రామమంతా భక్తులతో పులకించి పోయింది. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా రూ.20 లక్షలతో తీర్చిదిద్దారు. వేంపాడు గ్రామస్థులతోపాటు చుట్టు పక్కల గ్రామాలైన శంకరాపురం, ముండ్లమూరు, పోలవరం పెదరావిపాడు, నాయుడుపాలెం, మారెళ్ళ, పెద ఉల్లగల్లుతోపాటు పొరుగు ప్రాంతాలకు చెందిన భక్తులు వచ్చి దేవతామూర్తులను దర్శించుకున్నారు. జిల్లా జడ్జి ఇందిరా ప్రియ దర్శిని దంపతులు, ఎమ్మెల్యే శివ ప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. వేదపండితులు ఓరుగంటి సీతారామశర్మ, గ్రామ పురోహితులు దుర్భాగుల నగేష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు.


రామాలయంలో కొలువుదీరిన సీతారామ లక్ష్మణ స్వామి


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న న్యాయాధికారి ఇందిరా ప్రియదర్శిని

రేషన్ షాపులకు పూర్వవైభవం

- రేపటి నుంచి పంపిణీ
- వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దే!
- తూకాల్లో తేడా లేకుండా ఎలక్ట్రానిక్ కాటాల ఏర్పాటు
- దొనకొండలో పది ఎండీయూ వాహనాలకు బ్రేక్

దొనకొండ, మే 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రేషన్ షాపుల ద్వారా ప్రజలకు నిత్యావసర వస్తువులు పంపిణీ జరిగేలా టీడీపీ కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో తిరిగి రేషన్‌షాపులకు పూర్వవైభవం వస్తుంది. జూన్ ఒకటో తేదీనుంచి రేషన్ షాపుల్లో సరుకులు పంపిణీ చేస్తారు. ఇప్పటికే అధికారులు ప్రభుత్వం ఏర్పాటుచేసిన యాప్‌లో గ్రామాల్లో రేషన్‌షాపులకు చెందిన పూర్తి వివరాలను అప్‌లోడ్ చేస్తూ ఎలక్ట్రానిక్ కాటాలతో షాపుల ఏర్పాటును ప్రభుత్వ నిర్దేశాలకు అనుగుణంగా సంసిద్ధం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఇంటి వద్దకే రేషన్ అంటూ ఎండీయూ వ్యవస్థను ఏర్పాటుచేసింది. వైసీపీ సానుభూతిపరులను ఆపరేటర్లుగా ఎంపికచేసి పది శాతం వారి వాటాగా చెల్లింపులు జరిపి ఒక్కో వాహనాన్ని రూ.7లక్షల చెప్పున కొనుగోళ్లు చేశారు. అందుకు ప్రభుత్వం ఆపరేటర్ వేతనం రూ.10 వేలు, హెల్పర్‌కు రూ.5వేలు, ఇంధనం ఖర్చులకు రూ.3 వేలు, బ్యాంక్ ఈఎంఐ రూ.3వేలు చొప్పున ప్రతినెలా రూ.21వేలు చెల్లించారు.

దొనకొండ మండలంలో 18 గ్రామ పంచాయతీల్లో మొత్తం 28 రేషన్‌షాపులు ఉన్నాయి. ఇందులో 14,335 మంది కార్డుదారులు ఉన్నారు. వీరికి ప్రతినెలా రేషన్ పంపిణీ నిమిత్తం పది ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు) రేషన్ వాహనాలను ఏర్పాటుచేశారు. దీంతో గ్రామాల్లో ఎప్పుడు వస్తుందో తెలియని ఎండీయూ వాహనం కోసం పనులు మానుకొని ప్రజలు ఎదురు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇకపై రోజువారీ పనులు చేసుకుంటూనే వీలున్న సమయంలో ఒకటో తేదీ నుంచి 15లోగా ఎప్పుడైనా రేషన్ షాపుల వద్దకు వెళ్లి సరుకులు తెచ్చుకునే వెసులుబాటును టీడీపీ కూటమి ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ డీలర్లు అందుబాటులో ఉండి కార్డుదారులకు సరుకులు పంపిణీ చేస్తారు. వృద్ధులు, దివ్యాంగులకు మాత్రం ప్రతినెలా 5వ తేదీలోగా ఇళ్ల వద్దనే సరుకులు పంపిణీ చేస్తారు.


ఒబ్బాపురంలో ఏర్పాటైన రేషన్‌షాపు

హైవోల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం

దొనకొండ, మే 30(ఆంధ్రజ్యోతి): హైవోల్టేజీతో శుక్రవారం తెల్లవారుజామున దొనకొండలోని ఒబ్బాపురంలో గృహోపకరణ వస్తువులు దగ్ధమయ్యాయి. అందిన వివరాల మేరకు.. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఒక్కసారిగా హైవోల్టేజీ రావడంతో పలు ఇళ్లలో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. సమాచారం తెలుసుకున్న విద్యుత్‌శాఖ సిబ్బంది హుటాహుటిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించారు.

యోగాతో మానసిక ప్రశాంతత

పామూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగాసనాలు చేయడం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని డాక్టర్ గద్దె ఏడుకొండలు సూచించారు. స్థానిక గ్రామ సచివాలయంలో యోగా ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం యోగాసనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, జీవీ అరవిందారెడ్డి, కేఎల్ శ్రీనివాసరావు, జి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలి

పామూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రచారం చేపట్టాలని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కడపలో జరిగిన మహానాడు సభలో పామూరు మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం పంపిణీ చేయనున్న ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీలో కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, ఉపాధ్యక్షులు సయ్యద్ అమీర్‌బాబు, ఇర్రి కోటిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉప్పలపాటి హరిబాబు, వై .ప్రసాదరెడ్డి, పాలపర్తి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

పీసీపల్లి, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రతినెలా ఒకటో తేదీన పంపిణీ చేస్తున్న పింఛన్లను ఒకరోజు ముందుగానే శనివారం పంపిణీ చేస్తున్నట్టు ఎంపీడీవో ప్రభాకరశర్మ తెలిపారు. శుక్రవారం బ్యాంకుల నుంచి సచివాలయాల ఉద్యోగులు నగదును డ్రా చేశారని పేర్కొన్నారు. మండలంలో 4,679మందికి రూ.2.88 కోట్లు పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో తెలిపారు.

దర్శిలో బాలోత్సవాలు

దర్శి, మే 30(ఆంధ్రజ్యోతి): చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దర్శి పట్టణంలో బాలోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. 15 సంవత్సరాలలోపు బాలబాలికలకు ఈఉత్సవాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు నిర్వహిస్తారు. ఈసందర్భంగా సుందరయ్య భవన్‌లో బాలబాలికలకు వినోద కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు కె.రమాదేవి, సీహెచ్ వినోద్, నాగ స్రవంతి, యు.మోహన్‌రావు పాల్గొన్నారు.

నీటిని అక్రమంగా వదిలితే చర్యలు

పామూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): చేపలు పట్టుకొనేందుకు ముందస్తు సమాచారం లేకుండా అక్రమంగా నీటిని బయటకు వదిలి వృథా చేస్తే కేసులు నమోదు చేస్తామని ఇరిగేషన్ ఏఈ ప్రసాద్ హెచ్చరించారు. చేపల పెంపకందారులు చేపలు పట్టుకొనేందుకు అక్రమంగా నీటిని వదులుతున్నారనే సమాచారంతో పామూరు పట్టణంలోని కొత్త చెరువు నీటి సామర్థ్యాన్ని శుక్రవారం పరిశీలించారు.


బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఉగ్ర

5 నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

పామూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలో చారిత్రాత్మక ప్రాధాన్యత కలిగిన రుక్మిణి సత్యభామ సమేత శ్రీమదన వేణుగోపాలస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం కనిగిరిలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆవిష్కరించారు. జూన్ 5 నుంచి 13 వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో ఉభయదాతలు, గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఉగ్ర పిలుపునిచ్చారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఏర్పాట్లను ఈవో నరసింహబాబు ఎమ్మెల్యేకు వివరించారు. ఉగ్రను కలిసిన వారిలో దేవస్థాన ప్రధానఅర్చకులు నారాయణం సత్యబాబు, నారాయణ ఉన్నారు.

902 సీసీఆర్‌సీ కార్డుల మంజూరే లక్ష్యం

దొనకొండ, మే 30(ఆంధ్రజ్యోతి): దొనకొండ మండలంలో కౌలు రైతులకు 902 సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వాలనే లక్ష్యాన్ని జిల్లా ఉన్నతాధికారులు నిర్దేశించినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో కౌలు రైతు పత్రాల మంజూరుపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భూమి కౌలుకు తీసుకున్న రైతు పంటమీద మాత్రమే హక్కు కల్గిఉంటారన్నారు. భూమిమీద ఎటువంటి హక్కు ఉండదన్నారు. మండలంలో పొలాలను కౌలుకు తీసుకొని సాగు చేస్తుంటే తప్పకుండా కౌలుకార్డు పొందాలన్నారు. దరఖాస్తు చేసిన మూడు రోజుల్లో కార్డు మంజూరు చేస్తామని చెప్పారు. వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మండలంలోని కౌలు రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

నిబంధనలను తప్పక పాటించాలి

పామూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలను తప్పక పాటించాలని తహసీల్దార్ బీవీ రమణారావు సూచించారు. పట్టణంలోని శేషమహల్, శ్రీనివాసా కేబీ థియేటర్లను శుక్రవారం పరిశీలించారు. ఎమ్మార్పీ రేట్లకే తినుబండారాలను అమ్మాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మండలంలోని బొట్లగూడూరులోని పెట్రోల్ బంకును తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. పట్టణంలోని పలు రేషన్‌షాపుల్లో ఉన్న సరుకులను పరిశీలించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్, సీఎస్‌పురం రోడ్డులోగల వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు.

టీబీ రహిత గ్రామాలుగా కోవిలంపాడు, అరివేముల


జేసీ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ ఖాదర్‌బి

సీఎస్‌పురం (పామూరు), మే 30 (ఆంధ్ర జ్యోతి): జిల్లా వైద్యాధికారులు చేపట్టిన సర్వేలో సీఎస్‌పురం మండలంలోని కోవిలంపాడు, అరివేముల గ్రామ పంచాయతీల్లో ఎటువంటి టీబీ కేసులు నమోదుకాలేదు. దీంతో టీబీరహిత గ్రామాలుగా ప్రభుత్వం గుర్తించింది. శుక్రవారం ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో కోవిలంపాడు సర్పంచ్ షేక్ ఖాదర్‌బి, అరివేముల సర్పంచ్ సన్నపురెడ్డి రాధా రుక్మిణమ్మలను జేసీ గోపాలకృష్ణ టీబీ ముక్తభారత్ అభియాన్ అవార్డుతో సత్కరించారు.

ఉత్తమ పంచాయతీలకు అవార్డులు


జేసీ గోపాలకృష్ణ చేతుల మీదుగా మెమొంటో అందుకుంటున్న భీమవరం సర్పంచ్ సుజాత

ముండ్లమూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నలుగురు సర్పంచ్‌లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా శుక్రవారం ఒంగోలులో ఉత్తమ సర్పంచ్‌లుగా అవార్డులు అందుకున్నారు. టీబీ విముక్తి పంచాయతీల కార్యక్రమంలో మండలంలోని భీమవరం సర్పంచ్ అనమనమూరి సుజాత, ఈదర సర్పంచ్ వంగల పద్మావతి, బొప్పూడివారిపాలెం సర్పంచ్ అంజమ్మ, నాయుడుపాలెం సర్పంచ్ గొర్రె శ్రీదేవిలు ఇటీవల వైద్య ఆరోగ్యశాఖ పరంగా చేపట్టిన టీబీ సర్వే, విష జ్వరాలు సోకినప్పుడు పారిశుద్ధ్యం మెరుగుదలకు కృషి చేసినందుకు ఉత్తమ సర్పంచ్‌లుగా ఎంపిక చేస్తూ ప్రశంసాపత్రంతో మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి శ్రీవాణి, మధు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పొదుపుపై అవగాహన కార్యక్రమం

పామూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఆర్థిక లక్ష్యాలను సాధించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎంపీఎస్ పార్వతి తెలిపారు. శుక్రవారం మండలంలోని మార్కొండాపురం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం, వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండేవరకు బాలికలకు వివాహం చేయరాదని గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. డ్వాక్రా లీడర్ సౌందర్య, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి

ముండ్లమూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెట్రోల్ బంకు నిర్వాహకులు మెరుగైన సేవలు అందించాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీ నారాయణ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండ లంలోని శంకరాపురం, ముండ్లమూరు, పెదఉల్లగల్లులో పెట్రోల్ బంకులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏమైనా ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముం డ్లమూరులో గ్యాస్ గోడాన్ని, కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, వీఆర్వోలు పాల్గొన్నారు.

మూడు ఉన్నత పాఠశాలలకు హెచ్‌ఎంల నియామకం

ముండ్లమూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల నియామకం జరిగినట్టు ఎంఈవో ఎస్.సుబ్బారావు తెలిపారు. ఈదరకు నూనె వెంకట సుబ్బయ్య, పూరిమెట్లకు రంగనాయకులు, ఉమామహేశ్వర అగ్రహారం ఉన్నత పాఠశాలకు బి.మాధవిని నియమించారు. జూన్ ఒకటో తేదీన ఆయా పాఠశాలల్లో వారు బాధ్యతలు స్వీకరించనున్నట్టు తెలిపారు.

రైతుల అభ్యున్నతికి కృషి

ముండ్లమూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): రైతులు అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కేవీకే నోడల్ అధికారి మానస అన్నారు. శుక్రవారం మండలంలోని పోలవరం, శంకరాపురం గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భూసార పరీక్షలను ఖరీఫ్ సాగుకు ముందే చేయించు కోవాలన్నారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలమురళీధర్ నాయక్ మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యే రైతులు ముందుగా దుక్కులు చేపట్టాలన్నారు. ఏడీఏ బాలాజీనాయక్, ఉద్యాన అధికారి రవి వెంకన్నబాబు కూడా మాట్లాడారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫరూక్, పోలవరం సర్పంచ్ లీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పాపిరెడ్డిపల్లిలో పట్టపగలు చోరీ

వెలిగండ్ల, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డిపల్లి గ్రామంలో పట్టపగలు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో బీరువా తాళం పగులకొట్టి బంగారు ఆభరణాలు అపహరించారు. బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కామిరెడ్డి సుబ్బారెడ్డి శుక్రవారం ఉదయం 7గంటలకు ఇంటికి తాళంవేసి భార్యతో కలిసి ఉపాధి పనికి వెళ్లారు. తిరిగి 9గంటల సమయంలో ఇంటికి రాగా వెనుకవైపు ఉన్న తలుపు తాళం తీసి ఉంది. బీరువాలో వస్తువులు, దుస్తులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. రూ.2 లక్షల విలువైన ఆభరణాలు అపహరణకు గురయ్యాయని సుబ్బారెడ్డి తెలిపారు. బాధితుడి ఫిర్యాదుమేరకు ఎస్ఐ కృష్ణపావని కేసు నమోదు చేసుకుని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, వేలిముద్రల బృందాన్ని రప్పించి ఆధారాలు సేకరించారు.

భక్తిశ్రద్ధలతో సీతారామకల్యాణం

పామూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీనరసాపురం గ్రామంలోని శ్రీకోదండ రామస్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రీసీతారామ కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎంపీటీసీ బొల్లా నరసింహారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి వార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మన్నెపల్లి విజయశేఖర్, బైరెడ్డి జయరామిరెడ్డి, బొయిళ్ల నారాయణరెడ్డి, కె.రామిరెడ్డి, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, ఇర్రి కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరులో భారీ వర్షం

ముండ్లమూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గాలులతో పాటు భారీ వర్షం కురిసింది. శుక్రవారం సాయంత్రం ముండ్లమూరు, పసుపుగల్లు, పెదఉల్లగల్లు, నాయుడుపాలెం, అగ్రహారం, పూరిమెట్ల, ఈదర, భీమవరం గ్రామాల్లో భారీ వర్షం కురిసింది.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

దొనకొండ, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వద్దిపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త శ్రీరామ్ గాలయ్య(45) శుక్రవారం మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు తాడి నారాయణరెడ్డి గాలయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్యపడోద్దు, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు.



ఉష్ణోగ్రత (అంచనా)

31-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	37	28
తెనాలి	36	28
నరసరావుపేట	38	28
బాపట్ల	37	28
రెంటచింతల	40	29
చీరాల	37	28



- మధ్యాహ్న భోజనంలో మార్పులు
- సంక్షేమ హాస్టళ్లలోనూ పంపిణీకి ఏర్పాట్లు
- పౌరసరఫరాల శాఖకు ఇండెంట్ పంపిన విద్యాశాఖ
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో పదివేల ఎంటీల సేకరణ
- బియ్యం పక్కదారి పట్టకుండా నేరుగా కళాశాలలు, పాఠశాలలకే పంపిణీ

సన్నబియ్యంతో భోజనం

గుంటూరు(విద్య), మే 30 (ఆంధ్రజ్యోతి): దొడ్డ బియ్యంతో మధ్యాహ్న భోజనం తినలేక విద్యార్థులు ఇంతకాలం అల్లాడిపోయారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేస్తున్నా.. చాలామంది ఇళ్ల నుంచి క్యారేజిలు తెచ్చుకుంటున్నారు. కూటమి ప్రభుత్వ పరిశీలనలో సన్నబియ్యంతో అయితే భోజనం చేస్తామని విద్యార్థులు చెప్పారు. దీంతో రానున్న విద్యా సంవత్సరం నుంచి మధ్యాహ్న భోజనంలో మార్పులు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ పరిస్థితుల్లో మధ్యాహ్న భోజన పథకానికి ఇక నుంచి (మిగతా 4వ పేజీలో)



జల్‌జీవన్..జాగు

- గ్రామీణులకు అందని స్వచ్ఛజలం
- అట్టడుగున పల్నాడు, బాపట్ల జిల్లాలు
- నిధులున్నా పనుల నిర్వహణలో నిర్లక్ష్యం
- గడువుదాటి ఏడాదైనా అరకొరగానే పనులు
- మూడు జిల్లాల్లో 54 గ్రామాల్లోనే నూరుశాతం కుళాయిలు

2024 మార్చి కల్లా ప్రతీఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలి. గ్రామాల్లోని తాగునీటి పథకాలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి నూరుశాతం ఇళ్లకు కుళాయిల ద్వారా రక్షిత మంచినీటిని సరఫరా చేయాలి. పల్లెల్లో ప్రతి వ్యక్తికి 55 లీటర్లు నీరు ఇవ్వాలి.. అనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జల్‌జీవన్ మిషన్ పనుల్లో ఆరేళ్లుగా జాప్యం జరుగుతోంది. దీంతో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో కేంద్ర ప్రభుత్వం లక్ష్యం నీరుగారి పోయింది. ఇప్పటికీ పనులు నత్తనడక కన్నా నిదానంగా సాగుతున్నాయి. వందల సంఖ్యలో పనులకు టెండర్లు కూడా నిర్వహించలేదంటే పనులపై అధికారుల్లో ఏపాటి శ్రద్ధ కనిపిస్తోందో అర్థం చేసుకోవచ్చు. ఉన్న పథకాలను విస్తరించడంతో పాటు, పైపులైన్లు, నీటి నిల్వ చెరువుల అభివృద్ధి తదితర పనులు చేపట్టాల్సి ఉంది. ఎన్నికలకు ముందు ప్రతి ఇంటికి కుళాయి ద్వారా స్వచ్ఛజలం అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేసే దిశగా చర్యలు చేపట్టడంలో పాలకులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.





గండిగనుమల గ్రామంలో నీటి కోసం పాట్లు

కుళాయిలు ఇలా..

జిల్లా	మొత్తం గృహాలు	కుళాయిలున్నవి	లేనివి	శాతం
పల్నాడు	4,34,399	1,54,243	2,80,156	35.51
గుంటూరు	2,33,883	1,58,407	75,476	67.73
బాపట్ల	3,64,788	1,48,980	2,16,808	40.67
మొత్తం	10,33,070	4,61,630	5,72,440	44.68

44.68 శాతమే పూర్తి

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 10,33,070 గృహాలు ఉండగా ఇప్పటి వరకు 4,61,630 గృహాలకు మాత్రమే కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతున్నది. అంటే 44.68 శాతం గృహాలకు మాత్రమే కుళాయిలు ఉన్నా అవి నామమాత్రంగానే ఉన్నాయి. ఇంకా 5,72,440 గృహాలకు కుళాయి కనెక్షన్ ఇవ్వాలి. ఈ పథకం ప్రారంభం నుంచి ఇప్పటికి గుంటూ రు, పల్నాడు, బాటప్ల జిల్లాలో 54 గ్రామాల్లో మాత్రమే నూరుశాతం ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వగలిగారు. తాగునీటి పథకాలు, చెరువుల అభివృద్ధి, పైపులైన్ల పునరుద్ధరణ, కుళాయి కనెక్షన్లు పనులు ఆరేళ్లుగా అరకొరగానే సాగుతున్నాయి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల్లో అశ్రద్ధ.. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. ఇంటింటికి రక్షిత నీటిని అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2019లో జల్‌జీవన్ మిషన్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. ఆరేళ్ల అవుతున్నా ఇప్పటికీ సగం ఇళ్లకు కూడా కుళాయిల కనెక్షన్లు ఇవ్వలేదు. ఉన్న తాగునీటి పథకాలను, చెరువులను అభివృద్ధి చేయలేదు. జలజీవన్ మిషన్ కింద తాగు నీటి పథకాల అభివృద్ధి నత్తనడకన సాగుతోంది. జలజీవన్ అమలులో పల్నాడు, బాపట్ల జిల్లాలు రాష్ట్రంలోనే అట్టడుగున నిలిచాయి. ప్రతి గ్రామంలో నూరుశాతం కుళాయిల ద్వారా నీరు సరఫరా చేసేందుకు రూ.1021.38 కోట్ల అంచనాతో పనులు చేపట్టినా గతంలో, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాల కారణంగా పనుల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. కేంద్రం తన వాటాలో సుమారు రూ.275 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించడంతో పనులు (మిగతా 4వ పేజీలో)

కార్యాలయాలన్నీ ఒకే ప్రాంగణంలో

అందుబాటులో 19 ఎకరాలు.. అధికారుల కసరత్తు


అద్దంకి, మే 30 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే ప్రాంగణంలో ఏర్పాటుకు కసరత్తు ప్రారంభమైంది. అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే ఒకే ప్రాంగణంలో డివిజన్ స్థాయి కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. గతంలో పెద్దఎత్తున ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నా అవి ప్రస్తుతం ఆక్రమణలకు గురై ఉన్నాయి. ప్రస్తుతం ఏ ప్రభుత్వ కార్యాలయం ఏర్పాటు చేయాలన్నా అందుబాటులో స్థలం లేని పరిస్థితి. రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడితే పలు అనుబంధ కార్యాలయాలు అద్దంకి వచ్చే



అద్దంకి సమీపంలో ఖాళీ గా ఉన్న ప్రభుత్వ భూమి

అవకాశం ఉంది. 100 పడకల ఆస్పత్రి మంజూరుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అద్దంకి నగరపంచాయతీగా మార్పు చేసినప్పుడు భవన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు కాగా సరిపడా స్థలం అందుబాటులో లేక ఇంకా నిర్మాణం చేపట్టలేదు. కార్యాలయాలన్నీ ఒకే దగ్గర ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉండే అవకాశం ఉందని, ఇందుకు కొండయ్య కుంట మాన్యం భూమిని పరిశీలించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం అద్దంకి-రేణింగవరం దారిలో చెరువుకొమ్ముపాలెం క్రాస్ రోడ్డు వెంబడి దేవదాయశాఖకు చెందిన సుమారు 19 ఎకరాల కొండయ్య కుంట మాన్యం భూమిని ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం కొనుగోలు చేసింది. అయితే అద్దంకి దూరంగా ఉన్న ఈ భూమి మధ్యలో వాగు ప్రవహిస్తుండటంతో ఇళ్ల స్థలాల పంపిణీ నిలిచిపోయింది. దీంతో కార్యాలయాలన్నీ ఈ ప్రాంగణంలో ఏర్పాటుకు అనువుగా ఉంటుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఇద్దరికి కరోనా





- తెనాలి, ఉండవల్లి కేసుల గుర్తింపు
- జీజీహెచ్‌లో ప్రత్యేక ఓపీ, ఐసోలేషన్ వార్డు
- సమృద్ధిగా ప్రాణవాయువు నిల్వలు సిద్ధం

గుంటూరు మెడికల్, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు కొవిడ్-19 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. తెనాలి, ఉండవల్లిలో ఇద్దరికి కరోనా సోకినట్లు గుంటూరు డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి శుక్రవారం ప్రకటించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రైవేటు వైద్యశాలల్లో కొవిడ్ కేసులు వెలుగు చూస్తున్న నేపథ్యంలో గుంటూరు ప్రభుత్వాస్పత్రి క్యాజువాల్టీ సమీపంలో ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేశారు. రోగుల నుంచి నేసల్ స్వాబ్స్ సేకరించి వ్యాధి నిర్ధారణ కోసం ర్యాపిడ్ కిట్ పరీక్షలు, ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేస్తున్నారు. కరోనా పాజిటివ్ కేసులు నమోదైతే, రోగుల చికిత్సల కోసం బీ క్లాస్ వార్డులో 15 పడకలతో ఐసోలేషన్ వార్డును కూడా ఏర్పాటు చేశారు. వార్డులో వెంటిలేటర్లతో పాటు ఆక్సిజన్ కాన్‌సంట్రేటర్లను సిద్ధం చేశారు. రాష్ట్రంలోనే అత్యధికంగా 30 వేల లీటర్ల నిల్వ సామర్థ్యం ఉన్న లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్లు జీజీహెచ్‌లో సిద్ధం చేశారు. పెద్ద సంఖ్యలో రోగులు చేరినా ప్రాణవాయువు అందించేందుకు సిద్ధమని జీజీహెచ్ (మిగతా 4వ పేజీలో)

జూన్.. చైల్డ్ డ్రైవ్ మాసం

కలెక్టర్ వెంకట మురళి

బాపట్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎన్ సీపీసీఆర్ సూచనల మేరకు జూన్‌లో చైల్డ్ డ్రైవ్ మాసంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. బాలకార్మిక నిర్మూలనపై అధికారులతో కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం జరిగిన సమీక్షలో ఆయన ప్రసంగించారు. బాలకార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. గ్రానైట్ క్వారీలు, రీచ్‌లు, ఫ్యాక్టరీలు, హేచరీలు, జీడిపప్పు, చేపలు, రొయ్యల ప్రాసెసింగ్ కేంద్రాల్లో తనిఖీలు చేసి బాల కార్మికులు ఉంటే కేసులు నమోదు చేయాలన్నారు. ఎక్కడైన బాలకార్మికులను గుర్తిస్తే 1098 టోల్ ఫ్రీనెంబర్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో లేబర్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటశివప్రసాద్, పిల్లల సంరక్షణాధికారి పురుషోత్తం, డీఎమ్‌హెచ్‌వో డాక్టర్ ఎస్. విజయమ్మ, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖాధికారి రాధామాధవి, తదితరులు పాల్గొన్నారు.

- దివ్యాంగులు, 65 సంవత్సరాలు నిండిన వృద్ధులకు డీలర్లు ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ సరుకులను అందించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 4.70 లక్షల కార్డుదారుల్లో వృద్ధులు, దివ్యాంగులు 67,800 మంది ఉన్నారన్నారు. దుకాణాల వద్దనే సరుకులు పంపిణీపై ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి ఈబీ విలియమ్స్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సూర్యలంకలో యోగా ప్రదర్శన

యోగాంధ్ర కార్యక్రమాలలో భాగంగా జిల్లాస్థాయి యోగాసనాల ప్రదర్శన సూర్యలంక నగర వనంలో శనివారం ఉదయం 6.30 నుంచి 7.30 వరకు జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

సౌర విద్యుత్.. సర్వే పూర్తి

- ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ రూఫ్ టాప్స్
- పీఎం సూర్యఘర్‌తో ఉచిత విద్యుత్, అదనంగా అద్దె



వేమూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్యఘర్ ద్వారా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సౌర విద్యుత్ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ క్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది గ్రామాల్లో సర్వే చేసి లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఎంపికైన వారి గృహాలపై సోలార్ రూఫ్ టాప్స్‌ను ఏర్పాటు చేస్తారు. తద్వారా ఆయా గృహాలకు సోలార్ విద్యుత్‌ను ఉచితంగా వినియోగించుకుని మిగిలిన విద్యుత్‌ను ట్రాన్స్‌కో కొనుగోలు చేయనున్నది. యూనిట్‌కు రూ.2.10 చొప్పున, అలాగే సోలార్ ప్యానళ్ల ఏర్పాటు చేసిన స్థలానికి ప్రతి అడుగుకు నెలకు రూపాయి చొప్పున అద్దె కూడా చెల్లించనుంది. 200 యూనిట్ల కన్నా తక్కువ విద్యుత్ వాడే వారికి ఈ సౌకర్యాన్ని కల్పించనుంది. రూ.1,40,000 విలువ కలిగిన రెండు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రూ.60 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.80 వేలు కేటాయించింది. ఈ క్రమంలో వేమూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలోని 89 గ్రామాల్లో సర్వే చేసిన విద్యుత్ సిబ్బంది 20 వేల 985 మంది లబ్ధిదారులను గుర్తించారు. ఇందుకు సంబంధించి నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. మరో 5104 మంది లబ్ధిదారులు అర్హత కలిగి ఉన్నా వారిలో కొందరు ఇతర గ్రామాలలో నివసిస్తున్నారన్నారు.

నేడే పింఛన్లు

ఒకరోజు ముందు పంపిణీకి ఏర్పాట్లు ● మూడు జిల్లాలకు రూ.321.89 కోట్లు విడుదల

బాపట్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ ఈసారి ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు అందనుంది. జూన్ 1 ఆదివారం. దీంతో శనివారం మే 31న పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తొలి నెలలోనే రూ.వెయ్యి పెంచి రూ.4 వేల చొప్పున పింఛను ఇస్తుంది. పైగా ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెలా ఒకటో తేదీ, ఆ రోజు సెలవు అయితే ముందు రోజే సచివా లయాల సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వచ్చి పంపిణీ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వం ఒకరోజు ముందుగానే పింఛను అందజేసింది. కిందటేడాది సెప్టెంబరు, డిసెంబరు నెలల్లో ఒకటో తేదీ ఆదివారం, జనవరి 1 సెలవు కావడంతో ముందురోజే లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ క్రమంలో ఈ నెలలోనూ ఒకరోజు ముందే పింఛన్ల పంపిణీ చేయ నున్నారు. గుంటూరు జిల్లాలో 2,51,280 మంది పింఛనుదారు లకు సంబంధించి రూ.109.02 కోట్లు, పల్నాడు జిల్లాలో 2,70,234 మందికి రూ.117.87 కోట్లు, బాపట్ల జిల్లాలో 2,25,787 మందికి రూ.95 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఆ నగదును ఇప్పటికే సచివాలయ సిబ్బంది డ్రా చేసుకుని పంపిణీకి సిద్ధం చేసుకున్నారు. శనివారం తెల్లవారుజామునే లబ్ధిదారులను స్వయంగా కలిసి ఇవ్వనున్నారు.

వితంతవులకు కొత్తగా..

పింఛన్ పొందుతూ 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్యకాలంలో భర్త మరణిస్తే వారి భార్యకు పింఛన్ మం జూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు స్పౌజ్ కోటాలో దరఖాస్తులు స్వీకరించి ఎంపిక చేసి వారికి పింఛను అం దజేసేందుకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ కోటాలో గుం టూరు జిల్లాలో 2,565, పల్నాడు జిల్లాలో 3,094, బాపట్ల జిల్లాలో 2715 మందికి పింఛను అర్హత లభించింది. వీరికి ఈ నెల 12న పింఛను అందించనున్నారు. గత ఏడాది పింఛనును రూ.1000 పెంచి ప్రారంభించిన రోజు కావడంతో కొత్తగా పింఛను పొందిన వారికి కూడా ఆ రోజు నుంచి ఇవ్వాని ప్రభుత్వం నిర్ణయించింది.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- హోటళ్ల నిర్వాహకులతో ఫుడ్ సెఫ్టీ జిల్లా అధికారి



బిర్యానీని పరిశీలిస్తున్న అధికారి దేవరాజు

బాపట్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఫుడ్ సెఫ్టీ జిల్లా అధికారి కె.దేవరాజు హోటళ్ల నిర్వాహకులను హెచ్చరించారు. పట్టణంలోని సూర్యలంకరోడ్డులో హోటళ్లు, రెస్టారెంట్లలో శుక్రవారం సిబ్బందితో కలిసి ఆయన తనిఖీలు చేశారు. ఆహార పదార్థాలు, బిర్యానీ తయారీకి వినియోగించిన చికెన్, ఆయిల్‌ను నాణ్యతలను పరిశీలించారు. వంట తయారీ, సరుకులు నిల్వ ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించి నోటీసులు జారీ చేశారు. ఆయా శాంపిల్స్‌ను పరీక్షలు నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. వచ్చే నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది అనీల్, తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

ఇద్దరు వ్యక్తుల మధ్య కొట్లాట

• ఒకరికి గాయాలు

మార్టూరు, మే30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిమ్మిరిబండ గ్రామంలో దుడ్డు ప్రసన్నబాబు, దుడ్డు నాగరాజు అనే ఇద్దరు వ్యక్తుల మధ్య శుక్రవారం కొట్లాట జరిగింది. దీంతో గాయపడిన ప్రసన్నబాబును కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. వీరి మధ్య గొడవకు కారణాలు తెలియలేదు.

ఇంటి విషయంలో వివాదం

• రాయి విసరడంతో వృద్ధుడికి గాయాలు

అద్దంకి, మే30 (ఆంధ్రజ్యోతి): ఇంటి వివాదం విషయంలో వ్యక్తిపై రాయితో దాడి చేయడంతో మరో వ్యక్తి గాయపడిన ఘటన అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంలో చోటుచేసుకొంది. అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంలో కోటిరెడ్డి సుమారు దశాబ్దకాలం క్రితం దొడ్డపాటి అశోక్, జగపతిల నుంచి ఇళ్లు కొనుగోలు చేశాడు. అయితే ఇంటిలో తనకు వాటా ఉందని అశోక్, జగపతిల సోదరితో వివాదం కొనసాగుతుంది. దీంతో ఇటీవల గాలులకు ఇంటికప్పు రేకులు లేచిపోయాయి. గురువారం కోటిరెడ్డి పైకెక్కి సరిచేస్తున్నాడు. దీంతో అశోక్, జగపతిల సోదరి భర్త అచ్యుతరావు వెళ్లి కోటిరెడ్డిని కిందకు దిగమని కోరాడు. దిగకపోవటంతో రాయి విసిరాడు. దీంతో కోటిరెడ్డికి గాయాలయ్యాయి. వైద్యశాలలో చికిత్స పొందుతున్న కోటిరెడ్డి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు : తహసీల్దార్


దుకాణాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్

పంగులూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వ హించనున్న రేషన్‌పంపిణీలో ఎలాంటి అవత వకలు జరిగినా కఠిన చర్యలుంటా యని తహసీల్దార్ సింగారావు హెచ్చరించారు. జూన్ ఒకటి నుండి రేషన్ దుకాణాల నుంచి కార్డుదారులకు నేరుగా రేషన్ పంపిణీ జరుగుతుందన్నారు. శుక్రవారం తహసీల్దార్ సింగారావు, ఆర్ఐ శ్వేతలు పలు రేషన్‌దుకాణాల తనిఖీ నిర్వహించారు. లబ్ధిదారులను గుర్తించే ఈ పాస్ మిషన్ల పరిశీలనతో పాటు, నేమ్ బోర్డులు, స్టాక్ నమోదు బోర్డుల ఏర్పాటును తనిఖీ చేశారు. మండలంలోని 21 గ్రామ పంచాయితీల పరిధిలో 14,896 కుటుంబాలు తెల్లరేషన్ కార్డులు కలిగి ఉన్నారన్నారు. 34 రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు రేషన్ అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతి నెల ఒకటవ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్ణీత సమ యాలలో రేషన్ అందచేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలి

• పర్చూరులో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై మాల్యాద్రి

పర్చూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకొని ముందుకు సాగాలని ఎస్సై మాల్యాద్రి అన్నారు. పర్చూరు వైజంక్షన్ సమీపంలోని ఎరీనా క్రికెట్ క్రీడాప్రాంగణంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు శుక్రవారం ఎస్సై రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యతోపాటు, క్రీడల్లో కూడా ప్రతిభను కనపిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. అనంతరం టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో తులసి శ్రీనివాసరావు, ఇనగంటి నాగూర్, తోటా మణి, పఠాన్ సమీర్, తులసి రాజేష్, కొసనా రమేస్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల పరిశీలన

స్వర్ణ(పర్చూరు), మే 30 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో తహసీల్దార్ నాగరాజు ఆధ్వర్యంలో అధికారులు రేషన్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ నెల 1 నుంచి రేషన్ దుకాణాల్లోనే సరుకులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రతి రేషన్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. అక్రమాలకు పాల్పడిన రేషన్ దుకాణదారులపై చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ లావాదేవీలపై అప్రమత్తం

• డీఎస్పీ ఎండీ మొయిన్

విజయనగర్‌కాలనీ(చీరాల), మే 30 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు పట్ల జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ ఎండీ మొయిన్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి మండల పరిధిలోని విజయనగర్ కాలనీలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అందరూ స్నేహభావంతో మెలగాలని, ప్రశాంత వాతావరణం ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగంలో జాగ్రత్తలు పటించాలని సూచించారు. డీఎస్పీ వెంట సీఐ నాగభూషణం తదితర సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

• ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు


ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

కారంచేడు (పర్చూరు), మే 30 (ఆంధ్రజ్యోతి) : జూన్ 5న కారంచేడు ప్రైమరీ హెల్త్ సెంటర్ నందు జరిగే రాష్ట్రస్థాయి 3వ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని బాపట్ల జిల్లా ఉద్యోగుల సంఘం కార్యదర్శి పసుమర్తి శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం స్థానిక ప్రైమరీ హెల్త్ సెంటర్ ప్రాంగణంలో కౌన్సిల్ సమావేశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షన్ దారులు అందరూ కలసి కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సుబ్బారావు, ఆంజనేయులు, ఫార్మసిస్ట్ పోసాని మాధవి, సుజాత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ నిధులతో అభివృద్ధికి బాటలు

• జిల్లాపరిషత్ నుంచి రూ.93.50 లక్షలు విడుదల • ఫలించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషి

పర్చూరు, చినగంజాం, మే 30(ఆంధ్రజ్యోతి) : పర్చూరు నియోజకవర్గ అభివృద్ధికి జిల్లా పరిషత్ జనరల్ ఫండ్ నుంచి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు విడుదల అయ్యాయి. రూ.93.50 లక్షలు విడుదల చేస్తూ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఉత్తర్వులు జారీ చేశారు.నియోజకవర్గంలో 19 పనులకు రూపాయిల నిధులు మంజూరు చేశారు. నిధుల కోసం ఎమ్మెల్యే చేసిన కృషి ఫలించింది.


చింతగుంపల్లె ఎస్సీ శ్మశాన వాటిక

ప్రధానంగా గ్రామాల్లోని హిందూ, ముస్లిం, ఎస్సీ స్మశాన వాటికలు, గ్రామీణ ప్రాంతాల్లో లింకురోడ్లు శ్మశానాల ప్రహరీ నిర్మాణాలు, మంచినీటి వసతికి నిధులు విడుదల చేశారు. మార్టూరు మండలం వలపర్ల గ్రామంలో హిందూ శ్మశాన వాటిక నిర్మాణానికి రూ.10 లక్షలు, మార్టూరు గ్రామంలోని బండి నాగేశ్వరరావు కాలనీలోని ఎస్సీ శ్మశాన వాటికకు రూ.10 లక్షలు, యద్దనపూడి గ్రామంలో పెంట్యాల వెంకటేశ్వర్లు ఇంటి నుంచి సైదులు ఇంటి వరకు రూ.5 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. యద్దనపూడి మండలంలో గన్నవరంలో రమణాయ కుంట గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ఐదు లక్షల రూపాయిలు, పర్చూరు మండలం నాగులపాలెం ముస్లిం శ్మశానవాటిక ప్రహరిగోడ నిర్మాణానికి రూ.10 లక్షలు, గొల్లపూడి గ్రామంలో ఎస్టీ కాలనీ మంచినీటి వసతికి రూ.3 లక్షలు, ఉప్పుటూరు గ్రామంలో హోమియోపతి వైద్యశాల భవనం నిర్మాణానికి రూ.10 లక్షలు, ఇంకొల్లు మండలం పూసపాడు గ్రామంలో బాపినీడు కుంట గ్రావెల్ రోడ్డుకు రూ.4 లక్షలు, పూసపాడులోని ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి వయా తిమ్మిడతపాడు గ్రావెల్ రోడ్డుకు రూ.3.50లక్షల రూపాయిలు, పూసపాడులోని ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి స్వర్ణ కెనాల్ గ్రావెల్ రోడ్డుకు రూ.5 లక్షలు, చినగంజాం మండలం చింతగుంపల్లె గ్రామంలోని హిందూశ్మశాన వాటికకు రూ.5 లక్షలు, ఎస్సీ శ్మశాన వాటికకు రూ.5 లక్షల రూపాయలు, కడవకుదురు ఒంగోలు, చీరాల డొంక రోడ్డు గ్రావెల్ నిర్మాణానికి రూ.5 లక్షలు, కారంచేడు ముస్లిం శ్మశానవాటిక ప్రహరిగోడ నిర్మాణానికి రూ.10 లక్షలు, కారంచేడు కుంట డొంక రోడ్డు గ్రావెల్ నిర్మాణానికి రూ.5 లక్షలు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.


అభివృద్ధి చేయనున్న చింతగుంపల్లె హిందూశ్మశాన వాటిక

అభివృద్ధిపై ఎమ్మెల్యే దృష్టి

కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే ఏలూరి అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక దృష్టిసారించారు. ప్రభుత్వంలో మంత్రులతో తనకున్న పరిచయం, ప్రభుత్వ సహకారంతో అభివృద్ధికి నిధులు భారీగా తీసుకొస్తున్నారు. ప్రజా సంక్షేమం అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. ప్రస్తుతం జడ్పీ నిధుల మంజూరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అద్దంకి కొండవద్ద ఎట్టకేలకు చెత్త తొలగింపు


చెత్తను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

అద్దంకి,మే30(ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపాలిటీలో దశాబ్ద కాలంగా సేకరించిన చెత్తను అద్దంకి కొండ వద్ద టిడ్కో ఇళ్ల సమీపంలో గోతులలో పడవేశారు. దీంతో అటు వైపు వెళ్లాలంటేనే ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేరకుపోయిన చెత్త తొలగింపునకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా డ్రోన్‌తో సర్వే చేయగా 58 వేల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయినట్లు గుర్తించారు. చిలకలూరిపేట కు చెందిన తరుణి ఏజెన్సీ ద్వారా చెత్త తొలగించి శుభ్రం చేసే పనులు ప్రారంభించారు. అద్దంకి కొండ వద్ద ఉన్న చెత్తను ఎస్కవేటర్‌తో తిరగతోడుతున్నారు. చెత్త తిరగతోడిన తరువాత రసాయనాలు పిచికారి చేసి 15 రోజుల తరువాత ఎరువు తయారు అవుతుంది. కుళ్లి పోకుండా ఉన్న పదార్థాలను వేరు చేస్తారు. వీటిని గుంటూరులోని జిందా ల్ కు తరలిస్తారు. అక్టోబర్ 2వ తేది నాటికి చెత్త పేరుకు పోయిన సుమారు నాలుగైదు ఎకరాల ప్రాంతాన్ని శు భ్రం చేయాల్సి ఉంది. చెత్త తొలగించిన ప్రాంతంలో నగరవనం లేదా పార్కు ను అభివృద్ధి చేసే అవకాశం ఉంది. గతంలో పేరుకు పోయిన చెత్త తొలగింపు తో పాటు ప్రస్తుతం రోజువారి అద్దంకి పట్టణంలో సేకరిస్తున్న చెత్త ను ఎప్పటికప్పుడు గుంటూరు లోని జిందాల్ కు పంపుతున్నట్లు మున్సిపల్ కమీషనర్ రవీం ద్ర తెలిపారు.

ఇద్దరికి కరోనా

(3వ పేజీ తరువాయి)

వర్గాలు వెల్లడించాయి.

రోగులు మాస్కులు ధరించాలి..

దగ్గు, తుమ్ములతో బాధపడే వారు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని వైద్య వర్గాలు కోరాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొవిడ్-19 కేసులు ప్రబలుతున్న నేపథ్యంలో గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్సలకు వచ్చే వారు తప్పనిసరిగా మాస్కులు ధరించి రావాలని శుక్రవారం సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి సూచనలు చేశారు. జ్వరం, చలి, నీరసం, గొంతు మంట, ఒంటి నొప్పులు, నోరు చేదుగా ఉండ టం, వాసన తెలియకపోవడం, తలనొప్పి ముక్కు నుంచి నీరు కారడం వంటి లక్షణాలు కనిపిస్తే కొవిడ్ పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్యశాఖ సూచించింది. కొవిడ్ కేసులు ప్రబలిన దేశాల నుంచి ప్రయాణం చేసి వచ్చే వారు తప్పనిసరిగా కరోనా పరీక్షలు చేయించుకోవాలని తెలిపింది.

ఆందోళన అవసరం లేదు

కొవిడ్-19పై ప్రజలు ఆందోళన చెందవద్దు. ప్రస్తుతం సర్క్యులేట్‌లో ఉన్నది ఒమిక్రాన్ రూపంలో ఉన్న జేఎన్1 వేరియంట్. ఇది అంత ప్రమాదకారి కాదు. ఈ వేరియంట్ బారిన పడిన వృద్ధులు, ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమ స్యలు ఉన్న వారు ఆస్పత్రిలో చేరి చికిత్సలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నా, ఇతరులకు పెద్ద హాని కలిగించే శక్తి ఉండదు. అనుమానిత లక్షణాలతో వచ్చే రోగుల కోసం ప్రభుత్వాస్పత్రిలో ప్రత్యేక కొవిడ్ ఓపీ, 15 పడకలతో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేశాం.

డాక్టర్ రమణ యశస్వి, జీజీహెచ్ సూపరింటెండెంట్

సన్నబియ్యంతో భోజనం

(3వ పేజీ తరువాయి)

దొడ్డ బియ్యానికి బదులు సన్న బియ్యం పంపిణీకి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి జిల్లా నుంచి ఇందుకు అవసరమైన ఇండెంట్‌ను పాఠశాల విద్యాశాఖ పౌరసరఫరాల శాఖకు పంపింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ జడ్పీ మండల పరిషత్ ఎయిడెడ్ పాఠశాలలు దాదాపు 600కిపైగా ఉండగా 6.75 లక్షల మంది విద్యార్థులు ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నారు. బీసీ, గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లు మరో 100 కిపైగా ఉన్నాయి. ఆయా హాస్టళ్లలో దాదాపు 8 వేల మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. గత ఏడాది నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారు. పాఠశాల, కళాశాలల్లో మధ్యాహ్న భోజనానికి, వసతిగృహాల్లోని విద్యార్థులకు సన్నబియ్యాన్ని పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ధాన్యం సేకరించిన పౌరసరఫరాల శాఖ

ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు, వసతిగృహాలకు అవసరాల నిమిత్తం రాష్ట్రస్థాయిలో ధాన్యం సేకరించి జిల్లాల వారీగా పంపిణీకి పౌరసరఫరాల శాఖకు ఏర్పాట్లు చేసింది. సన్న బియ్యం పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ పరిస్థితుల్లో గోదాముల నుంచి డీలర్లకు పంపిణీ చేయకుండా నిర్దేశించిన పాఠశాలలకు, హాస్టళ్లకు నేరుగా సరఫరా చేయాలని నిర్ణయించింది. దాదాపు పదివేలకు పైగా మెట్రిక్ టన్నులు బియ్యం అవసరమని ప్రాథమిక అంచనా వేసినట్లు సమాచారం.

ప్రతి ఒక్కరూ భోజనం చేసేలా..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులందరూ భోజనం చేసేలా ఇప్పటికే మెనూలో మార్పులు తీసుకొచ్చారు. తాజాగా బియ్యం పంపిణీలో కూడా మార్పులు తీసుకు రానుండడంతో విద్యార్థులు ఎక్కువమంది భోజనం చేసే అవకాశం ఉంటుందని ప్రధానోపాధ్యాయులు చెప్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జల్‌జీవన్‌లో.. జాగు

(3వ పేజీ తరువాయి)

ఎక్కడిక్కడ నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల తాగునీటి పథకాల అభివృద్ధితో పాటు ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇవ్వడంలో విఫలమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఈ పథకం పనుల్లో పురోగతి కనిపించడంలేదు. నిధులున్నా పనులు ముందుకు సాగడంలేదు. దీంతో గ్రామాల్లో రక్షిత నీటి పథకాలు సక్రమంగా పనిచేయడంలేదు. దీంతో అపరిశుభ్రమైన, ఫ్లోరైడ్ ఉన్న నీటిని అనేక ప్రాంతాల్లో ప్రజలు వినియోగించుకోవాల్సి వస్తోంది. తద్వారా ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నా పాలకులు, అధికారుల్లో చలనం లేదు.

- జల్‌జీవన్ మిషన్‌లో రాష్ట్రంలోనే పల్నాడు జిల్లా అట్టడుగున 26వ స్థానంలో ఉంది. రూ.508.16 కోట్లు అంచనాతో 1055 పనులు చేపట్టగా 219 పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మూడో వంతు పనులు టెండర్ స్థాయి కూడా దాటలేదు. నిధుల విడుదలలో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసేందుకు ముందుకు రావడంలేదు. కేవలం 16 గ్రామాల్లోనే నూరు శాతం గృహాలకు కుళాయి కనెక్షన్ ఉన్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ వెల్లడించింది.
- బాపట్ల జిల్లా జలజీవన్ అమలులో రాష్ట్ర స్థాయిలో 25వ స్థానంలో ఉంది. జిల్లాలో 19.82 శాతం నుంచి 40.84 శాతానికి కుళాయిల సంఖ్య పెరిగింది. రూ.205.22 కోట్ల అంచనాతో చేపట్టిన 723 పనుల్లో 223 మాత్రమే పూర్తయ్యాయి. 10 గ్రామాల్లో మాత్రమే నూరు శాతం కుళాయిలు ఇచ్చారు.
- గుంటూరు జిల్లాలో జల్‌జీవన్ అమల్లోకి వచ్చిన అనంతరం 33,731 గృహాలకు కొత్తగా నీటి కుళాయిలు ఇచ్చారు. రాష్ట్రంలో జిల్లా 15వ స్థానంలో ఉంది. 308 పనులు చేపట్టగా 172 పూర్తయ్యాయి. 28 గ్రామాల్లో నూరు శాతం కుళాయిలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చర్యలు : సీఐ


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ శ్రీకాంత్‌బాబు

నాగులుప్పలపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి): అమ్మనబ్రోలులో ప్ర స్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చే సినా, వ్యవహరించినా చట్టపరమైన చర్యలు తప్పవని ఒంగోలు రూ రల్ సీఐ శ్రీకాంత్‌బాబు హెచ్చరించారు. అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన ముప్పవరపు వీరయ్యచౌదరి హత్యకేసులో నిందితుల్లో ఒకరైన వీరగంధం దేవేంద్రనాథ్‌చౌదరి వర్గీయులు రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారని వీ రయ్యచౌదరి వర్గీయుల ఫిర్యాదు మేరకు శుక్రవారం స్థానిక గ్రామ సచి వాలయం వద్ద ఇరువర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఒకరిపై ఒకరు దూషణలు, వ్యక్తిగత విమర్శలు, రెచ్చ గొట్టే వ్యాఖ్యలు చేసుకొంటూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచ ర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. శాంతియుతంగా, సంయమనంగా వ్యవహరించాలని హితవు పలికారు. ఇరువర్గాలకు చెందిన పలువురిని బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రజియాసుల్తానా పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ మంజూరుపత్రం అందజేత

కొండపి, మే 30 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతూ శస్త్ర చికిత్స చేయించుకున్న మండలంలోని గోగినేనివారిపాలెం గ్రామానికి చెం దిన బొడ్డపాటి శేషమ్మకు సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.80లక్షలు మంజూరైంది. అందుకు సంబంధించిన పత్రాన్ని ఒంగోలులోని తన కార్యాలయంలో ఎం పీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, శేషమ్మ కుమారుడు సురేష్‌కు శుక్రవారం అందజేశారు. టీడీపీ నాయకుడు బీఎల్.నరిసింహం పాల్గొన్నారు.

పీడీసీసీబీ చైర్మన్‌గా సీతారామయ్య నేడు బాధ్యతలు



ఆంధ్రజ్యోతి, ఒంగోలు

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (పీడీసీసీబీ) పర్సన్ ఇన్‌చార్జి (ఛైర్మన్)గా డాక్టర్ కామేపల్లి సీతారామయ్య శనివారం అధికారికంగా బాధ్యతలు తీసుకోనున్నారు. ఇటీవల పర్సన్ ఇన్‌చార్జిగా ఆయన పేరును టీడీపీ అధిష్ఠానం ఖరారు చేసిన విషయం విదితమే. ఆమేరకు ప్రభుత్వం అధికారికంగా గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం సహకార శాఖ అధికారుల నుంచి ప్రత్యేక ఉత్తర్వులు జిల్లాకు వచ్చాయి. దీంతో శనివారం బ్యాంకుకు వెళ్లి సీతారామయ్య బాధ్యతలు స్వీకరించనున్నారు. సింగిల్ విండోల్లో ముగ్గురు సభ్యులతో కమిటీలను నియమిస్తున్న ప్రభుత్వం సెంట్రల్ బ్యాంకుకు చైర్మన్‌తోపాటు ఆరుగురిని బోర్డు సభ్యులుగా నియమించాల్సి ఉంది. మిగిలిన సభ్యుల నియామకంపై తదుపరి ఉత్తర్వులు రానున్నాయి. ఆతర్వాత సీతారామయ్య... మంత్రులు, ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులను ఆహ్వానించి మరోసారి అట్టహాసంగా బాధ్యతలు స్వీకరించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

పండ్లతోటల పెంపకానికి సబ్సిడీ రుణం

ఒంగోలు(రూరల్),మే30 (ఆంధ్రజ్యోతి): పండ్లతోటలు పెంపకానికి వందశాతం సబ్సిడీతో రుణం అందిస్తున్న ఉద్యానశాఖ అధికారి డి.ప్రత్యూష అన్నారు. శుక్రవారం ఒంగోలులో జరిగిన సమావేశంలో ఆమె మా ట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్లతోటల పెంపకం చేపట్టా లని కోరారు. కార్యక్రమంలో ఏవో కిషోర్‌బాబు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల పరిశీలన


ఫీజ్‌బాక్స్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

ఒంగోలు క్రైం, మే 30(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని పలు చోట్ల ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక కమ్మపాలెంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల భద్రతను స్వయంగా పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అదేవిధంగా అక్కడ ఏర్పాటు చేసిన మీటర్లను తనిఖీలు చేపట్టారు. అదేసమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తు న్న పీఎం సూర్యఘర్ పథకం లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో డీఈ పాండురంగారావు, ఏఈ సంతోష్ పాల్గొన్నారు.

మహిళ మరింత దర్జాగా..!

ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం



- సూపర్ సిక్స్‌లో మరో హామీ అమలు దిశగా అడుగులు
- సీఎం ప్రకటనతో సర్వత్రా హర్షం
- జిల్లాలో 13 లక్షల మందికి లబ్ధి

ఒంగోలు, కార్పొరేషన్, మే 30 (ఆంధ్రజ్యోతి): నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోంది. ఇప్పటికే పింఛన్ల పెంపుపై తొలి సంతకం చేయగా, ఇటీవల ఉచిత సిలిండర్ల పంపిణీ పథకాన్ని అమలు చేసింది. తాజాగా కడపలో జరిగిన టీడీపీ మహానాడు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళలకు మరో శుభవార్త చెప్పారు. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలోని మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ప్రకటించారు. ఒకవైపు లోటు బడ్జెట్, ప్రభుత్వ ఖజానాపై భారం పడుతున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. జిల్లాలో సుమారు 26లక్షల మంది వరకు జనాభా ఉన్నారు. అందులో సగానికిపైగా మహిళలే ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఆ ప్రకారం 13లక్షల మంది మహిళలకు రాష్ట్రంలో ఎక్కడికైనా బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం లభించనుంది.

ఆర్టీసీపై ఆర్థిక భారం.. అయినా అమలు

ప్రకాశం రీజియన్‌లో ఒంగోలు, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, పొదిలి డిపోలు ఉన్నాయి. వాటి పరిధిలోని 866 గ్రామాలకు అనుసంధానంగా 20 బస్ స్టేషన్లు ఉన్నాయి. అలాగే 484 ఆర్టీసీ బస్సులు ఉండగా వాటిలో 95 అద్దె ప్రాతిపదికన (హయ్యర్) నడుస్తున్నాయి. ఈ బస్సులన్నీ రోజుకు 2లక్షల కిలోమీటర్లు ప్రయాణికుల కోసం రాకపోకలు సాగిస్తున్నాయి. అందులో 1.5లక్షల మంది ప్రయాణిస్తున్నారు. దీంతో రోజుకు రీజియన్‌కు రూ.77.51లక్షల ఆదాయం వస్తోంది. అందులో సగం మంది మహిళలు ఉన్నారు. వారికి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందించనుండటంతో రోజుకు రూ.38.50 లక్షల భారం ప్రభుత్వంపై పడనుంది.

అవీ..ఇవీ..

మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న కారు

దంపతులు, మనుమడికి గాయాలు



గాయపడ్డ నూతలపాటి శ్రీనివాసరావు, ఆదిలక్ష్మి

అద్దంకి,మే30(ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌ను కారు ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులకు గాయాలైన ఘటన మండలంలోని నామ్ రోడ్డుపై శుక్రవారం చోటుచేసుకొంది. మోదేపల్లికి చెందిన నూతలపాటి శ్రీనివాసరావు, దంపతులు శుక్రవారం మణికేశ్వరంలో ఉన్న గర్భవతి అయిన కోడలు వద్దకు వెళ్లారు. తిరిగి మోటార్‌సైకిల్ పై మనవడు లోహిత్ కుమార్‌ను తీసుకొని దంపతులు అద్దంకి వైపు వస్తున్నారు. నామ్ రోడ్డు లో కొంగపాడు క్రాస్ రోడ్డు సమీపంలో వెనుక నుంచి వస్తున్న కారు వీరి మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు, ఆదిలక్ష్మి దంపతులు, టమనుమడు లోహిత్‌కుమార్‌లు గాయపడ్డారు. వీరిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం లోహిత్‌కుమార్‌ను ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

కుట్టుమిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



కుట్టుమిషన్ శిక్షణను పరిశీలిస్తున్న ఎంపీడీవో కుసుమకుమారి

బల్లికురవ. మే 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మహిళలు స్వశక్తితో జీవనం సాగించేలా ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ అందిస్తోందని ఎంపీడీవో కుసుమకుమారి పేర్కొన్నారు. శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల కేంద్రం బల్లికురవలో రెండు బ్యాచ్‌లుగా జరుగుతున్న శిక్షణను ఎంపీడీవో శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా శిక్షణ తీసుకుంటున్న మహిళకు ఎంపీడీవో పలు సూచనలు చేశారు. కుట్టుమిషన్ క్రమశిక్షణతో నేర్చుకోవాలన్నారు. క్రమం తప్పకుండా మహిళలు హాజరుకావాలన్నారు. శిక్షణ అనంతరం బీసీ కార్పొరేషన్ ద్వారా ధ్రువీకరణపత్రం మిషన్ అందజేస్తామన్నారు. మూడు మాసాల పాటు శిక్షణ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

వాహన చోదకులకు లైసెన్స్‌లు తప్పనిసరి



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ నాగరాజు

బల్లికురవ. మే 30 (ఆంధ్రజ్యోతి) : లైసెన్స్‌లు లేకుండా ఎవరైన వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐ వై. నాగరాజు హెచ్చరించారు. శుక్రవారం బల్లికురవ సంతమాగులూరు రోడ్డులో ఎస్‌ఐ పలు వాహనాలను తనిఖీలు చేశారు. ఈసందర్భంగా లెసెన్స్‌లు లేకుండా వాహనాలను నడుపుతున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం పలువురికి అపరాధ రుసుము విధించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహనదారులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

గ్రామస్థుల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటు

బల్లికురవ. మే 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నుపల్లి గ్రామంలో గ్రామస్థుల సహకారంతో పోలీసు శాఖ ఐదు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించింది. గ్రామానికి నలువైపులా ఈ కెమెరాలను అమర్చారు. కొత్త వ్యక్తులు గ్రామంలోనికి వస్తే నిఘా ఉంచడానికి బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై నిఘా ఉంచేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని ఎస్సై నాగరాజు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు.



గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

నేడు అత్యవసర సర్వసభ్య సమావేశం

చినగంజాం, మే 30(ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 11గంటలకు అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి తెలిపారు. ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ నందు వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి జడ్పీటీసీ సభ్యురాలు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, గ్రామసర్పంచ్‌లు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

చిట్టడవులను తలపిస్తున్న పేదల కాలనీలు

● నాడు జగన్న కాలనీలు.. నేడు ఎన్‌టీఆర్ నగర్ ● పేరు మారినా మారని తలరాత ● కాలనీలలో మౌలిక వసతుల కరువు

అద్దంకి,మే30(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో పేదలకు ఇళ్ల పేరిట ఎంతో హడావుడి చేసినా, జగనన్న కాలనీలలో కనీస వసతులు కూడా లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జగనన్న కాలనీలను ఎన్‌టీఆర్ నగర్‌లుగా మార్పు చేశారు.



బొమ్మనంపాడురోడ్డులోని కాలనీలో అధ్వానంగా ఉన్న రహదారి

అయితే నేటికీ ఆ కాలనీల్లో మౌలిక వసతులు మాత్రం కల్పించలేదు. దీంతో పేరు మార్పు తప్పా మౌలిక వసతులు లేవని అక్కడి పేదలు వాపోతున్నారు.

అద్దంకి పట్టణంలో నాగులపాడు రోడ్డు, వేలమూరి పాడురోడ్డు, బొమ్మనంపాడురోడ్డులలో ఎన్‌టీఆర్‌నగర్‌లు ఉన్నాయి. బొమ్మనం పాడు రోడ్డులోని ఎన్‌టీఆర్ నగర్‌లో సుమారు వెయ్యి మందికి స్థలాలు కేటాయించారు. వీటిలో కేవలం పదుల సంఖ్యలోనే నివాసం ఉంటున్నారు. అద్దంకి పట్టణానికి సుమారు 4 కి.మీ దూరంలో ఉండటం ప్రధాన కారణం కాగా కాలనీలో సరైన నీటి వసతి లేకపోవడంతో ఇళ్ల నిర్మాణానికి సుముఖత చూపడం లేదు. అయినప్పటికీ, కొద్ది మంది నివాసం ఉంటున్నా చుట్టూ చుట్టూ చిట్టడవిని తలపించేలా చెట్లు పెరగడంతో వారు బిక్కు బిక్కుమంటూ కాలం వెల్లదీయాల్సిన పరిస్థితి ఉంది. ఇక నాగులపాడు రోడ్డులోని ఎన్‌టీఆర్‌నగర్‌లో సగం మందికి పైగా నివాసాలు ఉంటున్నప్పటికీ, అంతర్గత రోడ్లు మొత్తం చిల్లచెట్లతో నిండిపోయాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు పాముల సంచారం ఎక్కువగా ఉంటోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేలమూరి పాడు రోడ్డులోని ఎన్‌టీఆర్ నగర్‌లో అత్యధిక ప్లాట్లలో ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది. ఇక్కడ ప్రజలు నివసిస్తు న్నారు. అయినప్పటికీ, అంతర్గతంగా సైడ్‌డ్రైన్లు, రోడ్లు లేవు. దీంతో చినుకు పడితే ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రవీంద్రను వివరణ కోరగా, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అయిన వెంటనే మౌలిక వసతుల కల్పన చేపడతామన్నా రు. ముందుగా బొమ్మనంపాడు రోడ్డులోని ఎన్‌టీఆర్‌నగర్‌కు నీటివసతి కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం చిల్లచెట్ల తొలగింపునకు చర్యలు చేపడతామన్నారు.



నాగులపాడు రోడ్డులోని ఎన్‌టీఆర్ నగర్‌లో పెరిగిన తుమ్మచెట్లు

నల్లబర్లీ రైతులను ఆదుకోవాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పంగులూరు, మే 30(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం నల్లబర్లీ పొగాకు రైతుల కష్టాలు తీర్చేదిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. మండలంలోని జనకవరం గ్రామంలో శుక్రవారం నల్లబర్లీ కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంబద్ధ విధానాలతో వ్యవసాయం గాలిలో దీపంగా మారిందన్నారు. నల్లబర్లీ కొనుగోలు విషయంలో కంపెనీలు ప్రభుత్వ నిర్ణయాల ను పాటించే విధంగా కనిపించడంలేదన్నారు. వ్యవసాయం జూదంగా మారిందని, ఇందులో రైతులు పావులుగా మారుతున్నారని విమర్శించారు. నల్లబర్లీ పొగాకు సాగు చేసే విధంగా జీపీఐ ఐటీసీ కంపెనీలు రైతాంగాన్ని ప్రోత్సహించాయన్నారు. నేడు ఆ కంపెనీలు కంటికి కనిపించకుండా, పొగాకు కొనుగోలు చేయకుండా రైతాంగాన్ని మోసం చేస్తున్నాయన్నారు. గిట్టుబాటు ధర కల్పించి పంటను కొనుగోలు చేస్తే రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటారని ప్రశ్నించారు. మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేయిస్తామని చెప్పిన మాటలు ఆచరణకు నోచుకోవడం లేదన్నారు. కంపెనీలతో తక్షణమే నల్లబర్లీ పొగాకు కొను గోళ్లు చేయించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

రైతు కుటుంబానికి పరామర్శ

అప్పులబాధతో గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న యువరైతు తలపనేని శ్రీనాథ్ కుటుంబాన్ని పార్టీ నేతలతో కలసి పరామర్శించారు. బాధిత కుంటుబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీనాథ్ భార్యకు ఉపాధి చూపాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య, రైతుసంఘం కార్యదర్శి తలపనేని రామారావు, కౌలు రైతుసంఘం కార్యదర్శి వినోద్‌బాబు, కందిమళ్ల రామకోటేశ్వరరావు, మల్లారెడ్డి, తలపనేని సుబ్బారావు, రఘుచంద్, ఎడ్ల రవి, రామచంద్రరాజు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చినగంజాం, మే 30 ఆంధ్రజ్యోతి) : చినగంజాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కడవకుదురు గ్రామంలో శనివారం ఉదయం 8గంటల నుండి సాయంత్రం 3గంటల వరకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈఈ పి.గణనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తుండడంతో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యుత్ అంతరాయంపై కదిలిన అధికారులు

పంగులూరు, మే 30(ఆంధ్రజ్యోతి): రామకూరు గ్రామంలో ప్రతి అరగంటకు విద్యుత్ సరఫరాలో కలుగుతున్న అంతరాయంపై అధికారులు స్పందించారు. రామకూరు గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం పేరుతో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో వరపర్ల ఫీడర్‌లో శ్రీనివాస స్టోన్‌క్రషర్ వద్ద ఇన్సిలేటర్లలో లోపాన్ని గుర్తించిన అధికారులు సంబందిత సిబ్బందితో సమన్వయం చేసుకొని దిద్దుబాటు చర్యలు చేపట్టారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని తొలగించినట్లు ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు.

బస్సు నుంచి జారిపడి, మహిళకు గాయాలు

అద్దంకి,మే30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చక్రాయపాలెం వద్ద ఆర్టీసీ బస్సులో నుంచి జారిపడి మహిళకు గాయాలయ్యాయి. బాధితురాలి కథనం మేరకు బల్లికురవ మండలం కొత్తూరులోని అరుణగిరి తండాకు చెందిన మారుణీభాయ్ శుక్రవారం అద్దంకి నుంచి వి.కొప్పెరపాడుకు వెళ్లేందుకు బస్సుఎక్కింది. అయితే తాను బస్సు దిగే కొప్పెరపాడు వచ్చిందనే ఆలోచనతో చ క్రాయపాలెం వద్ద దిగేందుకు ప్రయత్నించి, క్రమంలో జారి కిందపడింది. గాయాలైన మారుణీబాయ్‌ను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



గాయపడ్డ మారుణీభాయ్

సర్వసభ్య సమావేశంలో ప్రగతి నివేదికల వెల్లడి

సంతమాగులూరు మే 29(ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ వై.ఎలమంద అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధశాఖల అధికారులు ప్రగతి నివేదకలు చదివి వినిపించారు. తహసీల్దార్ కే.రవిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేసిందన్నారు. దీంతో నిత్యవసర సరుకులను జూన్ నెల ఒకటవ తేదీ నుంచి రేషన్ డీలర్లు సరుకులను సరఫరా చేస్తారని వివరించారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి 8 గంటల వరకు డీలర్లు సరుకులను పంపిణీ చేస్తారన్నారు. 65 సంవత్సరాలు దాటిన వారికి, దివ్యాంగులకు ఇంటివద్దకే డీలర్లు సరుకులను సరఫరా చేస్తారన్నారు. నిత్యవసర సరుకులు సక్రమంగా పంపిణీ జరిగేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఏవో లావణ్య మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ మొదలైనందున రైతులకు పచ్చి రొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మొక్కజొన్న పైరుకు కనీస మద్దతు ధర ఉండడంతో ఈ ఏడాది రైతులు మొక్కజొన్న పైరు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. రైతులు ఆధీకృత డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. కౌలు రైతులందరూ కార్డులు పొందాలన్నారు. పీఆర్ ఏఈ నాగేశ్వరరావు మాట్లాడుతూ డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ కింద సీసీ రోడ్లు నిర్మించేందుకు మండలానికి రూ.1.60 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఎంపీడీవో జ్యోతిర్మయి మాట్లాడుతూ యోగాంధ్రలో భాగంగా విశాఖపట్నంలో ఐదు లక్షల మందితో యోగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీని కోసం మండలం నుంచి ఇప్పటికే 8500 మందిని రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు. సర్వసభ్య సమావేశానికి విద్యుత్, అటవీ, ఆర్టీసీ, రవాణాశాఖ అధికారులు హాజరు కాలేదు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు 85 అర్జీలు

చీరాల, మే 30 (ఆంధ్రజ్యోతి) : కొంతకాలంగా నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రజాదర్బార్‌కు అర్జీలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో టీడీపీ కూటమి నేతలు అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి ఆయనకు 85 అర్జీలు అందాయి. వీటిల్లో 21 పెన్షన్, నివేశన స్థలాలు 49, ఇతర సమస్యలు 15 ఉన్నాయి.

లేబర్‌కోడ్ రద్దుకు కార్మికుల డిమాండ్

పేరాల(చీరాల), మే 30 (ఆంధ్రజ్యోతి) : లేబర్‌కోడ్స్ వలన కార్మికులకు తీరని నష్టం జరుగుతుందని దీనిని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. ఎన్నోపోరాటాలతో సాధించుకున్న హక్కులను కేంద్రప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎం.వసంతరావు, ఎస్.బాబురావు, క్రాంతిసాగర్, యేసురత్నం, సింగయ్య, సురేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను విమర్శించడానికే మహానాడు

వైసీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున

చీరాల, మే 30 (ఆంధ్రజ్యోతి) : కడపలో టీడీపీ నిర్వహించిన మహానాడులో మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై విమర్శలు చేయడానికి మినహా ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, చీరాల నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్‌లు విమర్శించారు. శుక్రవారం నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. పొగాకు, మిర్చి, పత్తి, వరి తదితర పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ఒకవైపు రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే మరొక వైపు ముఖ్యమంత్రి మహానాడుతో సొంత ప్రచారం చేసుకొంటున్నారని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజల భవిష్యత్తు కోసం పాటుపడిందన్నారు. ఈ క్రమంలో వైసీపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు జూన్ 4న వెన్నుపోటు దినంగా భావించి నియోజకవర్గ కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ అధికారులకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు బొనిగల జైసన్‌బాబు, బత్తుల అనీల్, కంపా అరుణ్, చీమకుర్తి బాలకృష్ణ, గవిని శ్రీనివాసరావు, యాతం మేరీబాబు, డా.ఐ బాబురావు, వాసు, కావూరి రమణారెడ్డి, పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున

క్వాలిటీ కంట్రోల్ అధికారుల తనిఖీ



కాలువల నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

బల్లికురవ. మే 30 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం ద్వారా ఇటీవల గ్రామాలలో చేపట్టిన సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ల పనులను జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. బల్లికురవ. అంబడిపూడి, ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు, వెలమవారిపాలెం గ్రామాలలో రూ.90 లక్షల నిధులతో నిర్మించారు. సిమెంట్ రోడ్లు, మురికి కాలువల పనులను నాణ్యతపై యంత్రాల ద్వారా తనిఖీ చేశారు. నాణ్యత తక్కువ ఉంటే బిల్లుల చెల్లింపులు నిలిపి వేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. బల్లికురవ మండలంలో చేపట్టిన రోడ్లు నాణ్యతగా ఉన్నాయని వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీలలో క్వాలిటీ కంట్రోల్ ఈఈ ఎంవీ శ్యాంప్రసాద్, విజిలెన్స్ ఏఈ సీహెచ్ శ్రీనివాస్, స్థానిక ఏఈ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార, యానాదుల కుటుంబాలకు అండగా ఉంటా

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, మే 30 (ఆంధ్రజ్యోతి) : కడలని నమ్మి జీవనం సాగించే, మత్స్యకార యానాదుల కుటుంబాలకు అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం పరిధిలోని యానాదులకు సొసైటీ గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో సుమారు 8 మండలాల్లో యానాదులు వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నట్లు వివరించారు. అయితే వీరికి ఇంతవరకు ఎక్కడా కూడా సొసైటీ గుర్తింపుకార్డులు లేవని చెప్పారు. వారి జీవనమనుగడకు ప్రయోజన కరంగా ఉండేందుకు గుర్తింపు కార్డులు అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు తిరుమలశెట్టి శ్రీను, మాజీ ఎంపీపీ నాదెండ్ల కోటేశ్వరరావు, ఏసుదాసు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



గుర్తింపుకార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

యోగాసనాలతో మానసిక ప్రశాంతత

చీరాల, మే 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ యోగాసనాలు సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతతో పాటు ఆరోగ్యంగా జీవిస్తారని మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జూన్ 21 వరకు స్థానిక అంబేడ్కర్ భవనంలో ప్రతిరోజు ఉదయం 6:30 గంటల నుంచి గంట పాటు యోగా శిక్షణ నిర్వహిస్తున్నట్లు వివరించారు. సచివాలయ సిబ్బంది. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.



పంగులూరులో యోగాసనాలు వేస్తున్న అధికారులు

పంగులూరు : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగాను అభ్యసించాలని మండల ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ కృష్ణకుమార్ అన్నారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం అధికారులు, సిబ్బంది యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణకుమార్ సిబ్బందితో ఆసనాలు వేయించి ఒక్కో ఆసనంతో కలిగే ప్రయోజనాలను సిబ్బందికి వివరించారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడే యోగా ప్రతి వ్యక్తి జీవితంలో భాగం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపారాణి, కార్యాలయ ఏవో రమేష్, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డిమాండ్



ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

చీరాల, మే 30 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి పసుమర్తి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. జూన్ 5న ఛలోవిజయవాడ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలో ఇరిగేషన్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న 14 రకాల సమస్యలు పరిష్కరించాని కోరుతూ 3న విజయవాడలో కౌన్సిల్ సమావేశం జరుగుతుందన్నారు. అలాగే 5న జరిగే ఛలో విజయవాడను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక అధ్యక్షులు వినోద్, కార్యదర్శి శ్రీనివాసరావు తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.


లక్ష్యసాధనలో ప్రజలు భాగస్వామ్యం కావాలి

● ఎంపీడీవో స్వరూపారాణి



గ్రామసభలో స్వర్ణాంధ్ర లక్ష్యాలను వివరిస్తున్న ఎంపీడీవో స్వరూపారాణి

పంగులూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం నిర్దిష్ట ప్రణాళికతో చేపట్టిన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎంపీ డీవో స్వరూపారాణి అన్నారు. మండలంలోని జనకవరం, కశ్యాపురం, ముప్పవరం, జార్లమూడివారిపాలెం గ్రామాలలో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. గ్రామంలో సేకరించే తడి, పొడి చెత్త వేరుచేసే విధానం, పీఎం సూర్యఘర్ పథకం, ప్రయోజనాలు, యోగాంధ్ర కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పచ్ తలపనేని వీరమ్మ, దూళిపాళ్ల వెంకట్రావు, సాంబశివరావు, వెంకాయమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు గుర్రం కల్యాణి, ఏపీఎం జ్యోతి ప్రసాద్, కార్యదర్శి రాంబాబు, సునీత, జానీబేగం, మల్లికార్జు, సచివాయ సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.





కాటాను, ఈపాస్ యంత్రానికి ఆన్‌లైన్ అనుసంధానం చేస్తున్న తూ.కొ అధికారులు

ఇంకెన్నాళ్లు ఫ్రీహోల్డ్!


14,834 ఎకరాలకు నిబంధనలకు విరుద్ధంగా హక్కులు

- ఆ భూములపై విచారణ జరిగి ఆరు నెలలు
- వైసీపీ హయాంలో పేదల ముసుగులో పెద్దల దోపిడీ
- గ్రామసభలు లేకుండానే అసైన్‌మెంట్ భూముల ఫ్రీహోల్డ్
- భారీ అవినీతి బయటపడ్డా చర్యలు తీసుకోవడంలో జాప్యం

గత వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలు అన్నీ ఇన్నీకావు. ముఖ్యంగా భూముల విషయంలో అక్రమాలు తారస్థాయికి చేరాయి. భూ పంపిణీ మొదలు అసైన్‌మెంట్ భూములకు హక్కులు కల్పించడం (ఫ్రీహోల్డ్) వరకూ భారీ ఎత్తున తప్పులు జరిగాయి. పేదల ముసుగులో పెద్దలు దోపిడీకి పాల్పడ్డారు. ఒక్క నెల్లూరు జిల్లాలో దాదాపు 14,834 ఎకరాల భూమిని నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ చేసినట్లు తేలింది. ఇలా అక్రమాలు బయటపడి ఆరు నెలలు గడిచినా ఇంతవరకూ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కోసం రెవెన్యూ అధికారులు ఎదురుచూస్తున్నారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)





వైసీపీ ప్రభుత్వం ఫ్రీహోల్డ్ పేరుతో ఒక జీవోను తీసుకొచ్చింది. దీని ప్రకారం ఎవరైతే అసైన్‌మెంట్ పట్టాలు పొంది 20 ఏళ్లగా సాగు చేసుకుంటున్నారో.. అటువంటి వారికి ఆ అసైన్‌మెంట్ భూములపై పూర్తి హక్కులు కల్పిస్తారు. అలానే చుక్కల భూములకు కూడా ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించారు. ఇలా గత ప్రభుత్వంలో జిల్లాలో 98,785 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారు. అందులో అసైన్‌మెంట్ భూములు 55,447 ఎకరాలు ఉండగా, చుక్కల భూములు 43,271 ఎకరాలు ఉంది. మరో 67 ఎకరాలు ఈనాం భూములున్నాయి. నిబంధనల ప్రకారం ఫ్రీహోల్డ్ చేసే సమయంలో గ్రామ సభలు నిర్వహించాలి. అప్పుడే లబ్ధిపొందుతున్న వ్యక్తి అర్హుడా.. కాదా..? అన్నది తేలిపోతుంది. కానీ నిజమైన అసైన్‌మెంట్‌దారులు కాకపోయినా వేల మందికి ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించి పేదల భూములు కట్టబెట్టారు. ఈ అక్రమాలపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక విచారణకు ఆదేశించింది. గతేడాది సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలల్లో ఫ్రీహోల్డ్ భూములపై తహసీల్దార్ల స్థాయిలో క్షేత్రస్థాయి విచారణ జరిగింది. ఈ సందర్భంగా 14,834 ఎకరాల భూమిని నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ చేసి అనర్హులకు దోచిపెట్టినట్లు తేలింది. ఇందులో అసైన్‌మెంట్ భూములు 14,553 ఎకరాలు, చుక్కల భూములు 281 ఎకరాలు ఉన్నాయి. ఈ వివరాలన్నిటినీ కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందజేశారు. అనంతరం అన్ని వివరాలను ఆన్‌లైన్ చేశారు.

నిజమైన అర్హులకు అన్యాయం

ఇంత భారీస్థాయిలో ప్రభుత్వ భూములను అనర్హులకు కట్టబెడుతూ ఫ్రీహోల్డ్ కల్పించడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ప్రక్రియలో భాగమైనా నాటి రెవెన్యూ అధికారులు అవినీతిలో కీలకంగా వ్యవహరించారు. అప్పటి వైసీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి పేదల భూములను పెద్దలకు కట్టబెట్టారు. అయితే ఈ అక్రమాలన్నీ విచారణలో బయటపడ్డప్పటికీ చర్యలు తీసుకోవడంలో మాత్రం జాప్యం జరుగుతోంది. ఆరు నెలలు గడిచినా ఇంత వరకూ ఫ్రీహోల్డ్ భూములపై ఎటువంటి చర్యలు తీసుకోవాలన్న స్పష్టత ప్రభుత్వం నుంచి రాలేదని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. కాగా, విచారణ నేపథ్యంలో ప్రభుత్వం ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు నిలిపివేసింది. గడిచిన ఆరు నెలలుగా ఈ ఉత్తర్వులను పొడగిస్తూ వస్తోంది. తాజాగా మరో రెండు నెలలు ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై నిషేధాన్ని పొడిగించింది. ఈ ప్రక్రియతో నిజమైన అర్హులు ఇబ్బందులు పడుతున్నారు. వారి భూము లు కూడా రిజిస్ట్రేషన్ జరగకపోతుండటంతో అవసరానికి అమ్ముకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం త్వర గా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు

ఫ్రీహోల్డ్ భూములపై విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక పంపాం. గుర్తించిన లోటుపాట్లను అందులో పేర్కొన్నాం. మొత్తం వివరాలను పారదర్శకంగా ఆన్‌లైన్ చేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం. ఫ్రీహోల్డ్ భూములపై నిషేధం కొనసాగుతోంది.

- కే కార్తీక్, ఇన్‌చార్జి కలెక్టర్

అన్నీ కరెక్ట్‌గా ఉన్నాయా!?

'ఈ కాటా నీదేనా.. కరెక్ట్‌గా ఉందా!? ఏదైనా సమస్య ఉందా!? ఈ-పాస్ యంత్రం పని చేస్తోందా!? రెండింటికీ ఆన్‌లైన్ అనుసంధానం ఉందా!?' ఇలా తూనికలు, కొలతల శాఖ అధికారులు రేషన్ డీలర్ల వద్ద వాకబు చేశారు. ఆదివారం నుంచి నిత్యావసర సరుకులు డీలర్ల వద్దే ఇవ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ముందస్తుగా తూ.కొ శాఖ అధికారి జావీద్ శుక్రవారం మనుబోలు మండలంలోని కాటాలను, ఈ-పాస్ యంత్రాలను పరిశీలించారు. మూలన పడిన వాటికి సాంకేతిక సిబ్బంది ద్వారా మరమ్మతులు చేయించారు. అలాగే ఆన్‌లైన్ అనుసంధానమూ చేస్తున్నారు. ఇందుకోసం మండలంలోని 28మంది డీలర్లు కాటాలను, ఈపాస్ యంత్రాలు తీసుకువచ్చారు.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)

1 నుంచి దుకాణాల్లోనే రేషన్

నెల్లూరు (హరనాథపురం) : జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల వద్దే కార్డుదారులకు బియ్యం, చక్కెర ఇవ్వనున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఎండీయూ వాహనాలు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. 65 సంవత్సరాలు పైబడిన కార్డుదారులు, దివ్యాంగులకు మాత్రం ఇళ్ల వద్దనే ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆదివారాల్లో కూడా రేషన్ దుకాణాలు తెరిచి ఉంటాయని పేర్కొన్నారు.





పొగతోటలో మురుగు కాలువను తలపిస్తున్న రోడ్డు

ట్రంకురోడ్డుపై వర్షపు నీరు

నగరంలో భారీ వర్షం

నెల్లూరు (సిటీ), మే 30 (ఆంధ్రజ్యోతి) : రుతుపవనాల ప్రభావంతో జిల్లా అంతటా వర్షాలు కురుస్తున్నాయి. నెల్లూరులో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం నగరవాసులను ఇబ్బందులకు గురిచేసింది. గాంధీబొమ్మ కూడలి, ఆర్టీసీ, వీఆర్సీ జంక్షన్‌లతోపాటు ఆత్మకూరు బస్టాండ్, విజయమహల్‌గేట్, రామలింగాపురం, మాగుంట లేఅవుట్ ప్రాంతాలలోని అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిలిచింది. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర అంరాయం ఏర్పడింది. ఇటు గాలులు తోడవడంతో అక్కడక్కడా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అయితే, అధికార యంత్రాంగం వెంటనే రంగంలోకిదిగి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఆర్డీవో, అధికారులు



ఉత్సవాల్లో అన్ని వసతులు కల్పిస్తాం

- మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు
- వెంగమాంబ ఆలయాభివృద్ధికి కృషి
- సమన్వయ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే సురేష్

6

ఆ ఇద్దరు విద్యార్థులకు మార్కులు పెరిగాయ్!

జవాబుపత్రాల ట్యాంపరింగ్ వ్యవహారంపై ఇంటర్ బోర్డు సీరియస్

కందుకూరు పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థుల ఇంటర్మీడియట్ జవాబుపత్రాలను ఇన్విజిలేటర్ ట్యాంపరింగ్ చేసిన అంశంపై ఇంటర్మీడియట్ బోర్డు ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించి దిద్దుబాటు చర్యలు చేపట్టారు. పరీక్షాపత్రాల రీ వెరిఫికేషన్‌లో ట్యాంపరింగ్ నిజమని నిర్ధారించుకున్న ఇంటర్‌బోర్డు కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు వారిద్దరికీ మార్కులు కలిపి సవరించిన మార్కుల సర్టిఫికెట్లను జారీచేశారు.

- వివరాలు 6లో..



పొగ కబళిస్తోంది!

సరదాకనో.. లేదా ఒత్తిడి తగ్గించుకునేందుకనో మరేకారణాలతోనో అలవాటవుతున్న ధూమపానం చివరకు దానికి బానిసలుగా మారిపోతున్నారు. సిగరెట్.. గుట్కా... పాన్.. కొన్ని రకాల కిళ్లీలు.. ఇలా పొగాకు ఉత్పత్తులు మనిషి మనుగడకే ప్రమాదకరంగా మారుతున్నాయి. వయసుతో నిమిత్తం లేకుండా బాలురు సైతం ఈ పొగాకుకు బానిసలు మారి మృత్యువుకు చేరువ అవుతున్నారు. దూమపానం సేవించే వారిలో 80 నుంచి 90 శాతం మంది ఊపిరితిత్తులు, గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. జిల్లా జనాభాలో 8 లక్షల మందికిపైగా పొగాకు ఉత్పత్తులు వినియోగిస్తున్నట్టు అంచనా. సంవత్సరానికి సుమారు రూ.1,320 కోట్ల వ్యాపారం జిల్లాలో పొగాకు వ్యాపారం జరుగుతోందంటే వినియోగం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పొగాకు నియంత్రణకు ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తీసుకువస్తున్నా ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా ప్రత్యేక కథనం...

6 లో..

- పొగాకుతో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- గుండె, ఊపిరితిత్తుల పైనే ఎక్కువ
- జిల్లాలో ఏటా 2 వేల మందికిపైగా మృతి
- వైద్యుల హెచ్చరికలు డోంట్‌కేర్..
- ఏటా రూ.1,320 కోట్ల వ్యాపారం
- నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం

ఎన్డీసీఎంఎస్, డీసీసీబీ చైర్మన్ల నియామకం

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

నెల్లూరు (హరనాథపురం) మే 30 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (ఎన్డీసీఎంఎస్), నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు (డీసీసీబీ) చైర్మన్‌లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్డీసీఎంఎస్ చైర్మన్‌గా గంగోలు నాగేశ్వరరావును, ఎన్‌డీసీసీబీ చైర్మన్‌గా మెట్టుకూరు ధనుంజయరెడ్డిని నియమిస్తూ ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం జీవోలు విడుదల చేసింది. కాగా, వెంకటగిరికి చెందిన గంగోలు నాగేశ్వరరావు గతంలో స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా, పెంచలకోన ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా పని చేశారు. ఇక అనంతసాగరం మండలం లింగంగుంటకు చెందిన మెట్టుకూరు ధనుంజయరెడ్డి 2013- 19 మధ్య ఎన్‌డీసీసీబీ చైర్మన్‌గా పనిచేశారు. అయితే ఒక చైర్మన్‌తోపాటు ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయడం ఆనవాయితీ. కాగా, ప్రస్తుతం చైర్మన్లను పర్సన్ ఇన్‌చార్జ్‌గా పేర్కొంటూ జీవో విడుదల చేయడం గమనార్హం

పలకరేం!

విద్యుత్ కొరత, పెరుగుతున్న వినియోగం, అధిక బిల్లుల సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం వినూత్న ఆలోచన చేసింది. సూర్య ఘర్ పీఎం పథకం ద్వారా వినియోగదారుల ఇళ్లపై సోలార్ పలకల ఏర్పాటుకు సంకల్పించింది. ఎంతో మహోన్నత ఆశయంతో ప్రవేశపెట్టిన ఈ పథకంపై వినియోగదారుల్లో స్పందన కరువవుతోంది. జిల్లాలో దాదాపు పది లక్షలకుపైగా విద్యుత్ సర్వీసులు ఉండగా కేవలం 2 వేల దరఖాస్తులు మాత్రమే అందాయి. వీటిలో 1,400 ఇళ్లపై సోలార్ పలకలు అమర్చారు.



- సోలార్ విద్యుత్‌కు స్పందన కరువు
- ఉన్న సర్వీసులు 10 లక్షలపైనే.. వచ్చిన దరఖాస్తులు 2 వేలే
- వీటిలో 1,400 సోలార్ ప్యానళ్ల ఏర్పాట్లు
- వినియోగదారుల నుంచి కానరాని స్పందన

నెల్లూరు (జడ్పీ), మే 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సోలార్ విద్యుత్ కోసం ఇప్పటిదాకా కేవలం 1400 కనెక్షన్లు మాత్రమే వినియోగదారులు తీసుకున్నారు. జిల్లావ్యాప్తంగా గృహాలు, వాణిజ్యానికి సంబంధించి 8.36 లక్షలు, వ్యవసాయానికి 1.3 లక్షల సర్వీసులు ఉన్నాయి. ఈ వినియోగదారులకు సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించి, కనెక్షన్లు విస్తృతంగా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించింది. అయితే దీనిపై వినియోగదారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఇప్పటివరకు కేవలం 2 వేల మేర దరఖాస్తులు రాగా అందులో 1400 వినియోగదారులు సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకున్నారు. గృహాలు, వాణిజ్య సముదాయాలతోపాటు వ్యవసాయానికి, ప్రభుత్వ కార్యాలయాలకు, వీధిలైట్లు, తాగునీటి సరఫరాకు సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లులు భారీగా తగ్గుతాయి. అయితే ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ విద్యుత్ ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాలేదు. దీంతో సోలార్ పలకలకు అయ్యే ఖర్చు ఎవరు భరిస్తారన్న దానితో ప్రభుత్వ కార్యాలయాలు ముందుకు రావడం లేదు.

సబ్సిడీ ఇలా...

ఒక కిలోవాట్ సోలార్ ఏర్పాటుకు రూ.70 వేల నుంచి 80 వేల వరకు ఖర్చు అవుతుంది. రెండు కిలోవాట్స్‌కు రూ.1.30 లక్షల నుంచి 1.40 లక్షల వరకు, మూడు కిలోవాట్స్‌కు రూ.2.10 లక్షల నుంచి 2.20 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ఇం దులో కేంద్ర ప్రభుత్వం ఒక కిలోవాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్స్‌కు రూ.60 వేలు, మూడు కిలోవాట్స్ రూ.78 వేలు చొప్పున సబ్సిడీ మంజూ రు చేస్తుంది. అలాగే వినియోగదారుడు మొత్తం సొమ్ము ఒకేసారి ఖర్చు పెట్టాల్సిన అవసరం లేకుండా బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాన్ని ప్రభుత్వమే కల్పిస్తుంది. నాలుగేళ్లలో సులభతర వాయిదాలలో తిరిగి రుణాన్ని చెల్లించే వెసులుబాటు ఉంటుంది.

విద్యుత్ శాఖ మాత్రమే ప్రచారం

అనుకున్న ప్రకారం జిల్లాలో సోలార్ పలకలు ఏర్పాటు చేయాలంటే అన్ని శాఖల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు సమిష్టిగా వినియోగదారులలో అవగాహన తీసుకురావాలి. అప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. అయితే, విద్యుత్ శాఖ తప్ప పాలకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఇతర శాఖల అధికారులు పెద్దగా దృష్టి సారించడం లేదనే అపవాదు ఉంది.

ఎస్సీ, ఎస్టీ ఇళ్లకు ఏవీ!?

జిల్లాలో ఉచితంగా విద్యుత్‌ను అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ కాలనీల ఇళ్లకు సూర్యఘర్ పీఎం పథకం ద్వారా సోలార్ పలకలను ఏర్పాటు చేసి ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని నిర్ణయించింది. ఇందుకోసం ఎస్సీ, ఎస్టీల కాలనీలకు చెందిన 50 వేల ఇళ్లకు అధికారులు రిజిస్ట్రేషన్ చేయించారు. అయితే ఇంతవరకు వాటికి కూడా సోలార్ పలకలు ఏర్పాటు చేయలేదు. దీంతో జిల్లాలో సోలార్ విద్యుత్‌కు స్పందన పూర్తిగా కరువై ఉంది.

10 వేల కనెక్షన్లు ఇవ్వనున్నాం

సోలార్ పలకల ఏర్పాటుపై వినియోగదారులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాము. అయినా ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రావడం లేదు. మరింత శ్రద్ధ పెట్టి తొలివిడతలో 10 వేల కనెక్షన్లు ఇచ్చేలా ప్రయత్నిస్తున్నాము.

- విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250
కోడిగుడ్ల ధర (100): 525	

పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

కందుకూరు, మే 30(ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ, లింగ ఎంపికల ఆధారిత గర్భస్రావాల కారణంగా తలెత్తిన లింగనిష్పత్తి సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని కఠినంగా అమలు చేసేందుకు వైద్యఆరోగ్య శాఖ, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేసి సత్ఫలితాలు సాధించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రజనీ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 16 స్కానింగ్ సెంటర్లను తనిఖీలు చేసి తగు ఆదేశాలు జారీ చేయటంతో పాటు చట్టం అమలు కోసం ఏర్పాటైన కమిటీ సమావేశం నిర్వహించి అమలు సూచనలు చేశారు. సమావేశంలో కమిటీ సభ్యులుగా ఉన్న డాక్టరు శైలజ, డాక్టరు హరికృష్ణ, డాక్టరు కొండయ్య, పట్టణ ఎస్ఐ సాంబశివయ్య, ఆరోగ్య అధికారులు పద్మావతి, ప్రేమలత, జే. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సరే.. డ్రైనేజీ కాలువలు ఏవీ!


ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న మురుగునీరు

కావలి మండలం ఆముదాలదిన్నెలో ఇటీవల సీసీ రోడ్డు నిర్మించారు. అయితే ఇళ్ల నుంచి వచ్చే మురుగు, వర్షం నీరు వెళ్లడానికి డ్రైనేజీ కాలువలు నిర్మించడం విస్మరించారు. దీంతో వర్షం వచ్చినప్పుడల్లా రోడ్డు పక్కన, ఇతర ప్రాంతాల్లో నీరు నిల్వ చేరుతోంది. దీనికి తోడు ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు సైతం వెలుపలకు వెళ్లే అవకాశం లేక ఎక్కడికక్కడ మడుగుకట్టి దుర్వాసన వెదజల్లుతోందడంతో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఈ మడుగులు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారి ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఈ క్రమంలో గ్రామంలోని మండపానికి సమీపంలో పాత సీసీ రోడ్డు పల్లంగా ఉండడంతో ఇళ్లలోని మురుగు నీరు రోడ్డుపై చేరి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ విషయం గుర్తించిన స్థానిక టీడీపీ నేత ఉప్పాల దినేష్ శుక్రవారం ఎక్స్‌కవేటర్‌తో కాలువ ఏర్పాటు చేయించి రోడ్డుపై నిల్వ చేరిన మురుగు నీటిని తొలగింప చేశారు. సీసీ రోడ్డు నిర్మించిన కూటమి ప్రభుత్వం డ్రైనేజీ కాలువలు కూడా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.


కాలువలు లేక రోడ్డు పక్కన నిల్వ చేరిన మురుగు నీరు

- కావలిరూరల్,(ఆంధ్రజ్యోతి)

ఇది మురుగు గుంత కాదండోయ్!


మురుగు నీటితో నిండిన మంచి నీటి వాల్వుపిట్ గుంట

ఈ ఫొటోలో కనిపిస్తున్న గుంత మురుగు నీటి నిల్వ గుంత కాదండోయ్... ప్రజలకు మున్సిపాల్టీ సరఫరా చేసే మంచినీటి వాల్వుపిట్ గుంత. వాస్తవానికి మంచినీటి సరఫరాలో నియంత్రణకు ఏర్పాటు చేసిన వాల్వ్‌పిట్ గుంతపై మూత బండ వేసి వాల్వ్‌ను తిప్పుకునేందుకు అవసరమైన రంధ్రం మాత్రమే ఉంచాలి. కానీ కావలి ట్రైవ్ రోడ్డులో ఆర్వోబీ వంతెన సమీపంలో ఉన్న ఈ వాల్వుపిట్ గుంతపై మూత బండలేకుండా ఉండటమే కాక అది తరచూ లీక్ అవుతుండటంతో అగుంతలో ఎప్పుడూ నీరు నిలిచి దానిలో పందులు తదితరాలు పొర్లాడి మురుగునీటి గుంత కన్నా హీనంగా తయారైంది. మంచినీటి సరఫరా ఆగిపోయినపుడు ఈ మురుగు నీరు తిరిగి మంచినీటి పైపులోకి వెళ్లి మంచినీరు కలుషితం అవుతోంది. అధికారులు స్పందించి వాల్వుపిట్ గుంతలో మురుగునీరు చేరకుండా చర్యలు చేపట్టాలి.

- కావలి, (ఆంధ్రజ్యోతి)

ఇళ్ల ముంగిట మురుగు!

కావలి పట్టణంలోని ఆర్వోబీ వంతెన ఉత్తరం వైపున ఉన్న ప్రధాన డ్రైన్‌ఈ కాలువలో మురుగు ముందుకు కదలక ఇళ్ల ముంగిట చేరింది. ఆ డ్రైనేజీ కాలువ పూర్తిగా బందంతో మూసివేయడంతో మురుగు నీరు పారుదలకు తరచూ అంతరాయం ఏర్పడుతోంది. ఆ డ్రైన్ నిర్మాణం చేపట్టలంటే దాని పక్కనే ఉన్న ప్రధాన మంచినీటి పైపులైను మార్చాల్సి ఉంది. అయితే 5 రోజుల కిందట ఆ ప్రాంతంలోని చర్చి సమీపంలో ప్రధాన పైపులైన్ పగిలి పోవటంతో అక్కడ తవ్వి మరమ్మతులు చేపట్టారు. ఆ సమయంలో పక్కనున్న డ్రైన్‌లోకి గుంత


మంచినీటి పైపులైన్ పగిలిన చోట డ్రైనేజీ కాలువలో ముందుకు సాగని మురుగు


దారా వారి వీధిలో ఇళ్ల ఆవరణలోకి వచ్చిన మురుగు

లోని నీరు, మట్టిని వేయడంతో అది కాలువలోకి జారి కాలువ పూర్తిగా స్తంభించింది. దానిలో పూడిక తీయాలంటే పక్కనే దానిపైన కాశ్వత ప్రాతిపదికన వేసిన మూత బండలను తొలగించాలి. దీంతో మున్సిపల్ అధికారులు పట్టించుకోవటం లేదు. ఈ క్రమంలో ఆ డ్రైన్‌లోకి వచ్చే అనుసంధాన కాలువల్లోని మురుగు నీరు ముందుకు వెళ్లడంలేదు. దాని పక్కనే ఉన్న దారావారి వీధిలో మురుగు నీరు ముందుకు పోక ఇళ్ల ఆవరణలోకి వస్తోంది. మున్సిపల్ అధికారులు స్పందించి ప్రధాన డ్రైన్ పూడికతీసి మురుగు నీటి పారుదలకు ఉన్న ఆటంకాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

- కావలి, (ఆంధ్రజ్యోతి)



సీజనల్ వ్యాధుల నియంత్రణకు వ్యాక్సినేషన్
● మర్రిపూడి మధు, పశువైద్యాధికారి, సాయిపేట క్లస్టర్

కొండాపురం, మే 30(ఆంధ్రజ్యోతి): పశువులు, గొర్రెలు, మేకలు తదితర జీవాలకు సీజనల్‌గా సంక్రమించే వ్యాధుల నియంత్రణకు ముందుగానే వ్యాక్సినేషన్ వేస్తాం. ముఖ్యంగా తొలకరి సీజన్‌లో నేలమురక, గుండెజబ్బు, గొంతువాపువ్యాధి(గేదెలు, జీవాలు)లకు గిట్టలు పుండ్లు ఏర్పడుట తదితర వ్యాధులపై రైతులకు అవగాహన కల్పిస్తాం. క్లస్టర్ పరిధిలో పశువులు, జీవాలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు రైతులను సమాయత్తం చేస్తున్నామని సాయిపేట క్లస్టర్ పశువైద్యాధికారి మర్రిపూడి మధు తెలిపారు.

? క్లస్టర్ పరిధిలో ఎన్ని పశువులు, జీవాలు ఉన్నాయి.

! సాయిపేట క్లస్టర్ పరిధిలోని 16 గ్రామాల్లో 320 గేదెలు, 6200 గేదెలు, 13000 జీవాలు ఉన్నాయి.

? పాడి రైతులకు రాయితీ పథకాలు అందుతున్నాయా.

! తెల్ల రేషన్‌కార్డు కలిగిన పాడి రైతులకు 50 శాతం రాయితీపై పశుదాణా అందజేస్తున్నాం. 50 కేజీల దాణా బస్తా వాస్తవ ధర రూ.1110. దానికి రైతు కేవలం రూ.555 చెల్లించి వైద్యశాలవద్ద పొందవచ్చు.

? పశు బీమా పథకానికి రైతులు ఎంత ప్రీమియం చెల్లించాలి.

! సాధారణ గేదెలు ఒక్కదానికి 3 ఏళ్ల కాలపరిమితితో రూ.149, హైబ్రిడ్, సంకర జాతి గేదెలకు రూ.298 చెల్లించాలి. నాటు గేదె మరణిస్తే రూ.15 వేలు, హైబ్రిడ్, సంకర జాతి గేదెలకు రూ.30 వేలు ప్రభుత్వం అందిస్తుంది. జీవాలకు ఏడాది కాలపరిమితికి రూ.36 చెల్లిస్తే మరణిస్తే రూ.6 వేలు చెల్లిస్తుంది.

? క్లస్టర్ పరిధిలో సిబ్బంది కొరత ఉందా.

! సాయిపేట క్లస్టర్ పరిధిలోని సాయిపేట పశువైద్యశాలలో 15 ఏళ్ల నుంచి వెటర్నరీ అసిస్టెంట్, కొమ్మి పశువైద్యశాలలో 10 ఏళ్ల నుంచి అటెండర్ పోస్టు ఖాళీగా ఉన్నాయి.

గిట్టుబాటు ధర కల్పనకు ప్రభుత్వం కృషి

● కందుకూరు-2 వేలం కేంద్రంలో పొగాకును పరిశీలించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు


కందుకూరు 2 పొగాకు వేలం కేంద్రంలో వేలం తీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, రైతు ప్రతినిధులు

కందుకూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): పొగాకు కు గిట్టుబాటు ధర కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, రైతులు అధైర్యపడవద్దని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. స్థానిక పామూరు రోడ్డులోని కందుకూరు-2 పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం ఆయన వేలంను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, బోర్డు అధికారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎగుమతిదారులతో మాట్లాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పనకు చర్యలు తీసుకోవాలని, లో గ్రేడ్ పొగాకుకు కొంత పర్చేజింగ్ ధరలు పెంచి ఇవ్వాలని కోరారు. రైతులు ఆందోళన చెందకుండా వారికి అన్నిగ్రేడ్‌లకు గిట్టుబాటు ధర లభించేలా బోర్డు అధికారులు వ్యాపారులు, రైతులతో సమన్వయం చేసి వేలం నడిచేలా చూడాలని సూచించారు. పలువురు రైతులు గత ఏడాది మీడియం గ్రేడ్‌కు కూడా కిలోకు రూ.28వేలు నుంచి 30 వేలు వరకు ధర లభించిందని, అయితే ప్రస్తుతం కొద్దిశాతం బేళ్లకు రూ.28వేల ధర చూయించి అధికశ్శాతం దరకే కొంటున్నారన్నారు.ఈ కార్యక్రమంలో పొగాకుబోర్డు ఆర్ఎం లక్ష్మణరావు, బోర్డు అధికారులు, రైతుప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నిరుపేదల వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం అందించటంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో ఉదారంగా స్పందిస్తున్నారని, సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 27 మందికి మంజూరైన రూ.24.56 లక్షల చెక్కులను శుక్రవారం సాయంత్రం ఆయన బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, నాదెండ్ల వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గుడ్లూరు, మే 30(ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని రికార్డులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల సంఖ్య, వారికి అందుతున్న వైద్య సేవలను గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని మందుల విభాగాన్ని పరిశీలించి రోగులకు ప్రతి రోజు అందిస్తున్న మందుల వివరాలను తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది ప్రతి రోజు సమయపాలన పాటిస్తు పనిచేయాలన్నారు. ఎక్కడకూడా వ్యాధిగ్రస్తులు ఇబ్బందులు ఎదుర్కొకుండా చూడాలని సూచించారు. గ్రామాల్లో నర్సులు నిర్వహించి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రమ్యారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, తదితర నాయకులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ యోగాలో భాగస్వామ్యం కావాలి


యోగాసనాలు వేస్తున్న అధికారులు, సిబ్బంది

కావలి రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి జీవితంలో యోగా ఒక భాగం కావాలని, యోగాతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీదేవి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సచివాలయ సిబ్బందికి యోగాపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీదేవి మాట్లాడుతూ జూన్ 21న మండల స్థాయిలో జరిగే యోగా దినోత్సవ కార్యక్రమానికి అందరు హాజరై జయప్రదం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరులో శిక్షణ పొందిన యోగా మాస్టర్ ట్రైనర్లు చంద్రిక, రేణుక, విజయభారతి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా అహిల్యా బాయి హోల్కర్ జయంతి


జయంతి కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నేతలు

కందుకూరు, మే 30(ఆంధ్రజ్యోతి): పుణ్య శ్లోక అహిల్యా బాయి హోల్కర్ జయంతి వేడుకలను శుక్రవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బీజేపీ నాయకులతో పాటు కావలి పట్టణ బీజేపీ మాజీ అధ్యక్షుడు కుట్టుబోయిన బ్రహ్మానందం యాదవ్ ఈ కార్యక్రమంలో పాల్గొని అహిల్యా బాయి జీవితవిశేషాలను, మూడు శతాబ్దాల క్రితమే జాతి నిర్మాణం కోసం ఆమెచేసిన కృషిని వివరించారు. మరుగునపడిన మహనీయుల త్యాగాలను వెలుగులోకి తెస్తేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేస్తున్న కృషి శ్లాఘనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరు నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు గట్టమనేని హరిబాబు, పార్టీ నాయకులు మన్నేపల్లి వరప్రసాదరావు, ఇన్నమూరి సుధాకర్, చల్లా వెంకటరాజా, కూరపాటి డేవిడ్, ఉన్నం బాస్కరరావు, మాల్యాద్రినాయుడు, బొర్రా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి రేషన్ షాపుల్లో నిత్యావసరాల పంపిణీ

కొండాపురం, మే 30(ఆంధ్రజ్యోతి): జూన్ 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల వద్దనే సరుకులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తహసీల్దారు కోటేశ్వరరావు తెలిపారు. ఈ విషయంపై మండలంలోని 34 రేషన్ దుకాణాల డీలర్లకు శుక్రవారం తన కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. డీలర్లు ప్రభుత్వం సూచించిన నిర్దిష్ట సమయం ప్రకారం అందుబాటులో ఉండి వినియోగదారులకు సక్రమంగా, తూకాలలో తేడాలేకుండా సరుకులను పంపిణీచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఏఐటీయూసీ నియోజకవర్గ మహాసభ

కందుకూరు, మే 30(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ కందుకూరు నియోజకవర్గ మహాసభను జూన్ 1న స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు కె.మాలకొండయ్య, వై. ఆనంద్‌మోహన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్‌కిషోర్ ఈ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొని కార్మిక చట్టాల గురించి వివరిస్తారని తెలిపారు. ఏఐటీయూసీకి అనుబంధంగా ఉన్న వివిధ కార్మికసంఘాల ప్రతినిధులు, కార్మికులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కోదండ రామాలయ వార్షికోత్సవం


విశేష పూజలు అందుకున్న సీతారామ లక్ష్మణులు

కందుకూరు, మే 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెవెన్యూ కాలనీ ఉన్న కోదండరామాలయంలో 20వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు, ఆలయ అర్చకుల గుంటూరు శ్రీనివాసమూర్తి స్వామివారికి విశేష పూజలు నిర్వహించటంతో పాటు అర్చన, అభిషేకాలను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

గుడ్లూరు, మే 30(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చేవూరు గ్రామ సీపీఎం నాయకుడు, విశ్రాంత వీఆర్వో నూతలపాటి వెంకటేశ్వర్లు సతీమణి రమాదేవి అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ.శ్రీనివాసరావు శుక్రవారం చేవూరుకు చేరుకుని ఆమెకు ఘన నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాగా రమాదేవి మృతదేహాన్ని పరిశోధనల నిమిత్తం కుటుంబ సభ్యులు ఒంగోలు రిమ్స్‌కు అప్పగించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గంటిసపల్లి వెంకటేశ్వర్లు, గౌస్, జీవీబీ కుమార్, కొట్టె వెంకయ్య, పసుపులేటి పెంచలయ్య, దామా కృష్ణయ్య, కూరపాటి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.


రమాదేవికి నివాళులర్పిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, తదితరులు

నేడు పింఛన్ల పంపిణీ

లింగసముద్రం, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామా ల్లో శనివారం ఉదయం పింఛన్లు పంపిణీ చేయాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు సచివాలయ సిబ్బంది, ఇతర శాఖల సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జూన్ 1న ఆదివారం కావడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేస్తామని చెప్పారు. మండలంలో అన్ని రకాల పింఛన్ల లబ్ధిదారులు 5198 మంది ఉన్నారని చెప్పారు.

ఉపాధి పనుల పరిశీలన

వలేటివారిపాలెం, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంతవారిపాలెంలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఏపీఓ దయాసాగర్ పరిశీలించారు. ఎండలను దృష్టిలో పెట్టుకొని ఉదయం 6 గంటలకు పనులకు వెళ్లి తిరిగి 10 గంటల్లోపు ఇళ్లకు వెళ్లాలని సూచించారు. అనంతరం మస్టర్లను పరిశీలించారు.

నేడు రోటరీ స్వర్గధామంలో
దహనశాలలకు శంకుస్థాపన


ఎమ్మెల్యే కృష్ణారెడ్డిని కలిసిన రోటరీ క్లబ్ బాధ్యులు

కావలి, మే30(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ ఉత్తర శివార్లలోని రోటరీ స్వర్గధామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న నాలుగు దహనశాలలకు శనివారం ఉదయం శంకుస్థాపన కార్యక్రమం చేపట్టనున్నట్లు రోటరీ బాధ్యులు తెలిపారు. దాత అంకిపల్లి రమేష్‌రెడ్డి సహకారంతో రూ.40 లక్షలతో నిర్మించనున్న ఈ దహనశాలల శంకుస్థాపనకు రావాలని శుక్రవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డిని కావలిలోని ఆయన నివాసంలో రోటరీ బాధ్యులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్వర్గధామం చైర్మన్ డాక్టర్ మాదవరెడ్డి, రోటరీక్లబ్ చైర్మన్ స్వర్ణలత, దాత అంకిపల్లి రమేష్‌రెడ్డి, నల్లూరు రమేష్, బుర్రా శ్రీధర్‌రెడ్డి, జీ.రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల


తిరుమల శ్రీవారి సన్నిధిలో ఉదయగిరి, గన్నవరం, మార్కాపురం ఎమ్మెల్యేలు కాకర్ల, యార్లగడ్డ, కందుల

జలదంకి, మే 30(ఆంధ్రజ్యోతి): కడపలో మూడు రోజులపాటు జరిగిన తెలుగుదేశం మహానాడు విజయవంతం కావడంతో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శుక్రవారం తిరుమల చేరుకుని వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నారు. మహానాడు టీడీపీ కుటుంబసభ్యులు తరలివచ్చి తిరిగి వారివారి ఇళ్లకు సురక్షితంగా చేరుకోవడంలో ఎలాంటి అవరోధాలు, ఇబ్బందులు కలగకుండా చేయాలని తాను వేంకటేశ్వర స్వామిని కోరుకున్నానని, నియోజకవర్గ ప్రజలు మహానాడుకు వెళ్లి సుర క్షితంగా వారివారి నివాసాలకు చేరుకోవడంతో దేవదేవుడిని దర్శించుకుని మొక్కు చెల్లించానని కాకర్ల పేర్కొన్నారు. గన్నవరం, మార్కాపురం ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, కందుల నారాయణరెడ్డితో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు.

ప్రత్యేక పీజీఆర్ఎస్‌కు 11 అర్జీలు


అర్జీ పరిశీలిస్తున్న కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

బిట్రగుంట, మే 30 (ఆంధ్రజ్యోతి): బోగోలు ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు భూ సమస్యలపై 11 అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసమని ప్రతి సోమవారం గ్రీవెన్స్ నిర్వహించడం సర్వసాధారం అన్నారు. అయితే రైతుల భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకే ప్ర త్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేశామన్నారు. వచ్చిన అర్జీలను పరిశీలించిన ఆర్డీవో సంబంధిత వీఆర్వోలకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దారు సురేష్‌బాబు, డిప్యూటీ తహసీల్దారు భరత్ కుమార్, వెవెన్యూ ఇన్‌స్పెక్టర్, అన్ని పంచాయతీల వీఆర్వోలు, కంప్యూటర్ ఆపరేటర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నోటీసులు ఇచ్చి ఆక్రమణలు తొలగిస్తాం


మాట్లాడుతున్న ఎంపీడీవో నరేంద్రదేవ్

వలేటివారిపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శింగమనేనిపల్లెలో సర్వే నెంబరు 25, 26, 27లలో 6.26 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురైందని, ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి తొలగిస్తామని ఎంపీడీవో నరేంద్రదేవ్ తెలిపారు. దీనిపై శింగమనేనిపల్లి గ్రామానికి చెందిన దిడిపోగు వెంకటేశ్వర్లు గతంలో గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం శింగమనేనిపల్లి పంచాయతీ పరిధిలోని ఎంపీపీ స్కూల్‌లో గ్రామ సర్పంచ్ అత్తోటి జయమ్మ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన

వలేటివారిపాలెం, మే 30(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొంతవారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం బాలికలకు కిశోరి వికాసంపై సూపర్‌వైజర్ సునీత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా పోలీస్ సుమలత, కార్యదర్శి వెంకటేశ్వర్లు బాలికలు పాల్గొన్నారు.

● విట్రగుంటు: నాగులవరం పంచాయతీ దొతవారిలోని అంగన్వాడీ సెంటర్‌లో కిశోరి వికాసం - వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ సుప్రజ, ఇంచార్జి కార్యదర్శి సుజన, గ్రామ మహిళా పోలీసు శైలజ, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

బోగోలులో సమైక్యత యాత్ర

బిట్రగుంట, మే 30(ఆంధ్రజ్యోతి): బోగోలు, ఇబ్రహీంపేట పంచాయతీలో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో సమైక్యత యాత్ర నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తుమ్మల వెంకయ్య, టీ.మాల్యాద్రి, ఎస్.రామయ్య, జీ.మాల్యాద్రి, చల్లాసురేష్, అన్వర్‌బాషా పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఏవో సత్యవాణి

నూనె పంటల సాగుకు ప్రోత్సాహకాలు

● డీఏవో సత్యవాణి

కలిగిరి, మే 30(ఆంధ్రజ్యోతి): నూనె పంటల సాగుకు కేంద్రం అందించే ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి పేర్కొన్నారు. స్థానిక రైతుసేవా కేంద్రంలో శుక్రవారం ఆమె వ్యవసాయాధికారులతో కలిసి రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. రైతులకు వేరుశనగ కొత్త రకం వంగడం టాగ్-73 గురించి అవగాహన కల్పించారు. ఒక హెక్టార్‌కు 150 కేజీల విత్తనాలను నూరుశాతం రాయితీతో ఇవ్వనున్నట్లు తెలిపారు. టాగ్-24 వేరుశనగ రకంను ఎక్కువ కాలము నుంచి రైతులు సాగు చేయడం వలన అఫ్లోడ్‌టాక్సిన్ అనే విషపదార్థాన్ని తయారు చేసుకుంటుందని, తద్వారా మానవులకు ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు సోకే అవకాశముంటుందన్నారు. దీనికి బదులు టాగ్-73 అనే రకం రైతుకు పరిచయం చేస్తున్నామన్నారు. ఈ విత్తనాన్ని సాగు చేసిన రైతులు మరుసటి సీజన్‌కు సీడెడ్ విత్తనంగా ఉపయోగించుకొని ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు. దీనికి సంబంధించి రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా శిక్షణ అందిస్తామన్నారు. ఆసక్తిగల రైతులు చైతన్య ఆర్గనైజేషన్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు నర్సోజీరావు, శేషగిరి రావు, ఎఫ్‌పీవో చైర్మన్ మేదరమెట్ల వెంకటేశ్వర్లు, చైతన్య ఆర్గనైజేషన్ ఏడీఏ చంద్రభాను, ఏవో సురేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన సదస్సులు

● ఎస్పీ కృష్ణకాంత్



నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో మహిళలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైం), మే 30 (ఆంధ్రజ్యోతి) : శక్తి యాప్ ఆవశ్యకత గురించి జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రజలు అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్పీ జీ కృష్ణకాంత్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, షాపింగ్ మాల్స్‌తోపాటు పలు ప్రాంతాల్లో పోలీసు శక్తి బృందాలు మహిళలు, విద్యార్థినులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచం అన్నారు. మహిళలు, విద్యార్థినులు, బాలికలు వారి మొబైల్ ఫోన్లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయాల్లో పోలీసుల తక్షణ సహాయం పొందాలని సూచించారు.

న్యాయం కోసం ఓ ఇల్లాలు మౌనపోరాటం

బుచ్చిరెడ్డిపాళెం, మే 30 (ఆంధ్రజ్యోతి) : రేబాల దళితవాడలో న్యాయం కోసం ఓ ఇల్లాలు తన భర్త ఇంటిముందే నిరసనకు దిగింది. జొన్నవాడ దళితవాడకు చెందిన నెల్లూరు మల్లికార్జున కుమార్తె కల్యాణిని రేబాల దళితవాడకు చెందిన ప్రసన్నకుమార్ వివాహం చేసుకున్నాడు. అయితే, వేధించడమేగాక రెండు రోజుల క్రితం ఇంటినుంచి గెంటేయడంతో కల్యాణి తర భర్త ఇంటి ముందు నిరసన చేపట్టింది. విషయం తెలుసుకుని బంధువులు అక్కడికి చేరుకునేలోపు కల్యాణి అనారోగ్యానికి గురైంది. దీంతో బుచ్చిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరో మహిళతో వివాహేతర సంబంధంతోనే ప్రసన్నకుమార్ భార్యను వేధిస్తున్నట్టు బాధితురాలి బంధువులు తెలిపారు.

- పొగాకుతో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- గుండె, ఊపిరితిత్తులపైనే ఎక్కువ
- జిల్లాలో ఏటా 2 వేల మందికిపైగా మృతి
- వైద్యుల హెచ్చరికలు డోంట్‌కేర్.. ఏటా రూ.1,320 కోట్ల వ్యాపారం
- నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం

రూ.1,320 కోట్ల అమ్మకాలు

జిల్లాలో పొగాకు ఉత్పత్తుల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా ప్రతిరోజూ సిగరెట్లు, పాన్‌మసాలా, గుట్కాల విక్రయాలు రూ.3.66 కోట్లు ఉంటుంది. నెలకు రూ.110 కోట్లకుపైగా సాగే ఈ వ్యాపారం ద్వారానే పన్ను రూపేణా ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం వస్తున్నట్లు సమాచారం. ఏటా రూ.1320 కోట్లు పొగాకు ఉత్పత్తుల అవసరాల కోసం ఖర్చు చేస్తూ తమ శరీరాన్ని నిలువునా కాల్చేసుకుంటున్నారని పలు గణాంకాలు తెలియచేస్తున్నాయి.



పొగ కబళిస్తోంది!

నెల్లూరు (వైద్యం) మే 30 (ఆంధ్రజ్యోతి) : సిగరెట్.. గుట్కా.. పాన్ మసాలా.. కొన్ని రకాల కిళ్లీలు.. వంటి పొగాకు ఉత్పత్తులు మనిషి మనుగడనే శాసిస్తున్నాయి. సరదాగా ప్రారంభమై వీటికి బానిసలవుతున్న ఎందరో చివరకు మృత్యువుకు చేరువ అవుతున్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో వయసుతో నిమిత్తం లేకుండా బాలురు సైతం ఈ పొగాకు ఉత్పత్తులకు బానిసలు మారుతున్నారు. కొన్ని సర్వేల ప్రకారం జిల్లాలో 8 లక్షల మందికిపైగా పొగాకు ఉత్పత్తులకు బానిసలవుతున్నట్లు సమాచారం. పొగాకు ఉత్పత్తులలో ప్రమాదకరమైన 4వేల రకాల రసాయనాలు ఉన్నాయి. దీని ప్రభావం వల్ల శరీర అవయవాలు దెబ్బతిని ఏటా జిల్లాలో 2వేల మందికిపైగా మృతి చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ మే 31వ తేదీన ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం జరుపుకోవాలని తీర్మానించింది. ధూమపానం వల్ల ప్రాణాపాయం తప్పదంటూ ఈ ఏడాది నినాదాన్ని ఇచ్చింది.

● ప్రతి ఐదుగురిలో ఒకరు..

పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్రంలో నిర్వహించిన సర్వే ప్రకారం ప్రతి ఐదుగురిలో ఒకరు ధూమపానానికి, పాన్ ఉత్పత్తులకు అలవాటు పడుతున్నట్లు వెల్లడైంది. జిల్లా జనాభాలో 50 శాతం మంది పురుషులు, 7.1 శాతం మంది మహిళలు ఈ పొగాకు ఉత్పత్తులకు బానిసలవు తున్నట్లు తెలుస్తోంది. హైస్కూల్, కాలేజీ విద్యార్థులు వీటికి బాని సలు కావటం ఆందోళన కలిగించే అంశమే. ఏటా 9 శాతం మంది కొత్తవారు పొగాకు ఉత్పత్తులకు అలవాటు పడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. పొగాకు వాడకం వల్ల 40 శాతం వాడకందారులు కేన్సర్‌కు గురవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ధూమపానం సేవించే వారిలో 80 నుంచి 90శాతం మంది ఊపిరితిత్తుల వ్యాధులకు గురవుతున్నట్లు పలు పరిశోధనలు తెలియజేశాయి. ఊపిరితిత్తులు, గుండెకు సంబంధించిన 26 రకాల వ్యాధులు పొగాకు ఉత్పత్తుల వల్లే వస్తున్నాయి. బహిరంగ ప్రదే శాలలో ధూమపానం చేయరాదని, గుట్కాలు అమ్మరాదని ప్రభు త్వం నిబంధనలు విధించినా వాటిని పట్టించుకునే నాదుడే లేడు.

ఆరోగ్యాన్ని కరిగించేస్తుందిలా...

- గుండెజబ్బులకు సంబంధించి 30 శాతం ధూమపానం వల్లే సంక్రమిస్తున్నాయి.
- సిగరెట్ పొగను పీల్చటంవల్ల వెలువడే కార్సినోజెన్స్, నికోటిన్, రసాయనాల వల్ల గొంతులోని సున్నితమైన పొర మందగించి కేన్సర్‌కు దారితీస్తోంది.
- సిగరెట్ పొగ ఊపిరితిత్తులలో పేరుకుపోవటం వల్ల కఫం ఎక్కువై దగ్గు పొరలు మందగించి ఆ ప్రదేశంలో కణాలు దెబ్బతిని కేన్సర్ బారిన పడే అవకాశం ఉంది.
- శరీరానికి ఆక్సిజన్, పోషకాలను అందించే రక్తం సామర్థ్యం ధూమపానం వల్ల తగ్గుతుంది. దీంతోపాటు అత్యంత హానికరమైన కార్బన్, మొనాక్సైడ్, బయట కాలుష్యం కంటే 600 రెట్లు సిగరెట్‌లో ఉంది. ఇది ఆక్సిజన్ ప్రక్రియకు అవరోధంగా మారుతుంది.
- పొగ వల్ల చర్మంలోని రక్తకణాలు బిగుసుకుపోయి వయసుకు ముందే వృద్ధాప్య లక్షణాలు వస్తాయి.
- అల్సర్ వ్యాధికి దారి తీసే ధూమపానం వ్యాధి నిరోధక శక్తిని తగ్గించి అల్సర్ నివారణ కాదు.
- ఎముకలు పెలుసు బారి త్వరగా విరిగిపోయే అవకాశం ఉంది.
- గుట్కా, పాన్ మసాలా, కొన్ని రకాల కిళ్లీలు నమలటం వల్ల బుగ్గ లోపల చర్మం గట్టిగా మారుతుంది.
- నోట్లో కండరాల పోగులు మందంగా మారి స్పర్శ రహితమై నోరు తెరవలేని పరిస్థితి ఏర్పడుతుంది.
- నోటిలో పుండ్లు చేరి బుగ్గలు బొక్కలు పడే దుస్థితికి దారి తీస్తోంది.



పొగాకుతో ప్రాణాపాయమే!

పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సిగరెట్ పొగ పీల్చడం వల్ల ఆ పొగ ఊపిరితిత్తుల్లోకి చేరి రక్షణ వ్యవస్థను దెబ్బతీస్తోంది. లంగ్స్‌లో నెమ్ము చేరి తీవ్ర అనారోగ్యానికి దారి తీస్తోంది. తమను తాము శుభ్రం చేసుకునే గుణాన్ని ఊపిరితిత్తులు కోల్పోతాయి. సిగరెట్ మానివేయడానికి కొన్ని రకాల మందులు కూడా అందుబాటులో ఉన్నాయి. వాటి ద్వారా మానవచ్చు.

- డాక్టర్ జి.అరుణ, జీజీహెచ్ పల్మనాలజి హెచ్‌వోడీ

ఆ ఇద్దరు విద్యార్థులకు మార్కులు పెరిగాయ్!

● జవాబుపత్రాల ట్యాంపరింగ్ వ్యవహారంపై ఇంటర్ బోర్డు సీరియస్

● పెరిగిన మార్కుల సర్టిఫికెట్ల జారీ ● బాధ్యులపై విచారణకు కమిటీ

కందుకూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): కందుకూరులోని శ్రీగాయత్రీ కళాశాల విద్యార్థులు తన్నీరు సాయితేజశ్విని, ముప్పనేని అవినాష్ బాబులు తమకు వచ్చిన మార్కులపై అనుమానంతో రీ వెరిఫికేషన్‌కు వెళ్లగా జవాబు పత్రాల ట్యాంపరింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ కళాశాలకు పోటీ కళాశాలగా ఉన్న శ్రీ వివేకా కళాశాల పరీక్షా కేంద్రంలో ఈ విద్యార్థులు పరీక్షలు రాయగా అక్కడ ఇన్విజిలేటర్ సహకారంతో మెరిట్ విద్యార్థుల జవాబుపత్రాల ట్యాంపరింగ్ జరిగింది. ప్రాథమిక విచారణలో ట్యాంపరింగ్ నిజమని నిర్ధారించుకున్న ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యల్లో భాగంగా తొలుత వారిద్దరికీ అదనపు మార్కులు కలిపి, సర్టిఫికెట్లను శుక్రవారం విడుదలచేశారు. సాయితేజశ్వినికి ఇంగ్లీష్‌లో 5 మార్కులు కలిపి 93 చేయగా, మొత్తం మార్కులు 988కి పెరిగాయి. అలాగే ముప్పనేని అవినాష్‌బాబుకు ఇంగ్లీష్‌లో 4 మార్కులు కలిపి 84 చేశారు. మొత్తం 975కి పెరిగింది.

● శ్రీ వివేకా కళాశాలపై విచారణ

శ్రీ వివేకా జూనియర్ కళాశాలపై సమగ్ర విచారణకు కమిటీని నియమిస్తూ బోర్డు కార్యదర్శి ఆదేశాలు జారీ చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వీవీ సుబ్బారావు తెలిపారు. ఇప్పటికే ఆ ఇన్విజిలేటర్‌ను, కళాశాల ప్రిన్సిపాల్ ను పిలిపించి ప్రాథమికంగా విచారించినట్లు తెలిపారు. కమిటీ కూడా క్షేత్రస్థాయిలో సమ గ్రంగా విచారించి వారంరోజుల్లో నివేదిక అందజేస్తుందని తెలిపారు. తదుపరి కళాశాలపై, కారకుడైన ఇన్విజిలేటర్‌పెచర్యలు తీసుకుంటారని తెలిపారు.

హెల్త్ అసిస్టెంట్ల సర్దుబాటు బదిలీలు

● తిరుపతి, నెల్లూరు జిల్లాలకు వేరువేరుగా కౌన్సెలింగ్ ● ఉన్నతాధికారుల చొరవతో ప్రశాంతం

నెల్లూరు (వైద్యం) మే 5 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్ల సర్దుబాటు బదిలీల కౌన్సెలింగ్ శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. తిరుపతి, నెల్లూరు జిల్లాలకు చెందిన హెల్త్ అసిస్టెంట్లకు వేరువేరుగా కౌన్సెలింగ్ జరగటంతో ఉద్యోగులలో నెలకొన్న సందిగ్ధత తొల గింది. నెల్లూరు జిల్లాకు చెందిన 171 మంది, తిరుపతి జిల్లాకు చెందిన 57 మంది బదిలీలు జరిగిపోయాయి. రెగ్యులర్, కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్ల మధ్య చిన్నపాటి వివాదం చెలరేగడంతో ఈ నెల 28న జరగాల్సిన కౌన్సెలింగ్ వాయిదాపడి శుక్రవారం జరిగింది. తమను కాదని కాంట్రాక్టు ఉద్యోగులను జాబితాలో ముందు చేర్చడాన్ని రెగ్యులర్ హెల్త్ అసిస్టెంట్లు వ్యతిరేకించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతోనే జాబితా తయారు చేశామని జిల్లా అధికారులు వెల్లడించారు. దీంతో వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతిని కొందరు హెల్త్ అసిస్టెంట్లు కలిశారు. తమకు జరుగుతున్న అన్యాయాన్ని తెలియచేశారు. రెగ్యులర్ ఉద్యోగులకు ప్రాధాన్యమివ్వాలని ఆమె ఆదేశించడంతో అందుకు అనుగుణంగా జిల్లా అధికారులు జాబితా తయారు చేసి కౌన్సెలింగ్ నిర్వహించారు.



హెల్త్ అసిస్టెంట్ల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

నెల్లూరుకు బదిలీ చేయొద్దు

తిరుపతి జిల్లా పరిధిలోని హెల్త్ అసిస్టెంట్లు పలువురు నెల్లూరు పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వచ్చేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. అయితే తిరుపతి జిల్లా వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్, నెల్లూరు జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాతకు ఫోన్ చేసి తిరుపతి జిల్లాకు చెందిన హెల్త్ అసిస్టెంట్లకు తమ జిల్లాలోనే సర్దుబాటు బదిలీలు చేయాలని కోరారు. ఒకవేళ వారికి నెల్లూరు జిల్లాలో పోస్టింగ్ ఇస్తే వారికి జీతాలు పెట్టనని స్పష్టం చేయడంతో వారిని తిరుపతి జిల్లాలోనే బదిలీ చేశారు. మొత్తం మీద ఈ సర్దుబాటు బదిలీలు ప్రశాంతంగా జరిగాయి. డీఎంహెచ్‌వో సుజాత, ఏవో నిషాంత్ రెడ్డి, మలేరియా అధికారి హుస్సేనమ్మ, సూపరింటెండెంట్లు రషీద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్సీఈఆర్టీ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), మే 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌సీఈఆర్టీ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో ప్రవే శానికి జాతీయ స్థాయి ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి రమేష్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నా రు. ఎన్‌సీఈఆర్టీ రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ పలు కోర్సులను అందిస్తోందని తెలిపారు. రెండేళ్ల బీఎడ్, ఎంఎడ్, మూడేళ్ల సమీకృత బీఎడ్, ఎంఎడ్, నాలుగేళ్ల సమీకృత బీఏ బీఎడ్, బీఎస్సీ బీఎడ్, ఆరేళ్ల సమీకృత ఎమ్మెస్సీఎడ్, రెండేళ్ల ఎంఏ(ఎడ్యుకేషన్) కోర్సు ల్లో సీట్లు భర్తీ చేస్తున్నామనిఇ వివరించారు. దేశవ్యాప్తంగా అజ్మీర్ (రాజస్థాన్) భోపాల్ (మధ్యప్రదేశ్), భువనేశ్వర్ (ఒడిశా), మైసూర్ (కర్ణాటక), షిల్లాంగ్ (మేఘాలయ)లో ఎన్‌సీ ఈఆర్టీ కళాశాలలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. తాజాగా ఏపీలో కూడా ప్రాంతీయ విద్యాసంస్థను స్థాపించి పరిమిత సంఖ్యలో కోర్సులు నిర్వహిస్తోందని తెలిపారు. దీనిలో చేరేందుకు జూన్ 29న జరిగే ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షకు ఎన్‌సీఈఆర్టీ ఆర్‌ఐఈ వెబ్‌సైట్ ద్వారా జూన్ 17లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నిర్వహించే ఈ సంస్థలలో నామమాత్రపు ఫీజులతో ఉత్తమ విద్యను పొందడంతోపాటు ఉపకార వేతన సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు. ఆసక్తి గల వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ట్యాంకర్ - వ్యాన్ ఢీ

● ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుటూరు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం టమోటా లోడుతో రాంగ్ రూట్‌లో వచ్చిన మినీ వ్యాన్ ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు నుంచి గూడూరు వైపుగా ఆయిల్ ట్యాంకర్ వెళ్తుండగా గొలగమూడి క్రాస్ రోడ్డు నుంచి కాకుటూరు వైపుగా రాంగ్ రూట్‌లో వచ్చిన మినీ వ్యాన్ వేగంగా ఢీకొంది. దీంతో ట్యాంకర్ ముందు భాగం దెబ్బతింది. ప్రమాదానికి కారణమైన మినీ వ్యాన్ రహదారిపై బోల్తాపడింది. ఈప్రమాదంలో ట్యాంకర్‌లో ఉన్న క్లీనర్ శ్రీనాథ్‌కు గాయాలు కాగా మినీ వ్యాన్ డ్రైవర్ కూడా గాయపడ్డాడు. టమోటాల లోడుతో వెళ్తున్న మినీ వ్యాన్ బోల్తా పడడంతో టమోటాలు అన్ని రోడ్డు పాలయ్యాయి. ఈప్రమాదం రహదారి మధ్యలో జరగడంతో సుమారు కిలోమీటర్‌కు పైగా ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న వెంకటాచలం పోలీసులు ట్రాఫిక్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. రహదారిపై ఉన్న రెండు వాహనాలను క్రేన్ సహాయంతో పోలీసులు పక్కకు తొలగించారు. క్షతగాత్రులను 108 వాహనంలో నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అనుమానాస్పద మృతి

పొదలకూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోడేరు రోడ్డు బస్ షెల్టర్ వద్ద శుక్రవారం నక్కా లక్ష్మమ్మ (58) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. సమాచారం అందుకున్న సీఐ శివరామకృష్ణ, ఎస్‌ఐ హనీఫ్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సవాల్లో అన్ని వసతులు కల్పిస్తాం

● మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

● వెంగమాంబ ఆలయాభివృద్ధికి కృషి

● సమన్వయ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే సురేష్

దుత్తలూరు (ఉదయగిరి), మే 30 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 15 నుంచి 19వ తేదీ వరకు జరిగే శ్రీ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'ఉత్సవాల్లోనైనా వసతులు కల్పిస్తారా?' కథనం ప్రచురితమైంది. దీంతోపాటు ఉత్సవాల ఏర్పాట్లపై నర్రవాడ వెంగమాంబ ఆలయ ఆవరణలో అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భక్తులు, గ్రామస్థులు ఆలయంలో నెలకొన్న సమస్యలపై ఏకరువు పెట్టారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఉత్సవాలకు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించాలన్నారు. రద్దీ ప్రాంతాల్లో మంచినీరు ఏర్పాటు చేయడంతోపాటు మరుగుదొడ్ల వసతి కల్పించాలని ఆదేశించారు. దుకాణాల వద్ద ధరల పట్టిక ఏర్పాటు చేయాలన్నారు. ఉత్సవర్ల కల్యాణం ప్రతిఒక్కరు తిలకించేలా ఏర్పాటు చేయాలన్నారు. ఉత్సవాల సమయంలో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. అధికారులంతా సమన్వయంతో పని చేసి భక్తులకు వసతులు కల్పించి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆదేశించారు.



వెంగమాంబ ఆలయంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే, అధికారులకు వివరిస్తున్న గ్రామస్థులు

రూ.4.05 కోట్లు మంజూరు

ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వానికి రూ.6.8 కోట్లతో ప్రతిపాదనలు పంపగా రూ.4.05 కోట్లు మంజూరయ్యాయన్నారు. పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, పంచాయతీరాజ్, వైద్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం బ్రహ్మోత్సవాల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీవో వంశీకృష్ణ, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ కరుణాకర్ బాబు, ఈవో వెట్టిగుంట ఉషశ్రీ, సర్పంచ్ నాగయ్య, తహసీల్దారు నాగరాజు, ఎంపీడీవో మల్లికార్జున, టీడీపీ మండల కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం, నాయకులు గురవయ్యనాయుడు, గురవారెడ్డి, పలు శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగా రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి

● ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

నెల్లూరు (హరనాథపురం), మే 30 (ఆంధ్రజ్యోతి) : యోగాను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి యోగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ కే కార్తీక్ అధికారులను ఆదేశించారు. యోగాంధ్ర రిజిస్ట్రేషన్లపై అధికారులతో ఆయన చాం బర్‌లో శుక్రవారం సమీక్ష జరిపారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు తమ పొరుగు వారికి యోగాపై అవగాహన, ఆసక్తి కల్పించి రిజిస్టర్ చేసుకునేలా చూడాల న్నారు. క్యూ ఆర్ కోడ్, గ్రామవార్డు సచివాలయ యాప్ ద్వారా రిజిస్టర్ కావాలని చెప్పారు. జిల్లాలో సుమారు 10లక్షల మందిని రిజిస్టర్ చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 4.5లక్షల మంది నమోదయ్యారని మిగిలిన వారు కూడా నమోదయ్యే విధం గా చర్యలు తీసుకోవాల ని సూచించారు. శనివారం 10 నుంచి 18 ఏళ్లలోపు, 19 నుంచి 35 ఏళ్లు, 35 ఏళ్ల పైబడిన వారికి యోగా పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ వార్డు స్థాయిలో పోటీలు ముగింపు దశకు వచ్చాయని, మండల స్థాయిలో జూన్ 2 నుంచి 7వరకు, జిల్లాస్థాయిలో 9 నుంచి 14 వరకు పోటీలు నిర్వహించాలన్నారు. జూన్ 6వతేదీ నెల్లూరులో జిల్లా స్థాయి యోగా కార్యక్రమం రెసిడెన్షియల్ అసోసియేషన్ థీమ్‌తో జరుగుతుందని, దానికి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

సబ్సిడీ కోసం ఎండీ కార్యాలయానికి ఖాతాలు

నెల్లూరు (హరనాథపురం), మే 30 (ఆంధ్రజ్యోతి) : బీసీలు, ఈడబ్ల్యూఎస్, మేదర-కుమ్మరి, కాపు, జనరిక్ మెడికల్ షాపుల సబ్సిడీ రుణాలకు సంబంధించి బ్యాంకు ఖాతాల వివరాలు ఎండీ కార్యాలయానికి పంపినట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి తెలిపారు. ఈనెల 21న ఆంధ్రజ్యోతిలో వచ్చిన రుణాల కోసం ఎదురుచూ పులు కథనానికి ఆమె స్పందించారు. బీసీలకు సంబంధించి 1328 యూనిట్లు, ఈడబ్ల్యూఎస్‌కు సంబంధించి 410, మేదర-కుమ్మరికి సంబంధించి 100 యూనిట్లు, కాపులకు సంబంధించి 231 యూనిట్లు, జనరిక్ మెడి కల్ షాపులు 96 యూనిట్లు జిల్లాకు కేటాయించారని చెప్పారు. వీటి కింద నిరు ద్యోగ యువతకు రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు సబ్సిడీ రుణాల కోసం వివిధ యూనిట్లను ఎంపిక చేసి బ్యాంకుకు పంపినట్లు తెలిపారు. బ్యాంకు వారు ఇప్పటి వరకు బీసీలకు సంబంధించి 623 యూనిట్లు, ఈడబ్ల్యూఎస్‌కు సంబంధించి 107 యూనిట్లు, మేదర - కుమ్మరికి సంబం ధించి ఒక యూనిట్, కాపులకు సంబంధించి 64యూనిట్లు, జనరిక్ మెడికల్ షాపులు 2యూనిట్లు మంజూరు చేసి ఖాతాలు తెరిచారన్నారు. ఆ అకౌంట్ల ను బీసీ కార్పొరేషన్ వారు కలెక్టర్ ద్వారా విజయవాడలోని వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు సబ్సిడీ కోసం పంపినట్లు వివరించారు.

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు

● రాకపోకలకు ఇక్కట్లు ● పట్టించుకోని అధికారులు

విడవలూరు, మే 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో, పట్టణాల్లో, నగరాల్లో విద్యుత్ స్తంభాలు రోడ్డు మార్జిన్‌లో ఏర్పాటు చేస్తారు. అయితే మండల పరిధిలోని ఊటుకూరు, విడవలూరు మన్మధ రావుపేటలో మాత్రం రోడ్డు మధ్యలో ఏర్పాటు చేశారు. అలా ఎందుకు ఏర్పాటు చేశారన్న విషయం ఏవ్వరికీ అంతుపట్టడం లేదు. రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉండటంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ స్తంభాలను మార్చాలని స్థానికులు పలుమార్లు విద్యుత్ శాఖాధికారులకు ఫిర్యాదులు చేసినా వారు పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉండటంతో వాహనదారులు అదుపుతప్పి విద్యుత్ స్తంభాలకు ఢీకొని ప్రమాదాల భారీన పడుతున్నారు. ముఖ్యంగా విద్యుత్ లేని సమయాల్లో అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ప్రమాదలు జరుగుతున్నా విద్యుత్ శాఖాధికారులు మాత్రం వాటిని మార్చేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా ఆ రహదారిపై ట్రాక్టర్లు, వ్యాన్లు, ఆటోలు రాకపోకలు నిలిచిపోయాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలను రోడ్డు మధ్యలో నుంచి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



ఊటుకూరు, విడవలూరులో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు